అక్షర కలం తెలుగు దిన పత్రికలో
పదవి విరమణ, కోర్టు నోటీసులు,
జన్మదిన, వ్యాపార అభివృద్ధి కొరకు
మరియు అన్ని రకాల ప్రకటనలు ప్రచురించబడును.
సంప్రదించండి 93962 18955
aksharakalam@gmail.com
అక్షరకలం తెలుగు దినపత్రిక

epaper. aksharakalam. com

# అక్షరకలం

aksharakalam@gmail.com

తెలుగు దినపత్రిక

అక్షరకలం తెలుగు దినపత్రిక
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న 'అక్షర కలం'తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు మండలాల వారిగా, నియోకవర్గాలవారిగా, జిల్లాల వారిగా విలేకరులు, యాడ్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
గమనిక: డిగ్రీ ఉత్తీర్ణులు మరియు వివిధ పత్రికలలో పని చేసిన అనుభవం ఉన్నవారికి ప్రాముఖ్యత కలదు
epaper.aksharakalam.com
aksharakalam@gmail.com
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 93962 18955

సంపుటి : 17 సంచిక : 268 | 09-11-2025 ఆదివారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | హైదరాబాద్ | వరంగల్ | మహబూబ్‌నగర్ | పేజీలు : 12 వెల : రూ.1.00

## బిజెపికి ఎల్లవేళలా ప్రవాసుల
# ఆదరణ

- జూబ్లీహిల్స్ ఎన్నికల్లోనూ అండగా నిలవాలి
- కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్

2 లో..



ఇద్దరు సభ్యుల బీజేపీ.. ఇప్పుడు దేశంలోనే ఎక్కువ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీగా నిలవడంలో ప్రవాసీల పాత్ర మరువరానిదని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై పోలీసుల
# ప్రత్యేక ఆంక్షలు

- మద్యం దుకాణాలు, హొటళ్లు మూసివేత
- నియోజకవర్గం పరిధిలో 144 సెక్షన్ విధింపు

2 లో..

జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గ ఉపఎన్నికను పురస్కరించుకుని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ కీలక ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు వీలుగా నియోజకవర్గ వ్యాప్తంగా కఠిన ఆంక్షలు విధిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.




## రేవంత్ రెడ్డికి పుట్టినరోజు
# శుభాకాంక్షలు వెల్లువ

- శుభాకాంక్షలు తెలిపిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ
- రాజకీయా నేతలు, సినీ, క్రీడా ప్రముఖులు విష్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు 56వ పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు చెబుతున్నారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ .. తెలంగాణ సీఎం కు బర్త్ డే శుభాకాంక్షలు తెలిపారు.



2 లో..

## రేవంత్ భాష వీధి
# రౌడీలా ఉంది

- ఫీజు బకాయిలు చెల్లించకుండా బెదిరింపులా?
- యాజమాన్యాలను బెదిరించే ధోరణిలో ప్రభుత్వం
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విమర్శ

వివరాలు 2 లో..



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలను "తాట తీస్తా, తొక్కుతా" అంటూ సీఎం హెచ్చరించడాన్ని ఆమె తప్పుబట్టారు. సీఎం వాడిన భాష వీధి రౌడీలు కూడా సిగ్గుపడేలా ఉందని ఘాటుగా విమర్శించారు. 'జనం బాట' కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించిన కవిత, హన్మకొండలో మీడియాతో మాట్లాడారు.



## ఈసీ ఏకపక్షంగా
# వ్యవహరిస్తోంది

- బీజేపీ కుట్రలు మేం బయటపెట్టాం
- అయినా చర్యలు ఈసీ తీసుకోవట్లేదు
- బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది
- ఓట్ చోరీపై రాహుల్ ఎనలేని పోరాటం
- 5 కోట్ల మందికిపైగా మద్దతు ఇచ్చారు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే విధంగా భారతీయ జనతా పార్టీ అవకతవకలకు పాల్పడుతోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర విమర్శలు చేశారు. గాంధీ భవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటు చోరీలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరంతరం పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ పోరాటంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమానికి ఇప్పటివరకు 5 కోట్ల మందికిపైగా ప్రజలు మద్దతు తెలిపారని వెల్లడించారు.

వార్త 2లో

## బెంజ్ ఉన్నా గంజికే
# కనెక్ట్ అయ్యా

**బెంజ్‌లో తిరిగినా గతాన్ని మరిచిపోవద్దు**
**టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

బెంజ్ కారులో తిరిగే స్తోమత ఉన్నప్పటికీ తాను గంజికే కనెక్ట్ అయిన వ్యక్తినని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఒకప్పుడు గంజి తాగిన వాళ్లు ఆ తర్వాత కారులో తిరుగుతూ తాము గతంలో గడిపిన జీవితాన్ని మరిచిపోతున్నారని ఆయన




అన్నారు. శనివారం సంగారెడ్డిలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన తన మిత్రులతో సరదాగా మాట్లాడుతూ, దేశం, రాష్ట్రంలో ఇది పెద్ద సమస్యగా మారిందని ఆయన అన్నారు. గంజి తాగి బతికిన వాళ్లు బెంజ్‌లో తిరిగినప్పటికీ గతాన్ని మరిచిపోకూడదని ఆయన అన్నారు.



2


## విమానాశ్రయాల్లో గందరగోళ పరిస్థితులు

## రేవంత్ రెడ్డి ఒత్తిడిలో
# ఉన్నారు..

**ఓటమి భయం కనిపిస్తోంది: బీజేపీ ఎంపీ**
**కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బీజేపీపై నిందలు వేస్తారా అని ఆగ్రహం**
**మీ స్నేహితుడు ఇంటికో ఉద్యోగమని ఇచ్చిన హామీ సాధ్యమైనా అని ప్రశ్న**
**పుట్టిన రోజు సందర్భంగా ప్రజలకు ఇచ్చే బహుమతి ఏమిటో చెప్పాలన్న లక్ష్మణ్**

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, అందుకే బీజేపీపై నిందలు వేస్తూ అసత్య ప్రచారం చేస్తున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. రేవంత్ రెడ్డి మాటల్లో ఓటమి భయం స్పష్టంగా కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్



పార్టీ వైఫల్యాలను కప్పిపుచ్చుకో వడానికి బీజేపీపై నిందలు వేస్తారా అని ప్రశ్నించారు. ఇంటికో ఉద్యోగం అంటూ బీహార్‌లో మీ మిత్రుడు తేజస్వీ యాదవ్ హామీ ఇచ్చారని, ఏడు కోట్ల మంది ఉన్న ఆ రాష్ట్రంలో ఆ హామీ సాధ్యమేనా అని ఆయన నిలదీశారు. రేవంత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భ ంగా ప్రజలకు ఇచ్చే బహుమతి ఏమిటో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చెట్టాపట్టాలు వేసుకుని అధికారాన్ని పంచుకున్నాయని ఆయన ఆరోపించారు.



2

## ఆఫ్రికా పర్యటనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

## రాష్ట్రపతితో వెళ్లనున్న డీకే అరుణ



2

## పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య ఘర్షణలు

# కాన్పూర్‌లో నీట్ విద్యార్థి ఆత్మహత్య

కాన్పూర్, అక్షరకలం ప్రతినిధి

నీట్ పరీక్షకు సిద్ధమవుతున్న ఓ విద్యార్థి తీవ్ర ఒత్తిడితో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో చోటుచేసుకుంది. ఆత్మహత్యకు ముందు తన తల్లిదండ్రులను క్షమించమని కోరుతూ విద్యార్థి రాసిన సూసైడ్ నోట్ కంటతడి పెట్టిస్తోంది. వివరాల్లోకి వెళితే.. రాంపూర్‌కు చెందిన మహమ్మద్ ఆన్ (21) నీట్ కోచింగ్ కోసం కాన్పూర్‌లోని రావత్‌పూర్‌లో ఉన్న ఓ హాస్టల్‌లో నాలుగు రోజుల క్రితమే చేరాడు. శుక్రవారం మధ్యాహ్నం, అతని రూమ్‌మేట్ ఇమ్దాద్ హసన్ ప్రార్థనలకు వెళ్దామని పిలవగా, మహమ్మద్ నిరాకరించాడు. ఇమాద్ తిరిగి వచ్చి చూసేసరికి గదికి లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. ఎంత పిలిచినా మహమ్మద్ నుంచి స్పందన రాకపోవడంతో ఆందోళన చెంది పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గది తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లారు. అక్కడ మహమ్మద్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. అతని మృతదేహం వద్ద ఒక సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. "అమ్మా, నాన్న నన్ను క్షమించండి. నేను తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నాను. మీ కలలను నేను నెరవేర్చలేను. అందుకే నా జీవితాన్ని ముగిస్తున్నాను. దీనికి నేనే బాధ్యుడిని" అని ఆ లేఖలో మహమ్మద్ ఆవేదన వ్యక్తం చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించామని సమాచారం.

# రేవంత్ భాష వీధి రౌడీలా ఉంది

## ఫీజు బకాయిలు చెల్లించకుండా బెదిరింపులా?

### యాజమాన్యాలను బెదిరించే ధోరణిలో ప్రభుత్వం

### ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విమర్శ

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలను "తాట తీస్తా, తొక్కుతా" అంటూ సీఎం హెచ్చరించడాన్ని ఆమె తప్పుబట్టారు. సీఎం వాడిన భాష వీధి రౌడీలు కూడా సిగ్గుపడేలా ఉందని ఘాటుగా విమర్శించారు. 'జనం బాట' కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించిన కవిత, హన్మకొండలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతోనే కాలేజీ యాజమాన్యాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. మాట తప్పింది మీరు. అలాంటప్పుడు వారి తాట, తోలు తీస్తామని అనడం ఎంతవరకు సమంజసం? తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తు కోసం నిలబడిన వారిపై మీ వీరంగమా?" అని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి, యాజమాన్యాలను బెదిరించే ధోరణి అవలంబిస్తోందని కవిత ఆరోపించారు. విద్యార్థుల కోసం పోరాడుతున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు తాము అండగా ఉంటామని, వారి తరఫున పోరాడతామని ఆమె భరోసా ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలి కానీ, బెదిరింపులతో కాదని హితవు పలికారు.

# బిజెపికి ఎల్లవేళలా ప్రవాసుల ఆదరణ

### జూబ్లీహిల్స్ ఎన్నికల్లోనూ అండగా నిలవాలి

### కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్

హైదరాబాద్ అక్షరకలం ప్రతినిధి

ఇద్దరు సభ్యుల బీజేపీ.. ఇప్పుడు దేశంలోనే ఎక్కువ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీగా నిలవడంలో ప్రవాసీల పాత్ర మరువరానిదని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో స్థిరపడిన ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులతో కలిసి భారతీయ జనతా పార్టీ ప్రత్యేకంగా ఆత్మీయ సమ్మేళనాన్ని సోమాజిగూడలోని ఓ హోటల్‌లో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలోనూ భారతీయ జనతా పార్టీ జెండా రెపరెపలాడించడంలో ప్రవాసీలు అత్యంత కీలక పాత్ర పోషించారన్నారు. ఎన్నో ఉద్యమాల తరువాత తెలంగాణ పుట్టిందన్న ఆయన పదేళ్ల పాటు కుటుంబ పాలనలో రాష్ట్రం అన్ని విధాలా నష్టపోయిందన్నారు. అప్పుడు బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ఎంఐఎంతో ఒప్పందాలు చేసుకుని తమ ప్రభుత్వాలను నడిపాయని ఆరోపించారు. నవీన్ యాదవ్ అప్పుడు ఎంఐఎం.. ఇప్పుడు కాంగ్రెస్ తరఫున పోటీపడుతున్నాడని, ఈ పార్టీల ఒప్పందం ఎలా ఉందో తేటతెల్లం అవుతుందన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికలు జూబ్లీహిల్స్‌కు మాత్రమే పరిమితం కాదన్నారు. ఘనమైన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దివాలా తీసిందన్నారు. కాంగ్రెస్ వచ్చాక పరిస్థితులు మరింత దిగజారాయన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్ రానుందని, అందుకు జూబ్లీహిల్స్ గెలుపు నాంది కావాలని ఆకాంక్షించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు మాట్లాడుతూ దేశం, సమాజం కోసం బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై పోలీసుల ప్రత్యేక ఆంక్షలు

### మద్యం దుకాణాలు, హొటళ్లు మూసివేత

### నియోజకవర్గం పరిధిలో 144 సెక్షన్ విధింపు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గ ఉపఎన్నికను పురస్కరించుకుని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ కీలక ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు వీలుగా నియోజకవర్గ వ్యాప్తంగా కఠిన ఆంక్షలు విధిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఉపఎన్నిక పోలింగ్ సందర్భంగా ఈ నెల 9వ తేదీ (ఆదివారం) సాయంత్రం 6 గంటల నుంచి 11వ తేదీ (మంగళవారం) సాయంత్రం 6 గంటల వరకు నియోజకవర్గం పరిధిలోని అన్ని మద్యం దుకాణాలు, హొటళ్లు, రెస్టారెంట్లు, క్లబ్బులను పూర్తిగా మూసివేయాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు జరగనున్న 14వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 15వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఈ ఆంక్షలు మళ్లీ అమల్లో ఉంటాయని వివరించారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటంపై నిషేధం విధించారు. అదేవిధంగా, ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు బహిరంగ ప్రదేశాల్లో, రహదారులపై టపాసులు పేల్చడం, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం వంటి వాటిపై నిషేధం ఉంటుందని తెలిపారు. పోలీసు ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ సజ్జనార్ హెచ్చరించారు.

# రేవంత్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు వెల్లువ

### శుభాకాంక్షలు తెలిపిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ

### రాజకీయా నేతలు, సినీ, క్రీడా ప్రముఖులు విష్

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు 56వ పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు చెబుతున్నారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ .. తెలంగాణ సీఎం కు బర్త్ డే శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్ ఆయు ఆరోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని కోరుతూ ట్వీట్ చేశారు. అటు రేవంత్ రెడ్డి రాజకీయ గురువు ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు రేవంత్ రెడ్డికి ఎక్స్ వేదికగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అటు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఏపీ మంత్రి నారా లోకేష్ బర్త్ డే విషెస్ తెలియజేసారు. అటు సినీ రంగం నుంచి మాజీ కేంద్ర మంత్రి మెగాస్టార్ చిరంజీవి రేవంత్ రెడ్డికి బర్త్ డే విషెస్ తెలిపారు. అటు సినీ రంగం నుంచి గతంలో లాగా ఎవరు బర్త్ డే విషెస్ ఇప్పటి వరకు చెప్పలేదు. తర్వాత చెబుతారా అనేది చూడాలి. అటు రేవంత్ మంత్రివర్గ సహచరులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో పాటు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ .. రేవంత్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతారా లేదా అనేది చూడాలి. రేవంత్ రెడ్డి 1969 నవంబర్ 8 ఉమ్మడి పాలమూరు జిల్లాలో జన్మించారు. మహబూబ్ నగర్ వంగూరు మండలం కొండారెడ్డిపల్లి రేవంత్ రెడ్డి స్వగ్రామం.ఎనుముల రేవంత్ రెడ్డి కుటుంబం చాలా పెద్దది. రేవంత్‌కు ఏడుగురు సోదరులు, ఒక సోదరి ఉన్నారు. రేవంత్ రెడ్డికి భార్య, కుమార్తె, అల్లుడు మనవడు రియాన్ష్ రెడ్డి ఉన్నారు. రేవంత్‌కు రాజకీయంగా, వ్యాపారపరంగా సోదరులు అండగా నిలుస్తుండడం విశేషం. తొలి దశలో రేవంత్ రెడ్డి పెయింటింగ్ పని చేశారని అక్కడి గ్రామస్తులు, అతడి సన్నిహితులు చెబుతున్నారు. అనంతరం వ్యాపారం చేస్తూ రాజకీయాల్లోకి వచ్చి విజయవంతమయ్యారు. ఏబీవీపీ కార్యకర్తగా పనిచేసిన రేవంత్ రెడ్డి.. ఆర్ఎస్ఎస్‌కు చెందిన 'జాగృతి' అనే వార పత్రికలో పని చేశారు. ఆ క్రమంలో సంఘ్ పరివార్ తో రేవంత్‌కు మంచి అనుబంధం ఉంది. తదనంతరం అప్పటి టీఆర్ఎస్ పార్టీ (బీఆర్ఎస్)లో చేరి కార్యకర్తగా పని చేశారు. బీఆర్ఎస్ పార్టీలో రేవంత్ గులాబీ కార్యకర్తగా చురుగ్గా పాల్గొన్నారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు, ప్రస్తుత మాజీమంత్రి హరీశ్ రావు వెంట రేవంత్ రెడ్డి తిరిగాడు. స్వతంత్ర అభ్యర్థిగా జెడ్పీటీసీగా పోటీచేసిన రేవంత్ రెడ్డి అప్పటి టీఆర్ఎస్ పార్టీ మద్దతుగా గెలిచారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీలో చేరారు.తెలుగుదేశం పార్టీ నుంచి కొడంగల్ ఎమ్మెల్యేగా గెలిచారు. ఎమ్మెల్సీ ఓటు విషయంలో ఓటుకు నోటుకు పాల్పడుతూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. ఈ కేసులో అరెస్ట్ కావడం రేవంత్ జీవితాన్ని కీలక మలుపు తిప్పింది. ఇప్పటికీ ఈ కేసులో కోర్టులో పెండింగ్ లో ఉంది. అదృష్టం వెన్నంటి ఉండి చిన్న వయసులో పీసీసీ అధ్యక్షుడిగా ఉంటూ తెలంగాణ రాష్ట్రంలో తొలిసారి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురాగలిగారు. దీంతో ఆయన తెలంగాణ రెండో ముఖ్యమంత్రి అయ్యారు. రేవంత్ రెడ్డి దూకుడుగా వ్యవహరించడం.. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం.. దురుసు ప్రవర్తన, భాష అనేది రేవంత్ రెడ్డికి చెడ్డపేరు తీసుకొస్తున్నాయి.

# రేవంత్ రెడ్డికి జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు శుభాకాంక్షలు

హైదరాబాద్,

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రముఖ సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు. ఆ దేవుడు మీకు ఆయురారోగ్యాలు, సంతోషం ఇవ్వాలని కోరుకుంటున్నాను" అని సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, తెలంగాణ మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, కొండా సురేఖ, మహమ్మద్ అజారుద్దీన్, బీజేపీ ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటల రాజేందర్, డాక్టర్ లక్ష్మణ్, ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, డీఎంకే నాయకురాలు కనిమొళి తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆఫ్రికా పర్యటనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

### రాష్ట్రపతితో వెళ్లనున్న డీకే అరుణ

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి ఆఫ్రికాలో జరిపే అధికారిక పర్యటనలో మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ పాల్గొననున్నారు. భారత ప్రతినిధి బృందంలో సభ్యురాలిగా ఆమె ఈ పర్యటనకు ఎంపికయ్యారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తెలంగాణకు ప్రాతినిధ్యం వహించే ఈ కీలక పర్యటన ద్వారా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా వాణిజ్యం, వ్యవసాయం, సాంకేతికత, సాంస్కృతిక మార్పిడి వంటి కీలక రంగాల్లో భారత్, ఆఫ్రికా దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించడంపై ప్రధానంగా చర్చలు జరపనున్నారు. తెలంగాణ మహిళా నాయకత్వాన్ని ప్రపంచ వేదికపై నిలబెట్టేందుకు ఇదొక గొప్ప అవకాశంగా డీకే అరుణ భావిస్తున్నారు. గ్రామీణాభివృద్ధి, మహిళల పురోగతి, రైతుల సంక్షేమం కోసం ఆమె చేసిన సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిన నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ, "ప్రపంచ ప్రగతిలో తెలంగాణ పాత్రను మరింత బలంగా నిలబెట్టడమే నా లక్ష్యం. ఈ పర్యటన ద్వారా మహిళలు, రైతులు, యువతకు ఉపయోగపడే అవకాశాలను మన రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తాను" అని తెలిపారు. ఈ పర్యటనతో భారత్–ఆఫ్రికా సంబంధాలు కొత్త దిశగా పయనిస్తాయని, అదే సమయంలో తెలంగాణ ప్రతిష్ఠ అంతర్జాతీయంగా ఇనుమడిస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# ఈసీ ఏకపక్షంగా వ్యవహరిస్తోంది

### బీజేపీ కుట్రలు మేం బయటపెట్టాం

### అయినా చర్యలు ఈసీ తీసుకోవట్లేదు

### బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది

### ఓట్ చోరీపై రాహుల్ ఎనలేని పోరాటం

### 5 కోట్ల మందికిపైగా మద్దతు ఇచ్చారు

### టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే విధంగా భారతీయ జనతా పార్టీ అవకతవకలకు పాల్పడుతోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర విమర్శలు చేశారు. గాంధీ భవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటు చోరీలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరంతరం పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ పోరాటంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమానికి ఇప్పటివరకు 5 కోట్ల మందికిపైగా ప్రజలు మద్దతు తెలిపారని వెల్లడించారు. లోక్‌సభతో పాటు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేసిన అవకతవకలను కాంగ్రెస్ పార్టీ ఆధారాలతో సహా నిరూపిస్తోందని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. కర్ణాటకలోని మహదేవ్‌పుర నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో జరిగిన భారీ తప్పిదాలు, బీజేపీ చేసిన మోసాలను రాహుల్ గాంధీ ఆధారాలతో సహా బయటపెట్టినా ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీజేపీ చేసిన కుట్రలను రాహుల్ గాంధీ స్పష్టమైన రుజువులతో నిరూపించారని ప్రస్తావించారు. హర్యానాలో 25 లక్షలకుపైగా నకిలీ ఓటర్లు, 5 లక్షల డూప్లికేట్ ఓటర్లు, వందలాది తప్పుడు చిరునామాలు, వేలాది తప్పు ఫోటో వివరాలు ఉన్నాయని మహేష్ గౌడ్ వెల్లడించారు. ఒకే మహిళ ఫోటోతో 22 ఎంట్రీలు, 100 ఓటరు కార్డులు ఉన్నట్టుగా రాహుల్ గాంధీ నిర్ధారించారని ఆయన వివరించారు. ఇదే తరహాలో బీహార్‌లో కూడా బీజేపీ సహకారంతో "సర్" పేరుతో సంబంధం లేని ఓట్లను తొలగించిందని ఆయన విమర్శించారు. ఓటు చోరీ ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే చర్యగా ఆయన అభివర్ణించారు. ప్రస్తుత ఎన్నికల సంఘం బీజేపీ చెప్పుచేతుల్లో ఉందని, ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ఆయన తీవ్రంగా ఆరోపించారు.ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రాహుల్ గాంధీ బిహార్‌లో ప్రారంభించిన 'ఓటు అధికార్ ర్యాలీ' బీజేపీలో వణుకు పుట్టించిందని మహేష్ గౌడ్ అన్నారు. హర్యానాలో అనుసరించిన ఫార్ములాను ఉపయోగించి బీజేపీ ఇప్పుడు బీహార్‌లో గెలవాలని ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. గతంలో జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో పక్క జిల్లాల ఓటర్లను నమోదు చేసి, బీజేపీ సహకారంతో బీఆర్ఎస్ గెలిచిన ఉదాహరణను ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో జరిగిన ఓటు చోరీలను ప్రజలు అర్థం చేసుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. "ఇందిరా గాంధీ ఏనాడు అవకతవకలకు పాల్పడలేదు. ఓటు హక్కును కాలరాసే హక్కు ఎవరికీ లేదు" అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, అల్లం భాస్కర్, హనుమంతు రావు, లింగం యాదవ్, గజ్జి భాస్కర్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను పెద్ద మెజారిటీతో గెలిపించవలసిన బాధ్యత మన అందరి పైన ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. నవీన్ యాదవ్ గెలుపు కోసం మీ ప్రార్థనా మందిరాలలో ప్రత్యేకంగా ప్రార్థనలు చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఈ క్యాబినెట్ మొత్తం కట్టుబడి ఉందన్నారు. తెలంగాణ సమాజ హితం కోసం ప్రజా ప్రభుత్వం శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని, ఎటువంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. మొత్తం సమాజం అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఈ ప్రజా ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత, అరచేతుల్లో పెట్టి రక్షించుకోవాల్సిన కర్తవ్యం ప్రజలపై ఉందన్నారు. నవీన్ యాదవును గెలిపించి ఈ ప్రభుత్వాన్ని దీవించి ముందుకు నడిపించాల్సిన బాధ్యత ఓటర్లపైనే ఉందన్నారు.

# పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య ఘర్షణలు

### శాంతి చర్చలు విఫలమవడంతో ఘర్షణ

### సైనికులు, పౌరులతో సహా వందల మంది మృతి

ఇస్లామాబాద్, అక్షరకలం ప్రతినిధి

పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య నెలకొన్న సరిహద్దు ఉద్రిక్తతలను తగ్గించేందుకు జరిగిన శాంతి చర్చలు విఫలమయ్యాయి. ఖతార్, టర్కీ దేశాల మధ్యవర్తిత్వంలో ఇస్తాంబుల్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఈ సమావేశాలు ఎటువంటి ఫలితం తేలకుండానే ముగిశాయి. చర్చలు విఫలమవడానికి పాకిస్థాన్ బాధ్యతారహిత వైఖరే కారణమని ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్ పాలకులు తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో ఇరు దేశాల మధ్య ఘర్షణలు కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. శనివారం ఉదయం తాలిబన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ సోషల్ మీడియాలో ఒక ప్రకటన విడుదల చేశారు. "ఈ చర్చల్లో పాకిస్థాన్ తన భద్రతా వైఫల్యాలన్నింటినీ ఆఫ్ఘనిస్థాన్‌పై నెట్టే ప్రయత్నం చేసింది. అదే సమయంలో ఆఫ్ఘన్ భద్రతకు గానీ, తమ సొంత భద్రతకు గానీ బాధ్యత వహించడానికి ఎలాంటి సుముఖత చూపలేదు. పాక్ అనుసరించిన బాధ్యతారహితమైన, సహకరించని వైఖరి వల్లే చర్చలు విఫలమయ్యాయి" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, పాకిస్థాన్ కూడా చర్చల్లో ఎలాంటి పురోగతి లేదని శుక్రవారమే అంగీకరించింది. అంతర్జాతీయ సమాజానికి ఇచ్చిన హామీ మేరకు తాలిబన్లు ఉగ్రవాదాన్ని అరికట్టడంలో విఫలమయ్యారని పాక్ ఆరోపిస్తోంది. ముఖ్యంగా, తమ దేశంలో అనేక దాడులకు పాల్పడుతున్న తెహ్రీక్–ఇ–తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులకు ఆఫ్ఘన్ ప్రభుత్వం ఆశ్రయం కల్పిస్తోందని ఇస్లామాబాద్ ఆరోపిస్తోంది. అయితే ఈ ఆరోపణలను తాలిబన్లు ఖండించారు. ఏ దేశంపైనా దాడికి తమ భూభాగాన్ని ఉపయోగించుకోనివ్వబోమని, అదే సమయంలో తమ సార్వభౌమత్వానికి భంగం కలిగించే చర్యలను గట్టిగా ప్రతిఘటిస్తామని వారు స్పష్టం చేశారు. గత కొన్ని నెలలుగా ఇరు దేశాల సరిహద్దుల్లో ఘర్షణలు తీవ్రమయ్యాయి. అక్టోబర్ ప్రారంభం నుంచి జరిగిన దాడుల్లో ఆఫ్ఘన్ వైపు 50 మంది పౌరులు మరణించారని, 447 మంది గాయపడ్డారని ఐక్యరాజ్యసమితి తెలిపింది. మరోవైపు, తాలిబన్ల దాడుల్లో 23 మంది సైనికులు మరణించారని, 29 మంది గాయపడ్డారని పాక్ సైన్యం ప్రకటించింది. చర్చలు విఫలమవడంతో మధ్యవర్తిత్వం వహించిన ఖతార్, టర్కీలకు పాకిస్థాన్ కృతజ్ఞతలు తెలుపుతూనే, తమ ప్రజలను, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# విమానాశ్రయాల్లో గందరగోళ పరిస్థితులు

### పూర్తిగా గతితప్పిన ఆటోమేటిక్ వ్యవస్థలు

### విమానాల రద్దు.. ప్రయాణికుల ఆందోళన


హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

రెండు రోజుల నుంచి భారత్‌లోని పలు విమానాశ్రయాల్లో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి ఢిల్లీలోని ఏటీసీ ఆటోమేటిక్ వ్యవస్థ పని చేయలేదు. దీంతో వందల విమానాలు రద్దు చేయాల్సి వచ్చింది. మధ్యాహ్నానికి ముంబైలో అదే పరిస్థితి ఏర్పడింది. ఇంకా అక్కడ పరిస్థితులు ఇప్పుడిప్పుడే కొలిక్కి వస్తున్నాయి. ఇప్పుడు తాజాగా హైదరాబాద్‌లో శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు ఆందోళన చేపట్టారు. ఇలా వరుసగా విమానాశ్రాయాల్లో జరుగుతున్న పరిణామాలపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టింది. దేశంలోని వివిధ విమానాశ్రయాల్లోని ఏటీసీ అటోమేటిక్ వ్యవస్థ పని చేయలేదు. 36 గంటలు దాటిన తర్వాత ఢిల్లీ, ముంబై, శివమొగ్గ ఎయిర్‌పోర్టుల్లో పరిస్థితులు కంట్రోల్‌లోకి వస్తున్నాయి. అందుకే శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రాంతాలకు వెళ్లే విమానాలను రద్దు చేశారు. ఈ విషయాన్ని ప్రయాణికులకు చెప్పకుండా రద్దు చేయడం గందరగోళానికి కారణమైంది. తమకు ముందస్తు సమాచారం లేకుండా ఇలా చేయడం ఏంటని ప్రయాణికులు ఆందోళనబాట పట్టారు. దీంతో ఎయిర్‌పోర్ట్‌లో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి కౌలాలంపూర్, వియత్నాం, గోవా వెళ్లే విమానాలను అర్ధాంతరంగా రద్దు చేశారు. సాంకేతిక కారణాలతో ఈ చర్యలు తీసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఢిల్లీ, ముంబై, శివమొగ్గ వెళ్లే విమానాలను కూడా రద్దు చేశారు. దీనికి మాత్రం అక్కడ ఏటీసీ వ్యవస్థ సరిగా పనిచేయకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు. అర్థరాత్రి వేళలో ఇలా నిర్ణయం తీసుకోవడంతో ప్రయాణికులు ఆందోళన చేపట్టారు. ఎందుకు ఇలాంటి పని చేశారని సిబ్బందిని ప్రశ్నిస్తే రూడ్‌గా సమాధానం చెప్పారని మండిపడ్డారు. గంటల తరబడి ఎదురు చూస్తున్నా వారి నుంచి సరైన స్పందన రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్సాంకేతిక సమస్య పరిష్కారమైందనివిమాన కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని ఢిల్లీ విమానాశ్రయ అథారిటీ ప్రకటించింది. పరిస్థితి ఇప్పుడు సాధారణ స్థితికి చేరుకుంటుందని అందులో పేర్కొంది. ఢిల్లీ విమానాశ్రయ అథారిటీ ఇచ్చిన ప్రకటనలో ఇలా ఉంది , "ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ విమాన ప్రణాళిక ప్రక్రియకు సహాయపడే ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్ ను ప్రభావితం చేసే సాంకేతిక సమస్య క్రమంగా మెరుగుపడుతోంది. ఢిల్లీ విమానాశ్రయంలో విమాన కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయి. సంబంధిత అధికారులందరూ అసౌకర్యాన్ని తగ్గించడానికి పనిచేస్తున్నారు. తాజా విమాన సంబంధిత సమాచారం కోసం ప్రయాణికులు తమ విమానయాన సంస్థతో సన్నిహితంగా ఉండాలని సూచించారు." గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఢిల్లీ విమానాశ్రయంలో 800 కంటే ఎక్కువ విమానాలు ప్రభావితమయ్యాయి. సాంకేతిక సమస్య కారణంగా మూసివేశారు.



# నోబెల్ శాస్త్రవేత్త జేమ్స్ డి వాట్సన్ కన్నుమూత

## వృద్ధాప్య సమస్యలతో మరణించినట్లు ప్రకటన



**న్యూయార్క్,**

జీవం ఉనికికి కారణమైన జన్యు పదార్థం డీఎన్ఏ నిర్మాణాన్ని కనుగొన్న అమెరికన్ శాస్త్రవేత్త జేమ్స్ డీ వాట్సన్ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. వృద్ధాప్య సంబంధిత సమస్యలతో 97 వయసులో కన్నుమూశారు. న్యూయార్క్‌లోని కోల్డ్ స్ప్రింగ్ హార్బర్ లేబొరేటరీ ఈ విషయాన్ని ధ్రువీకరించింది మెలికలు తిరిగిన నిచ్చెన ఆకారంలో ఉన్న డీఎన్ఏ నిర్మాణాన్ని డబుల్ హెలికల్ స్ట్రక్చర్ అని పిలుస్తారు. ఈ అమరికను కనుగొన్నందుకు బ్రిటన్ శాస్త్రవేత్త ఫ్రాంసిస్ క్రిక్, మారిస్ విల్కిన్స్‌లతో కలిసి జేమ్స్ డీ వాట్సాన్ 1962లో వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతి పొందారు. డీఎన్ఏకు సంబంధించి రొసాలిండ్ ఫ్రాంక్లిన్, మారిస్ విల్కిన్స్ రూపొందించిన ఎక్స్ రే చిత్రాల ఆధారంగా వాట్సాన్, క్రిక్‌లు 1953లో డబుల్ హెలికల్ స్ట్రక్చర్‌ను వివరించారు. అయితే, 1958లోనే రోసాలిండ్ ఫ్రాంక్లిన్ కన్నుమూయడంతో ఆమెకు నోబెల్ బహుమతి దక్కలేదు. జేమ్స్ డీ వాట్సన్ 1928లో చికాగోలో జన్మించారు. యూనివర్సిటీ ఆఫ్ చికాగోలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆయన ఆ తరువాత ఇండియానా యూనివర్సిటీలో జన్యుశాస్త్రంలో పీహెచ్‌డీ చేశారు. 1951లో కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన కావెండిష్ లేబొరేటరీలో చేరారు. అక్కడే ఆయనకు క్రిక్ పరిచయమయ్యారు. ఆ తరువాత ఇద్దరూ కలిసి డీఎన్ఏ అమరిక గురించి తెలుసుకునేందుకు విస్తృత పరిశోధనలు చేశారు. చివరకు జీవం గురించి కీలక రహస్యాన్ని ఛేదించారు. మానవ జన్యుక్రమాన్ని తెలుసుకునేందుకు ప్రారంభించిన హ్యూమన్ జీనోమ్ ప్రాజెక్టుకు జేమ్స్ 1990లో నేతృత్వం వహించారు. అయితే ప్రభుత్వ విధానాలతో విభేదించి కొంత కాలానికే తప్పుకున్నారు. జేమ్స్ తీరు కొన్ని సార్లు వివాదాలకూ దారి తీసింది. 2007లో ఓ పత్రికా ఇంటర్వ్యూలో ఆయన కామెంట్స్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఆఫ్రికా జాతీయులతో పోలిస్తే శ్వేతజాతీయుల మేధోసామర్థ్యం ఎక్కువని కామెంట్ చేయడంపై కలకలం రేగింది. ఇక వాట్సన్, క్రిక్‌ల ఆవిష్కరణ జీవశాస్త్రంలో అనేక మార్పులను తెచ్చింది. జెనెటిక్ ఇంజినీరింగ్, జీన్ థెరపీ, బయోటెక్నాలజీ వంటి ఆధునిక శాస్త్రాలకు పురుడు పోసింది. డీఎన్ఏ ఆవిష్కరణకు సంబంధించి తన అనుభవాలను వివరిస్తూ వాట్సన్ 1968లో ది డబుల్ హెలిక్స్ అనే పుస్తకాన్ని కూడా రాశారు.

# ప్రాణాలు కాపాడాల్సిన నర్స్

## నర్స్ పాపానికి పదిమంది పేషెంట్లు ఔట్

**బెర్లిన్,**

రోగులకు సేవ చేసి వారి ప్రాణాలు కాపాడాల్సిన ఓ నర్స్ దారుణానికి ఒడిగట్టింది. ఏకంగా 10 మంది పేషెంట్లను చంపేసింది. మరో 27 మందిని చంపడానికి ప్రయత్నించింది. చివరకు పాపం పండి జైలు పాలైంది. తాజాగా, నర్సు కేసుపై విచారణ జరిపిన కోర్టు ఆమెను దోషిగా తేల్చింది. జీవిత ఖైదు విధించింది. ఈ సంఘటన జర్మనీలో చోటుచేసుకుంది. ఆ పూర్తి వివరాల్లోకి వెళితే.. జర్మనీలోని ఆచెన్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ స్థానికంగా ఉండే ఆస్పత్రిలో నర్సుగా పని చేసేది. ఆమెకు తరచుగా నైట్ డ్యూటీలు పడుతూ ఉండేవి. ఆస్పత్రిలో పేషెంట్లు ఎక్కువగా ఉండటంతో పని చేయటం ఆమెకు ఇబ్బందిగా అనిపించింది. దీంతో ఓ దారుణమైన నిర్ణయం తీసుకుంది. వృద్ధ పేషెంట్లకు ఇంజెక్షన్లు ఇచ్చి చంపేసింది. 2023 డిసెంబర్ నుంచి మే 2024 మధ్య కాలంలో 10 మంది పేషెంట్లను చంపేసింది. మరో 27 మందిని చంపటానికి ప్రయత్నించి విఫలమైంది. ఆమె నైట్ డ్యూటీలో ఉన్నప్పుడే ఎక్కువ మంది చనిపోతుండటంతో ఆస్పత్రి ఉన్నతాధికారులకు అనుమానం వచ్చి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో అసలు విషయం బయటపడింది. ఆమెను అరెస్ట్ చేశారు. అప్పటినుంచి కోర్టు ప్రొసీడింగ్స్ జరుగుతున్నాయి. బుధవారం ఆచెన్ కోర్టు ఈ కేసుపై విచారణ జరిపి తుది తీర్పు వెలువరించింది. ఆమెను దోషిగా తేల్చి, జీవిత ఖైదు విధించింది. దీనిపై కోర్టుకు సంబంధించిన అధికార ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ.. ఆమె 15 సంవత్సరాలకే విడుదల అయ్యే అవకాశం ఉంది. ఈ తీర్పుపై పైకోర్టును ఆశ్రయించవచ్చని తెలిపారు.

# వియత్నాంలో బీభత్సం సృష్టించిన తుపాన్

## వేలాదిగా నేలమట్టం అయిన ఇళ్లు

**న్యూఢిల్లీ,**

ఫిలిప్పీన్స్ దేశాన్ని అతలాకుతలం చేసిన కాల్మెగీ తుపాను వియత్నాంలో కూడా బీభత్సం సృష్టించింది. గియా లాయ్, డాక్ లక్ ప్రావిన్సుల్లో వేల కొద్దీ ఇళ్లు దెబ్బతిన్నాయి. వాటి పైప్పులు తుపాను గాలులకు కొట్టుకుపోయాయి. మరికొన్ని ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. గంటకు దాదాపు 149 కిలోమీటర్ల వేగంతో భయానక గాలులు వీచడంతో ప్రజలు బెంబేలు పడ్డారు. వియత్నాం ఎదుర్కొన్న భారీ తుపాన్లలో ఇదీ ఒకటని అక్కడి వాతావరణ శాఖ పేర్కొంది. తుపానుతో ఎంత నష్టం జరిగిందో అంచనా వేస్తున్నామని అధికారులు తెలిపారు. సుమారు 2600 ఇళ్లకు నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఒక్క గియా లాయ్ ప్రావిన్స్‌లోనే సుమారు 2400 ఇళ్లు దెబ్బతిన్నాయని చెప్పారు. 57 ఇళ్లు పూర్తిగా నేలమట్టం అయ్యాయని అన్నారు. డాక్ లాక్ ప్రావిన్స్‌లో ముగ్గురు, గియా లాయ్ ప్రావిన్స్‌లో ఇద్దరు మరణించారు. పొరుగున ఉన్న కాంగ్ ఎన్‌గాయ్ ప్రావిన్స్‌లో గల్లంతైన ముగ్గురి ఆచూకీ ఇంకా తెలియరాలేదు. తుపాను బీభత్సానికి సంబంధించిన పలు వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. చెట్లు నేలకూలడం, విద్యుత్ తీగలు తెగడంతో అనేక ప్రాంతాల్లో ప్రజలు ఇక్కట్ల పాలయ్యారు. భీకర గాలుల ధాటికి అనేక ఇళ్ల అద్దాలు పగిలిపోయాయి. ఇక కాల్మెగీ కారణంగా ఫిలిప్పీన్స్‌లో దాదాపు 200 మంది మరణించారు. 135 మంది గల్లంతయ్యారు. వారి ఆచూకీ ఇంకా తెలియరాలేదు. ఈ వారం మొదట్లో ఫిలిప్పీన్స్ తీరాన్ని తాకిన కాల్మెగీ తుపాను ఆ తరువాత వియత్నాంలో బీభత్సం సృష్టించింది. ప్రస్తుతం కాస్త బలహీనపడి పొరుగున ఉన్న కాంబోడియాలో ప్రవేశించింది. అయితే, ఫిలిప్పీన్స్‌కు సమీపంలోని సముద్ర జలాల్లో మరో తుపాను రూపుదిద్దుకుంటుండటంతో దేశ ప్రధాని ఫెర్డినాండ్ మార్కోస్ గురువారం జాతీయ ఎమ్జర్గ÷న్సీ ప్రకటించారు. వాతావరణ మార్పుల కారణంగా ఆగ్నేయ ఆసియాలో తుపాన్లు, వరదల తీవ్రత పెరుగుతోందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

# గవర్నర్ ఎన్నికల్లో వివేక్ రామస్వామి

## సంపూర్ణ మద్దతు ప్రకటించిన ట్రంప్

**న్యూయార్క్,**

ఇటీవల మూడు అమెరికా రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో భారత సంతతి వ్యక్తులు గెలుపొందిన నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అప్రమత్తమయ్యారు. ఒహాయో గవర్నర్ ఎన్నికల్లో పోటీ పడుతున్న రిపబ్లికన్ నేత, భారత సంతతికి చెందిన వివేక్ రామస్వామికి తన పూర్తి మద్దతు ప్రకటించారు. ఆయన సమ్‌థింగ్ స్పెషల్ అంటూ ప్రశంసల్లో ముంచెత్తారు. వివేక్‌కు అండగా ఉండాలని తన మద్దతుదారులకు పిలుపునిచ్చారు. ఒహాయోలో ఇప్పటికే వివేక్ తన సత్తా చాటారని గుర్తు చేశారు. వివేక్‌పై ట్రంప్ మద్దతుదారులు కొందరు జాత్యాహకారం ప్రదర్శిస్తున్న తరుణంలో ఈ పోస్టు ఆసక్తికరంగా మారింది వివేక్‌పై ప్రశంసలు కురిపిస్తూ డొనాల్డ్ ట్రంప్




తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ఈ పోస్టు పెట్టారు. 'నాకు వివేక్ బాగా తెలుసు. అధ్యక్ష ఎన్నికల్లో నాతో పోటీ పడ్డారు. అతడు యువకుడు.. చాలా స్మార్ట్. మన దేశమంటే ఆయనకు నిజంగా ఎంతో ఇష్టం' అని ప్రశంసలు కురిపించారు. ఒహాయో గవర్నర్ పదవికి పోటీ పడుతున్న వివేక్‌కు పూర్తిస్థాయిలో మద్దతు తెలిపారు. 'మీ రాష్ట్ర గవర్నర్‌గా వివేక్.. ఆర్థికాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తారు. పన్నులు తగ్గించేందుకు, నిబంధనలను సరళతరం చేసేందుకు, మేడ్ ఇన్ యూఎస్ఏ విధానాన్ని ప్రోత్సహించేందుకు శ్రమిస్తారు' అంటూ స్పష్టంగా తన మద్దతు తెలిపారు. ఇంధన రంగంలో అమెరికా ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు, సరిహద్దు భద్రతను మరింత పటిష్టం చేసేందుకు వివేక్ కృషి చేస్తారని హామీ ఇచ్చారు. నేరాల నిర్మూలన, మిలిటరీ సిబ్బంది కోసం సంక్షేమ చర్యలు, లా అండ్ ఆర్డర్, ఎన్నికల వ్యవస్థ సమగ్రతను వివేక్ కాపాడతారని తెలిపారు. అమెరికా రాజ్యాంగంలోని రెండో అమెండ్‌మెంట్‌కు (తుపాకీని కలిగి ఉండే హక్కు) రక్షణగా నిలుస్తారని కూడా ట్రంప్ చెప్పారు. అమెరికన్లను వివేక్ ఎప్పుడూ నిరాశ పరచరని హామీ ఇచ్చారు. ఒహాయోకు అద్భుత గవర్నర్‌గా వివేక్ నిలుస్తారని తాను స్వయంగా హామీ ఇస్తున్నానని అన్నారు.

# రాష్ట్రంలో పెరుగుతున్ చలితీవ్రత

హైదరాబాద్,

రాష్ట్రంలో చలి తీవ్రత మొదలైంది. గత రెండు రోజులుగా అన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్నాయి. రాత్రిపూట చలిగాలుల తీవ్రత ఎక్కువైంది. దీంతో చాలాచోట్ల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా బేలలో అతితక్కువగా 14.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా, రంగారెడ్డి జిల్లాలోని షాబాద్‌లో 14.7 డిగ్రీలు నమోదయింది. సంగారెడ్డిలోని జహీరాబాద్‌లో 14.8, శంకర్‌పల్లి 14.9, మొయినాబాద్ 15 డిగ్రీలు, ఆదిలాబాద్‌లోని భీమ్‌పూర్ 15, సంగారెడ్డిలోని జిన్నారంలో 15.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఇక, కొమురంభీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్?, మహబూబ్?నగర్?, నారాయణపేట, నాగర్ ?కర్నూల్?, యాదాద్రి భువనగిరి, జనగామ, పెద్దపల్లి జిల్లాల్లో చలి తీవ్రత ఎక్కువైంది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. రాజేంద్రనగర్‌లో 15.3, హెచ్‌సీయూలో 15.3, బీహెచ్ఈఎల్ 15.5, మల్కాజిగిరి 15.7, కుత్బుల్లాపూర్ 15.7, గచ్చిబౌలి 15.9, మారేడ్‌పల్లి 16, ఆర్సీపురం 16.1, బేగంపేట 16.4, నేరేడ్‌మెట్ 17.1, అల్వాల్ 17.1, కార్వాన్ 17.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. కాగా, ఈ నెల 9న మరింత తకువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నది.

# ఆల్‌ఖైదా అనుబంధ సంస్థ దురాగతం

## మాలీలో ఐదుగురు భారతీయల కిడ్నాప్

**న్యూఢిల్లీ,**

ఆఫ్రికా దేశం మాలీలో ఐదుగురు భారతీయులను ఉగ్రమూకలు కిడ్నాప్ చేశాయి. ఇది అల్‌ఖైదా ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా ఉన్న మూకల పనేనని అక్కడి వార్తాలు చెబుతున్నాయి. స్థానికంగా ఎలక్ట్రిఫికేషన్ ప్రాజెక్టు చేపడుతున్న సంస్థలో ఆ ఐదుగురు పనిచేస్తున్నారు. వారు కిడ్నాప్‌కు గురైన విషయాన్ని సంస్థ ధ్రువీకరించింది. రాజధాని బొమాకోలోని మిగతా భారతీయులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు సంస్థ ప్రతినిధి తెలిపారు. అయితే, ఈ విషయంపై అక్కడి ఉగ్రవాద సంస్థలు ఏవీ ఇంకా స్పందించలేదు. మాలీలో ప్రస్తుతం మిలటరీ జంటా పాలన సాగుతోంది. మరోవైపు అల్ ఖైదా, ఇస్లామిక్ స్టేట్ ఉగ్రసంస్థలకు అనుబంధంగా పనిచేస్తున్న ఉగ్రమూకలు దేశంలో రణరంగం సృష్టిస్తున్నాయి. వారికి అడ్డుకట్ట వేయలేక సైన్యం నానా కష్టాలు పడుతోంది. అసలే ఆర్థికకష్టాల్లో ఉన్న దేశంలో అంతర్గత కుమ్ములాటలు పరిస్థితిని నానాటికీ దిగజారుస్తున్నాయి. అల్ ఖైదా అనుబంధ జేఎన్ఐఎమ్ ఉగ్రసంస్థ దేశంలోకి ఇంధనం రాకుండా అడ్డుకోవడంతో అవస్థలు తీవ్రమయ్యాయి. మాలీలో విదేశీయుల అపహరణలు నిత్యకృత్యంగా మారాయి. వర్గాల మధ్య కుమ్ములాటలతో మాలీ 2012 నుంచి అల్లకల్లోలంగా మారింది. సెప్టెంబర్‌లో కూడా జేఎన్ఐఎమ్ ఉగ్రవాదులు విదేశీయులను కిడ్నాప్ చేశారు. యూఏఈకి చెందిన ఇద్దరిని, ఒక ఇరాన్ దేశస్థుడిని బొమాకోకు సమీపంలో కిడ్నాప్ చేశారు. 50 మిలియన్ డాలర్లు ఇచ్చాక వారిని విడిచిపెట్టారు.

# నిలిచిపోయిన వియత్నాం ఎయిర్‌లైన్స్ విమానం

## శంషాబాద్ విమానాశ్రయంలో

## ప్రయాణికులు ఆందోళన

**హైదరాబాద్,**

శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు శనివారం ఆందోళన చేపట్టారు. వియత్నాం ఎయిర్‌లైన్స్ కు చెందిన వీఎన్-984 విమానం శుక్రవారం రాత్రి శంషాబాద్ నుంచి వియత్నాంకు వెళ్లాల్సి ఉంది. కానీ సాంకేతిక సమస్య తలెత్తడంతో అధికారులు సర్వీసును నిలిపివేశారు. 200 మంది ప్రయాణికులు రాత్రంతా విమానాశ్రయంలోనే ఉండిపోయారు. ఈ క్రమంలో ఎయిర్‌లైన్స్ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ప్రయాణికులు ఆందోళన చేపట్టారు. మరోవైపు భారీ మరమ్మతుల కారణంగా ఈ విమాన సర్వీసును పూర్తిగా రద్దు చేస్తున్నట్లు శనివారం ఉదయం 11 గంటలకు అధికారులు ప్రకటించారు. రీషెడ్యూల్ చేసిన విమానంలో ప్రయాణికులను పంపిస్తామని, అలా వెళ్లడానికి ఇష్టం లేని ప్రయాణికులకు పూర్తిస్థాయిలో టికెట్ డబ్బులు రీఫండ్ చేస్తామని హామీ ఇచ్చారు. కౌలాలంపూర్ వెళ్లాల్సిన విమానంలోనూ సాంకేతిక సమస్య ఏర్పడింది. దీంతో నిర్దేశిరచిన సమయం కంటే 6 గంటల ఆలస్యంగా శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరింది. ఢిల్లీలో తలెత్తిన ఏటీసీ సాంకేతిక సమస్య వల్ల ఢిల్లీ, ముంబయి, శివమొగ్గ విమానాలు రద్దయ్యాయి. గోవా వెళ్లాల్సిన విమానం ఆలస్యంగా బయలుదేరింది.

# బ్రెజిల్‌లో సుడిగాలుల బీభత్సం

## ఐదుగురు మృత్యువాత

**బ్రసిల్లా,**

దక్షిణ బ్రెజిల్‌లోని ఒక పట్టణంలో కొన్ని ప్రాంతాలను సుడిగాలి తుడిచి పెట్టింది. ఈ సుడిగాలికి ఐదుగురు మృత్యువాతపడ్డారు. 130 మందికి గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. పరానా రాష్ట్రంలోని రియో బోనిటో డో ఇగువాకు అనే మునిసిపాలిటీలో సంభవించిన సుడిగాలి వల్ల కార్లు బోల్తాపడ్డాయి. ఇళ్లు దెబ్బతిన్నాయి అని స్థానిక వాతావరణ శాఖ తెలిపింది. ఈ సుడిగాలికి ఐదుగురు మృతి చెందినట్లు నిర్ధారించినట్లు పరానా పౌర రక్షణ శాఖ ఓ ప్రకటనలో నివేదించింది. ఈ ఘటనలో 30 మందికి తీవ్రగాయాలయ్యాయని, వంద మందికి మాత్రం స్వల్పగాయాలయ్యాయని స్థానిక రెస్క్యూ ఏజెన్సీ తెలిపింది. 14 వేల జనాభా కలిగిన రియో బోనిటో డో ఇగువాకులో గంటకు 180 నుండి 250 కిలోమీటర్ల వేగంతో వీచినట్లు పరానా పర్యావరణ వాతావరణ శాఖ తెలిపింది. ఈ విపరీతమైన గాలుల వల్ల చెట్లు కూలిపోయాయి. రాతి భవనాలకు కూడా నష్ట వాటిల్లందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ ఘటనపై పరానా గవర్నర్ రతినో జూనియర్ స్పందించారు. భద్రతా బలగాలు అప్రమత్తమై ఈ తీవ్ర తుఫానుల బారినపడిన నగరాలను పర్యవేక్షిస్తున్నాయని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో తెలిపారు. పరానాతోపాటు దక్షిణ రాష్ట్రాలైన శాంటా కాటరినా, రియో గ్రాండేడో సుల్‌లకు కూడా తుఫానులు సంభవించవచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది.

# రేవంత్‌లో జూబ్లీహిల్స్ హయం

## ఓడితే పది ఊడడం ఖాయం

## ఇక్కడ గెలిపించేది హైదరాబాద్ అభివృద్దే

## మీడియా సమావేశంలో మాజీమంత్రి జగదీశ్ రెడ్డి




**హైదరాబాద్,**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో భయం మొదలైందని.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల తర్వాత పదవీగండం పొంచి ఉందని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ అభివృద్ధి అజెండాపైనే జూబ్లీహిల్స్ ప్రజలు ఓటు వేయబోతున్నారని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన బీఆర్ఎస్ నేతలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాగంటి గోపీనాథ్ తల్లితో ఎవరు మాట్లాడిస్తున్నారో అందరికీ తెలుసునన్నారు. రేవంత్ రెడ్డి ఓటమి భయంతో చేసే పనుల్లో ఇది ఒకటని.. రేవంత్ రెడ్డి డ్రగ్స్ మత్తులో మాట్లాడుతున్నట్లుగా ఉందన్నారు.÷శివంత్ రెడ్డి సీఎంగా వచ్చాక డ్రగ్స్ సంబంధ నేరాలు ఎక్కువయ్యాయని.. పోలీస్ కమిషనర్లే నేరాల రేటు పెరిగిందని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపారన్నారు. సీఎం మానసిక స్థితి దెబ్బతిన్నట్లుందని.. సందర్భం లేకుండా మాట్లాడుతున్నారని.. ఆయనను చూసి సిగ్గు సిగ్గుపడేలా ఉందని విమర్శించారు. నిఘా పెట్టేందుకు కేసీఆర్ కమాండ్ కంట్రోల్ కడితే.. రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్‌లో కూర్చొని తమపై నిఘా పెడుతున్నాడని ఆయన ప్రశ్నించారు. ప్రగతిభవన్‌లో బుల్లెట్ ప్రూఫ్ కిటికీలు ఉంటే చూపించాలని సవాల్ విసిరారు. బు÷-లలెట్ ప్రూఫ్ కిటికీలు, కమాండ్ కంట్రోల్, సెక్రటేరియట్‌పై కమిషన్ వేయవచ్చు కదా.. బుల్లెట్ ప్రూఫ్ కిటికీలు చూపిస్తావా ప్రగతి భవన్‌ల ఎన్ని రూములున్నాయో చూపిస్తావా అంటూ ప్రశ్నించారు. దేశంలో ఎవరూ తిట్టని విధంగా వైఎస్సార్‌ను, సోనియా గాంధీని తిట్టింది రేవంత్‌రెడ్డియేనన్నారు. ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలను ఎన్ని రోజులు భయపెడుతావంటూ నిలదీశారు. ఏం చేసినా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవదని, రేవంత్ రెడ్డి చేసే తప్పులకు చరిత్ర క్షమించదన్నారు. రేవంత్ రెడ్డి నోటి దూలతో బీహార్ నుంచి వెల్లగొట్టే పరిస్థితి వచ్చిందని.. బిహార్ ఎన్నికల ప్రచారానికి రేవంత్ రెడ్డిని వద్దని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని పిలిపించుకున్నారన్నారు. కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి పదవుల్లో ఉన్నారు కాబట్టి.. ఇద్దరు బ్యాడ్ బ్రదర్స్ అన్నారు. కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి ఇద్దరూ మోదీ శిష్యులేనని.. తెలంగాణ అభివృద్ధి,హైదరాబాద్ అభివృద్ధి బాధ్యత రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి, బండి సంజయ్ తీసుకోవాలని సూచించారు. హరీశ్‌రావుపై రేవంత్ చల్లర వ్యాఖ్యలు చేశారంటూ విమర్శించారు. పార్టీలో హోంగార్డ్, ఐపీఎస్, ఎవరు పెద్ద.. ఎవరు చిన్నా అని రేవంత్ హరీశ్ ఎప్పుడూ మాట్లాడలేదన్నారు. సీఎం బాధతో తెలంగాణ పరువుపోతుందని.. ఇప్పటికైనా ఆయన తన భాష మార్చుకుంటే మంచిదంటూ హితవు పలికారు. సమావేశంలో మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిషోర్ కుమార్, బూడిద భిక్షమయ్య గౌడ్, బీఆర్ఎస్ నేతలు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఒలంపిక్స్‌లో పథకాలు పట్టాలి

## ఇంటర్ డిస్టిక్ సాఫ్ట్ బాల్ పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే

**జగిత్యాల,**

క్రీడాకారులు ఒలింపిక్స్‌లో పతకాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి గొప్ప పేరు తెచ్చే విధంగా లక్ష్యాన్ని నిర్దేశిరచుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. పట్టణంలోని గీతా విద్యాలయం మైదానంలో శనివారం తెలంగాణ మహిళల ఇంటర్ డిస్టిక్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు, ఫైన్ ఆర్ట్స్ ముఖ్యమన్నారు. క్రీడలు ప్రోత్సహించడం ద్వారానే అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ పాలసీ తీసుకురావడం వల్ల విద్య, ఉద్యోగాల్లో 2 శాతం రిజర్వేషన్ కల్పనతో క్రీడలకు ప్రోత్సాహం కలుగుతుందని అన్నారు. తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని వెల్లడించారు. జగిత్యాల నియోజకవర్గంలో క్రీడా మైదానాల అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడించారు. ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి చేశారు. క్రీడాకారులకు పండ్లు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి శోభన్ బాబు, జగిత్యాల సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సభ్యులు సుధాకర్ , డీవైఎస్‌వో రవి బాబు తదితరులు పాల్గొన్నారు.


అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# స్వాతంత్రోద్యమంలో ప్రేరణ మంత్రం వందేమాతరం

**ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాల్లో వందేమాతరం తరవాత భారతదేశం నా మాతృభూమి..అంటూ ప్రతిజ్ఞ చేయించేవారు. వందేమాతరం చదివిన తరవాతనే పాఠశాల తరగతి గదులు ప్రారంభం అయ్యేవి. ఆనాటి నిబద్ధత ఇప్పుడు ప్రైవేట్ స్కూళ్లు వచ్చాక కనుమరుగయ్యింది. జగనణమన కూడా మనదేశ ఆత్మగా నిలిచింది. ఈ రెండు గీతాలకు భారతదేశంలో విడదీయరాని సంబంధం ఏర్పడింది. దేశాన్ని ఏకతాటిపై నడిపించిన వందేమాతరం గీతానికి 150 వత్సరాలు. నిత్యనూతనంగా ఇప్పటికీ వందేమాతరం మార్మోగు తోంది. దేశాన్ని కట్టిపడేసే ప్రార్థనాగీతంగా ఇది ఎంతో ప్రాచుర్యం కలిగించింది. స్వాతంత్ర్య ఉద్యమ శ్లోకంగా నిలిచి నేటికీ జాతీయ గీతంగా భాసిల్లుతోంది. వందేమాతర గీతం తరవాతనే దేశవ్యాప్తంగా ఉత్తేజితం మొదలయ్యింది. బ్రిటిష్ వారిని పారదోలేందుకు ఇది ఎంతగానో తోడ్పడింది. ప్రజలను ఏకం చేయడంలో వందేమాతర గీతం నిప్పుకణికలా మండింది. ఎక్కడిక్కడ వందేమాతరం గీతాలా పనతో ప్రజలు ఉద్యమంలో దుమికారు. అందుకే ఆనాటి బ్రిటిష్ పాలకులు వందేమాతర గీతం పాడిన వారిపై దమనకాండకు తెగించారు.**

1875లో కార్తిక శుక్ల నవమి, జగద్ధాత్రి పూజనాడు బంకించంద్ర ఛటర్జీ కలం నుంచి జాలువారిన వందేమాతర గీతం...స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణగా నిలిచింది. భారతదేశ పురాతన సాంస్కృతిక మూలాలు ఈ గీతరచనకు ప్రేరణనిచ్చాయి. సర్వ మంగళ మాంగళ్యే శివే... అంటూ సాగే దేవీమాత స్తోత్రం వందేమాతరం గీతానికి ప్రేరణగా భావిస్తారు. అందుకే కొందరు దీనిని పాడడానికి ఇప్పటికీ ఇష్టపడరు. ఇది మనదేశ దౌరభాగ్యంగా చూడాలి. మతం ముసుగులో కొందరు దీనిని తృణీకరించినా అది ప్రజల నరనరాల్లో జీర్ణించుకుపోయిన ఉత్తేజిత గీతంగా నిలిచింది. భారతదేశ చరిత్రలో మహోద్యమాలకు కళలూ పాటలూ అంతరాత్మగా నిలిచిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అంతెందుకు తెలంగాణ ఉద్యమంలో పాటే పరవళ్లు తొక్కపోతే ఉద్యమమే లేదు. జాతి భావోద్వేగాలను వెన్నుతట్టి స్వాతంత్ర్య కాంక్ష అనే సమష్టి కార్యాచరణ కు పురిగొల్పడంలో వందేమాతరం గీతం కీలకభూమిక పోసించింది. అందుకే భారత స్వాతంత్ర్య పోరాటంలో అత్యంత ప్రత్యేకమైనదిగా వందేమాతరం గీతం నిలిచింది. ఈ అమర గీతం వెలువడి 150 సంవత్సరాలైనందున ఏడాదిపాటు దేశమంతటా ఉత్సవాలు నిర్వహించాలని కేంద్రం నిశ్చయించింది. స్వాతంత్ర్య ఉద్యమానికి జవజీవాలు అందించడమే కాదు, సాంస్కృతిక జాతీయవాదానికి బీజం వేసింది. భారతదేశమంటే మట్టి కాదనీ... కర్తవ్యం, అంకితభావాలతో పునీతమైన పుణ్యతీర్థమనీ ప్రబోధించింది. మహర్షి అరవిందుడు వర్ణించినట్లు- బంకించంద్రుడు ఆధునిక భారత రుషి. ఆయన పదాలు జాతి ఆత్మను మళ్లీ మేల్కొలిపాయి. నిదురిస్తున్న జాతి తన ఆత్మబలాన్ని కనుగొనేలా జాగృతం చేయడంలో వందేమాతరం గీతం ప్రముఖ భూమిక పోషించదనడంలో సందేహం లేదు. బ్రిటిష్ పాలకుల ఇనుప ఉక్కు సంకెళ్ల కింద నలిగిపోతున్న తరుణంలో బంకించంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరం జాతికి ప్రభాత గీతమైంది. మన సంస్కృతి, నాగరికతల పట్ల గర్వాభిమానాలను రేకెత్తించే గానమైంది. అణువణువునా మాతృభూమిపై భక్తి, అనురక్తి ఉట్టిపడేలా మేల్కొలిపే రణనినాద గీతమైంది. వందేమాతరం భాషా ప్రాంతీయ భేదాలకు అతీతంగా కశ్మీర్ నుంచి




కన్యాకుమారి వరకు జాతిని జాగృతం చేసింది. బ్రిటిష్ వలస పాలకులపై ధిక్కార ప్రకటనగా ప్రజలు యావద్దేశంలో వందేమాతరం అంటూ నినదించారు. 1905లో బెంగాల్ విభజనపై నిరసన వెల్లువెత్తినప్పుడు వందేమాతరం అంతటా మార్మోగింది. దాంతో బ్రిటిష్ పాలకులు ఆ పాటను నిషేధించారు. కానీ, 1906 ఏప్రిల్ 14న బారిసాల్‌లో వేలమంది ఉద్యమకారులు ఆ నిషేధాన్ని ధిక్కరించి వందేమాతరం అంటూ ఘోషించారు. లాఠీ దెబ్బలకు రక్తమోడుతున్నా లెక్కచేయకుండా స్త్రీపురుషులు అలా ఘోషిస్తూనే ఉన్నారు. 1946లో తిరుగుబాటు చేసిన రాయల్ ఇండియన్ నేవీలోని భారతీయ నావికులు వందేమాతరం అంటూ నినదిస్తూ బ్రిటిష్ యుద్ధనౌకలపై జాతీయ పతాకను ఆవిష్కరించారు. మొద్దునిద్రలో ఉన్నవారినైనా మేల్కొలిపే మంత్రశక్తి వందేమాతరానికి ఉందని మహాత్మాగాంధీ పేర్కొన్నారు. ఇన్నేళ్లయినా వన్నె తగ్గకుండా మనజీవితాల్లో అది పెనవేసుకుపోయింది. భారతజాతిని కలసి ఉంచే గీతంగా నిలిచింది. స్వాతంత్ర్య ఉ ద్యమంలో వెలిగిన ఈగీతాజ్యోతి ఇంకా జ్వాజ్వల్యమానంగా వెలుగుతోంది. ఇప్పుడు ఏడాది ఉత్సవాల్లో భాగంగా వందేమాతరం పూర్తిరూపంలో ప్రతిధ్వనిస్తూ యువత మనసుల్లో సాంస్కృతిక జాతీయవాదాన్ని నింపుతుందనడంలో సందేహం లేదు. వందేమాతరం కేవలం గత వైభవ స్మరణం కారాదు. మనజాతిని మేల్కొలిపే ఉజ్వల భవిష్యత్తుకు ప్రేరణగానూ తీసుకోవాలి. భారత ఆత్మను ఆవహించుకునే గీతంగా చూడాలి. ఘనమైన భారతదేశ సంస్కృతీ నాగరికతలపై మనకున్న అభిమానాలకు నిదర్శనమైన ఆ గీతస్ఫూర్తిని ఆచరణలోకి తీసుకురావడం మనందరి బాధ్యత. వందేమాతరం పారతంత్ర భారతదేశానికి తొలి మేల్కొలుపు. మొక్కవోని దీక్షను చాటిన స్వేచ్ఛా గీతమది. భారతదేశపు ఆత్మ నుంచి జనించిన ఈ గీతం అజరామజరంగా నిలుస్తుంది. తరతరాలకు ఉత్తేజమిస్తుంది. భారతీయత అనే కోణం నుంచి మన చరిత్ర, సంస్కృతి, విలువలు, సంప్రదాయాలను వీక్షించి... నిరంతరం స్ఫూర్తి పొంది... సదా కార్యాచరణలో నిమగ్నం కావాలని ప్రబోధించే దివ్య గానంగా వందేమాతరం నిరంతర స్మరణ కావాలి. పాలకులు దీన్ని ప్రేరణగా తీసుకుని భారత పునరుజ్జీవానికి అంకితం కావాలి. కేవలం గీతాలాపనతో సరిపుచ్చక భారత ఉజ్వల భవిష్యత్‌కు ప్రేరణగా తీసుకోవాలి. దేశంముందు వందనం చేయడంతో పాటు, సంకల్ప సిద్ధి కోసం వందేమాతరం గీతాన్ని ఆలపించాలి. దేశీయంగా స్వయం సమృద్ధి సాంధించేందుకు నేటికీ ఇది ప్రేరణ మంత్రంగా నిలవాలని ఆశిద్దాం.

## రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

**గుంటూరు,**

రాష్ట్రంలో ఏ ఒక్క రైతూ అధైర్యపడొద్దు.. ఆత్మహత్యలు చేసుకోవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. తుఫాను ప్రభావంతో పంటలు నష్టపోయిన కౌలు రైతులకు పెట్టుబడి రాయితీ ఇస్తున్నామని తెలిపారు. పంటల బీమా ప్రీమియం కూడా జగన్ ప్రభుత్వం చెల్లించలేదని ధ్వజమెత్తారు. దీంతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంలో ప్రీమియం సకాలంలో చెల్లించామని స్పష్టం చేశారు సీఎం చంద్రబాబు. ఆచార్య ఎన్జీరంగా 125వ జయంతి ఉత్సవాల్లో సీఎం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రైతును ఆదుకునేందుకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. మొన్నటి తుపానులో నష్టపోయిన రైతులను ఆదుకున్నాం. మేం వచ్చాక పంటల బీమా చెల్లించి రైతులకు అండగా నిలిచాం. పంటలకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకున్నాం. పంటలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు ఇస్తున్నాం అని వివరించారు. జలాశయాల్లో పుష్కలంగా నీళ్లు ఉన్నాయి. సాగునీటి ప్రాజెక్టులకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తున్నాం. రాయలసీమలో అన్ని రిజర్వాయర్లు పూర్తి చేశాం. కరవును శాశ్వతంగా నివారించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టాం. తరచుగా వచ్చే తుపాన్ల వల్ల కూడా రైతులు నష్టపోతున్నారని సీఎం చంద్రబాబు అన్నారు. జగన్ మోహన్ రెడ్డి హయాంలో ప్రాజెక్టుల నిర్వాహణని గాలికొదిలేశారని, కనీసం గేట్లకు గ్రీజు కూడా పెట్టలేదని చంద్రబాబు నాయుడు ఆరోపించారు. 2014 నుంచి 2019 మధ్యలో వ్యవసాయ రంగంలో జీఎస్డీపీ 6 శాతం పైగా పెరిగిందని.. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జీఎస్డీపీ మళ్లీ పడిపోయిందని ఆక్షేపించారు.రైతులకు పంటల బీమా చెల్లింపులో ఇబ్బంది లేకుండా చేశామని చెప్పుకొచ్చారు. కౌలు రైతులు ఎక్కువ భూమిలో వ్యవసాయం చేస్తున్నారని.. నష్టాలు వస్తే ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిపారు.ఆచార్య ఎన్జీ రంగా 125వ జయంతితో పాటు వందేమాతరం 150 వసంతాల వేడుకలు ఒకే రోజు రావటం చరిత్ర అని అభివర్ణించారు. ఆచార్య ఎన్జీ రంగా 33 ఏళ్ల వయస్సులో ఆంధ్రా రైతాంగ ఉద్యమాన్ని నడిపించారని కొనియాడారు. 1964లో రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని పార్లమెంట్‌లో ఆచార్య ఎన్జీ రంగా పోరాడారని కీర్తించారు. ప్రాంతాలకు అతీతంగా నాలుగుచోట్ల ఎంపీగా గెలిచిన చరిత్ర ఆచార్య ఎన్జీ రంగాది అని ప్రశంసించారు. స్వాతంత్య పోరాటంలో పాల్గొన్న ప్రముఖుల్లో ఎన్జీ రంగా ఒకరని చెప్పుకొచ్చారు సీఎం చంద్రబాబు. ఆర్థిక శాస్త్రంలో నైపుణ్యత సాధించిన రంగా.. మహాత్మాగాంధీ పిలుపుతో స్వాతంత్య పోరాటంలో పాల్గొన్నారని నొక్కిచెప్పారు. సైమన్ కమిషన్ గో బ్యాక్, క్విట్ ఇండియా ఉద్యమంలో ఆచార్య ఎన్జీ రంగా పాల్గొన్నారని కీర్తించారు. కేవలం 33 ఏళ్ల వయసులో ఆంధ్రా రైతాంగ ఉద్యమాన్ని ముందుకు నడిపించారని కొనియాడారు. రైతులకు శిక్షణా పాఠశాల పెట్టి శిక్షణ అందించారని ఉద్ఘాటించారు. ఓవైపు దేశం కోసం మరో వైపు రైతుల కోసం ఆచార్య ఎన్జీ రంగా పోరాడారని నొక్కిచెప్పారు. ఆచార్య ఎన్జీ రంగా పార్లమెంట్‌లో ఉన్నంత కాలం రైతులు సుభిక్షంగా ఉంటారని నెహ్రూ వంటి వారు చెప్పారని ఉద్ఘాటించారు. ఆచార్య ఎన్జీ రంగా చేసిన పోరాటాలకు పద్మ విభూషణ్‌తో పాటు ఎన్నో అవార్డులు వచ్చాయని కీర్తించారు. తాను మొదటిసారి సీఎం కాగానే వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఆచార్య ఎన్జీ రంగా పేరు పెట్టానని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత యూనివర్సిటీ పేరు మార్చారని తెలిపారు. దీంతో ఏపీలో రంగా పేరిట వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. ప్రాంతాలకు అతీతంగా నాలుగు పార్లమెంట్ స్థానాల్లో ఎంపీగా గెలిచిన అరుదైన వ్యక్తి ఎన్జీ రంగా అని ప్రశంసించారు. ఆయన స్ఫూర్తితో గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై పీహెచ్డీ కోసం పని చేశామని ఉద్ఘాటించారు. దేశం కోసం పిల్లలు వద్దనుకుని జీవించిన రంగా దంపతులు ఆదర్శనీయులని కొనియాడారు. తాను మొదటి సారి మంత్రి అయిన సందర్భంగా ఎన్జీ రంగా కూడా మంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు సీఎం చంద్రబాబు. ఎన్డీయే ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు. ప్రజల కోసం రైతు నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. తాను ఐటీని ప్రోత్సహించి ఎందరో రైతు బిడ్డలను ఐటీ ఉద్యోగాల వైపు వెళ్లేలా చేశానని నొక్కిచెప్పారు. వ్యవసాయంలో ఖర్చులు తగ్గించి రైతుల ఆదాయం పెంచటంపై పరిశోధనలు జరుగుతున్నాయని వివరించారు. రైతులకు ఆదాయం పెరగాలంటే ఖర్చులు తగ్గాలి, దిగుబడి పెరగాలని సూచించారు. కూటమి ప్రభుత్వంలో ధాన్యం రైతులకు 24 గంటల్లోగా డబ్బులు జమ చేస్తున్నామని స్పష్టం చేశారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమం కోసం రూ.3 వేల కోట్లు ఇచ్చామని గుర్తుచేశారు సీఎం చంద్రబాబు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

## విమెన్ క్రికెటర్ శ్రీచరణికి రూ.2.5 కోట్ల నగదు పురస్కారం

**అమరావతి**

వన్డే ప్రపంచకప్‌లో సత్తా చాటిన తెలుగు తేజం, మహిళా క్రికెటర్ శ్రీచరణిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. శ్రీచరణికి రూ. 2.5 కోట్ల నగదు పురస్కారాన్ని ప్రకటించింది. ఆమెకు గ్రూప్ 1 ఉద్యోగంతోపాటు.. కడపలో ఇంటి స్థలాన్ని ప్రభుత్వం ఇవ్వనుంది. ఇండియన్ ఉమెన్ క్రికెటర్ శ్రీచరణి, మాజీ కెప్టెన్ మిథాలి రాజ్ శుక్రవారం ఉదయం సీఎం క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును వారు కలిశారు. క్యాంప్ కార్యాలయానికి వచ్చిన ఇరువురికి మంత్రి నారా లోకేష్ స్వాగతం పలికారు. ఉమెన్ క్రికెట్ వరల్డ్ కప్ గెలుచుకున్నందుకు శ్రీచరణిని సీఎం, మంత్రి అభినందించారు. ఆపై శ్రీచరణి, మిథాలితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వరల్డ్ కప్ గెలుచుకున్న ఆనందక్షణాలను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌తో శ్రీచరణి పంచుకున్నారు. ఉమెన్ వరల్డ్ కప్ గెలుచుకోవడం ద్వారా భారత దేశ మహిళలు సత్తా చాటారని, మహిళా క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారని ముఖ్యమంత్రి కొనియాడారు. ఉదయం గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఉమెన్ క్రికెట్ వరల్డ్ కప్ టీమ్ విన్నర్ శ్రీచరణికి ఘన స్వాగతం లభించింది. శ్రీచరణికి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్, మంత్రులు అనిత, సవిత, సంధ్యారాణి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు విమానాశ్రయంలో స్వాగతం పలికారు. అనంతరం ఎంపీలు, మంత్రులు, శాప్ ఛైర్మన్ కలిసి శ్రీచరణి, మిథాలి రాజ్‌ను వెంటపెట్టుకుని సీఎం క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. అయితే గన్నవరం నుంచి బెంజ్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించాలని ఏసీఏ మొదట భావించింది. ముఖ్యమంత్రితో భేటీ నేపథ్యంలో విజయోత్సవ ర్యాలీని రద్దు చేశారు. చంద్రబాబును కలిసిన తర్వాత మంగళగిరిలోని క్రికెట్ స్టేడియంను సందర్శించేందుకు శ్రీచరణి బయలుదేరి వెళ్లారు. అలాగే.. నేడు సొంత జిల్లా కడపకు శ్రీచరణి వెళ్లనున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రక్రికెట్ అసోషియేషన్ సౌజన్యంతో జిల్లా క్రికెట్ అసోసియేషన్.. శ్రీచరణిని ఘనంగా సత్కరించనుంది. క్రికెటర్ శ్రీచరణి శుక్రవారం ఉదయం సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అందరి అభిమానం చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. కుటుంబం నుంచి నాకు చక్కటి ప్రోత్సాహం ఉంది. మా మామ నన్ను క్రికెట్ ఆడించేవారు. నేను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌లో శిక్షణ పొందాను. ఇది మొదటి అడుగు మాత్రమే.. ముందు చాలా ఉంది. ప్రధాని మోదీని కలిసినప్పుడు భవిష్యత్ కార్యాచరణపై సలహాలిచ్చారఅని అన్నారు.

## జుబ్లీ గెలుపుపై ఎవరి ధీమా వారిదే

**హైదరాబాద్,**

గ్రేటర్ హైదరాబాదులోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి మరో వారం రోజుల్లో ఉప ఎన్నిక జరుగుతోంది. ప్రస్తుతం బరిలో ఉన్న అన్ని ప్రధాన పార్టీల్లోనూ గెలుపుపై తీవ్రమైన సస్పెన్స్ కొనసాగుతోంది. ఎవరికి వారు గెలుపు గుర్రంపై ధీమా వ్యక్తం చేస్తున్నా అంతర్గత చర్చల్లో మాత్రం ప్రత్యర్థుల ఎత్తులపై చర్చలు వేస్తున్నారు. వారి కంటే మనం బాగా ప్రచారం చేస్తున్నామా ఎక్కడెక్కడ ? ముందు ఉన్నాం ఏ ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నాం అనేదానిపై రకరకాల సర్వేలు చేస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన ప్రచారాన్ని భేరీజు వేసుకుంటున్నారు. ఈ క్రమంలోని బిఆర్ఎస్ - కాంగ్రెస్ వర్గాలు సర్వేలను ఆధారం చేసుకుని గెలుపు తమది అంటూ ప్రచారం చేసుకోవడం ఒక అంశం అయితే .. ఈ ఉప ఎన్నికల్లో గెలుపు ఆధారంగా ఆయా పార్టీలు తమ నాయకులకు పదవులు ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలిస్తూ ఉండటం విశేషం. కాంగ్రెస్ పార్టీ నుంచి మంత్రి పదవులు ఆశించిన వారు .. నామినేటెడ్ పదవులు ఆశించిన వారు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో ఆ పార్టీని గెలిపించేందుకు గట్టిగా కష్టపడుతున్నారు. ఇక బిఆర్ఎస్ లోను ఇదే తరహా ప్రచారం జరుగుతోంది. పార్టీ పదవుల కోసం ఆశలు పెట్టుకున్న వారు ... వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఆశిస్తున్న వారు కేసీఆర్ దగ్గర మంచి మార్కుల కోసం .. కేటీఆర్ దగ్గర మంచి మార్కుల కోసం గట్టిగా కష్టపడుతున్నారు. ఉప ఎన్నికల్లో తమ సత్తా చాటాలని ప్రయత్నాలు చేస్తున్నారు. మరి వీరిలో ఎవరి ఆశలు నెరవేరుతాయో చూడాలి.

## వందేమాతర గీతం జాతీయవాద జ్వాలను రగిలిస్తోంది

**న్యూఢిల్లీ,**

వందేమాతరం గేయానికి 150 ఏళ్లు నిండాయి. స్వాతంత్ర్యోద్యమంలో ఆ గేయం ప్రజల్లో ఎంతో స్ఫూర్తి నింపింది. అయితే ఆ గేయం దేశ ప్రజల్లో ఇప్పటికీ నిరంతరం జాతీయవాద జ్వాలను రగిలిస్తోందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. దేశ ఐక్యత, దేశభక్తి, యువతలో ఉత్తేజానికి ఆ గేయం ఇంకా మూలంగానే ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా ఓ పోస్టు చేశారు. నవంబర్ 7వ తేదీ నుంచి వచ్చే ఏడాది నవంబర్ 7వ తేదీ వరకు వందే మాతరం ఉత్సవాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. వందేమాతర గేయం కేవలం పదాల అల్లిక కాదు అని, అది భారత దేశ అంతరాత్మను అందించిన స్వరమన్నారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా వందేమాతర గీతం దేశాన్ని ఐక్యంగా నిలిపిందన్నారు. స్వాతంత్ర్యోత్సవ జాగరణను బలోపేతం చేసిందన్నారు. మాతృదేశం కోసం అంకితమయ్యేలా, గర్వపడేలా, స్ఫూర్తి పొందేలా ఆ గేయం విప్లవకారుల్ని ఆకట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాదితో మన జాతీయ గీతానికి 150 ఏళ్లు నిండుతున్నట్లు ఆయన చెప్పారు. ఈ గేయాన్ని కుటుంబ సభ్యులతో కలిసి బలమైన స్వరంలో పూర్తి పాటను పాడాలని, భవిష్యత్తు తరాలకు వందేమాతర గేయం ప్రేరణగా నిలుస్తుందని అమిత్ షా తెలిపారు. వందేమాతర గీతాన్ని బంకిమ్ చంద్ర ఛటర్జీ కంపోజ్ చేశారు. సాహిత్య జర్నల్ బంగదర్శన్‌లో నవంబర్ 7, 1875లో ఈ గేయం పబ్లిష్ అయ్యింది. ఆ తర్వాత 1882లో ప్రచురించిన ఆనందమఠ్ నవలలోనూ ఈ గేయాన్ని ఆయన పొందుపరిచారు. రబీంద్రనాథ్ ఠాకూర్ ఈ గేయానికి మ్యూజిక్ అందించారు.

## ఆఫ్ఘన్-పాక్ సరిహద్దులో కాల్పుల మోత..

**కాందహార్ ప్రావిన్స్,**

ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు జరుగుతున్న తరుణంలోనే గురువారం సరిహద్దుల్లో కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఐదుగురు ఆఫ్ఘన్ పౌరులు మరణించగా, మరో ఆరుగురు గాయపడ్డారు. ఈ కాల్పులకు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ ఇరు దేశాలు ప్రకటనలు విడుదల చేశాయి. ఆఫ్ఘనిస్థాన్‌లోని కాందహార్ ప్రావిన్స్‌కు చెందిన స్పిన్ బోల్డాక్ జిల్లా ఆసుపత్రి అధికారి ఈ వివరాలను వెల్లడించారు. మృతుల్లో నలుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నట్లు ఆయన తెలిపారు. పాకిస్థాన్ వైపు ప్రాణనష్టంపై తక్షణ సమాచారం అందుబాటులో లేదు. టర్కీలోని ఇస్తాంబుల్‌లో పాకిస్థాన్‌తో మూడో విడత చర్చలు ప్రారంభమైన సమయంలోనే పాక్ దళాలు తమపై కాల్పులు జరిపాయని తాలిబన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ ఆరోపించారు. "చర్చల బృందానికి గౌరవం ఇచ్చి, పౌర నష్టాన్ని నివారించేందుకు మా దళాలు సంయమనం పాటిస్తున్నాయి" అని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలను పాకిస్థాన్ తీవ్రంగా ఖండించింది. "ఆఫ్ఘన్ వైపు నుంచి వచ్చిన ఆరోపణలను మేము తోసిపుచ్చుతున్నాం. ఆఫ్ఘనిస్థాన్ వైపు నుంచే కాల్పులు ప్రారంభమయ్యాయి. మా భద్రతా దళాలు బాధ్యతాయుతంగా, పరిమితంగా స్పందించాయి" అని పాకిస్థాన్ సమాచార మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. కాల్పులు సుమారు 10 నుంచి 15 నిమిషాల పాటు జరిగినట్లు స్థానిక అధికారులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి వచ్చిందని, కాల్పుల విరమణ అమలులో ఉందని పాకిస్థాన్ ధ్రువీకరించింది. ఇరు దేశాల మధ్య ఘర్షణలను నివారించేందుకు టర్కీ వేదికగా శాంతి చర్చలు జరుగుతున్నాయి. అయితే కాల్పుల విరమణ ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకోవడంలో గత వారం చర్చలు ప్రతిష్ఠంభనలో పడ్డాయి. పాకిస్థాన్‌లో దాడులకు పాల్పడుతున్న తెహ్రీక్-ఏ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) వంటి ఉగ్రవాద గ్రూపులకు ఆఫ్ఘనిస్థాన్ ఆశ్రయం కల్పిస్తోందని ఇస్లామాబాద్ ఆరోపిస్తోంది. ఈ ఆరోపణలను తాలిబన్ ప్రభుత్వం ఖండిస్తోంది. గత అక్టోబర్‌లో జరిగిన ఘర్షణల్లో ఆఫ్ఘన్ వైపు 50 మంది పౌరులు మరణించగా, పాకిస్థాన్‌కు చెందిన 23 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో తాజా ఘటన మరోసారి ఆందోళన కలిగిస్తోంది.

## మినిట్‌మ్యాన్-3 క్షిపణి ప్రయోగం

**కాలిఫోర్నియా,**

అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ, అమెరికా తన అణు సామర్థ్యాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. కాలిఫోర్నియాలోని వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి నవంబర్ 5న 'మినిట్‌మ్యాన్-3' అనే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఇది కేవలం ఆయుధ వ్యవస్థల విశ్వసనీయతను అంచనా వేయడానికి చేపట్టిన రొటీన్ పరీక్ష అని అధికారులు ప్రకటించినప్పటికీ, దీని వెనుక బలమైన వ్యూహాత్మక కారణాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. యూఎస్ ఎయిర్ ఫోర్స్ గ్లోబల్ స్ట్రైక్ కమాండ్ ఈ ప్రయోగాన్ని ధ్రువీకరించింది. ఈ క్షిపణి సుమారు 7,500 కిలోమీటర్లు ప్రయాణించి, పసిఫిక్ మహాసముద్రంలోని మార్షల్ దీవుల సమీపంలో ఉన్న రోనాల్డ్ రీగన్ బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ టెస్ట్ సైట్‌లోని లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఛేదించిందని అధికారులు తెలిపారు. ఇది కేవలం వ్యవస్థల పనితీరు, వేగం, కచ్చితత్వాన్ని అంచనా వేయడానికి చేపట్టిన రొటీన్ పరీక్ష అని, ఇందులో ఎలాంటి అణు వార్‌హెడ్‌లు ఉపయోగించలేదని పెంటగాన్ స్పష్టం చేసింది. రష్యా, చైనా, పాకిస్థాన్ వంటి దేశాలు అణు పరీక్షలు నిర్వహిస్తున్నాయని, ఈ పోటీలో అమెరికా వెనుకబడకూడదన్న ఉద్దేశంతో అధ్యక్షుడు ట్రంప్ ఈ పరీక్షలకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఎలాంటి పేలుడు పదార్థాలతో కూడిన అణు పరీక్షలు నిర్వహించబోమని అమెరికా ఇంధన శాఖ స్పష్టం చేసినప్పటికీ, ఈ ప్రయోగం ప్రచ్ఛన్నయుద్ధ కాలం నాటి అణు పోటీని గుర్తుచేస్తోందని నిపుణులు అంటున్నారు.మినిట్‌మ్యాన్-3 అమెరికా అమ్ములపొదిలో అత్యంత పురాతనమైన, భూమి నుంచి ప్రయోగించే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి. 1970ల నుంచి ఇది సేవలో ఉంది. నిమిషం వ్యవధిలోనే ప్రయోగించగలదు కాబట్టే దీనికి ఆ పేరు వచ్చింది. ఇది సుమారు 13,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను కూడా ఛేదించగలదు. ప్రస్తుతం అమెరికా వద్ద ఇలాంటివి 400 క్షిపణులు ఉన్నాయి. 2030 నాటికి వీటి స్థానంలో కొత్త క్షిపణులను ప్రవేశపెట్టాలని అమెరికా యోచిస్తోంది.ఈ ప్రయోగం అణ్వాయుధాల భయానక విధ్వంసాన్ని మరోసారి గుర్తుచేస్తోంది. ప్రస్తుతం అమెరికా వద్ద ఉన్న అత్యంత శక్తిమంతమైన %దీ%83 అణు బాంబు సామర్థ్యం 1.2 మెగాటన్నులు. అంటే హిరోషిమా బాంబు కంటే 80 రెట్లు ఎక్కువ. ఇది ఒక నగరంపై పడితే 10-15 కిలోమీటర్ల పరిధిలోని ప్రతిదీ బూడిదైపోతుంది. ఇటీవల, ప్రపంచాన్ని 150 సార్లు నాశనం చేయగల అణ్వాయుధాలు తమ వద్ద ఉన్నాయని అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. నిపుణుల అంచనా ప్రకారం, నాగరికతను నాశనం చేయడానికి 100-400 అణు వార్‌హెడ్‌లు చాలు. ఈ నేపథ్యంలో, మినిట్‌మ్యాన్-3 వంటి పరీక్షలు ఒకవైపు అమెరికా సైనిక సన్నద్ధతను చాటుకోవడానికే కాకుండా, ప్రత్యర్థి దేశాలకు ఒక హెచ్చరికగా కూడా ఉపయోగపడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## విమానయాన రంగంపై షట్‌డౌన్ తీవ్ర ప్రభావం

**చికాగో,**

అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ ప్రభావం విమానయాన రంగంపై తీవ్రంగా పడింది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి పెరగడంతో దేశవ్యాప్తంగా వందలాది విమానాలు రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులు తమ ప్రయాణాలను రీ షెడ్యూల్ చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన విమానాశ్రయాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. భద్రతా కారణాల దృష్ట్యా దేశంలోని రద్దీ ఎక్కువగా ఉండే 40 ప్రాంతాల్లో విమాన సర్వీసులను 10 శాతం వరకు తగ్గించాలని ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ విమానయాన సంస్థలను ఆదేశించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం నాటికి 750కి పైగా విమాన సర్వీసులను ముందుగానే రద్దు చేసినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌అవేర్ వెల్లడించింది. ప్రముఖ విమానయాన సంస్థ అమెరికన్ ఎయిర్‌లైన్స్ రోజుకు 220 విమానాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించగా, డెల్టా ఎయిర్‌లైన్స్ శుక్రవారం 170 సర్వీసులను, సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ 100 సర్వీసులను నిలిపివేసినట్లు తెలిపాయి. ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు, విమానాశ్రయ భద్రతా సిబ్బంది సహా వేలాది మంది కీలక ఉద్యోగులకు జీతాలు అందడం లేదు. దీంతో సిబ్బంది కొరత ఏర్పడింది. చాలామంది అనారోగ్య కారణాలతో సెలవులు పెడుతుండటంతో ఏటీసీ సేవలకు అంతరాయం కలుగుతోంది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# స్పోర్ట్స్



## ఆసీస్‌ను చిత్తు చేసిన టీమిండియా

క్వీన్స్‌ల్యాండ్‌లోని కరారా ఓవల్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో భారత్ 48 పరుగుల తేడాతో విజయం సాధించింది. తద్వారా ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 2-1 ఆధిక్యంలోకి దూసుకుపోయింది. 168 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా 18.2 ఓవర్లలో 119 పరుగులకు ఆలౌటైంది. ఆసీస్ బ్యాటర్లలో మిచెల్ మార్ష్ (30-24 బంతుల్లో 4 ఫోర్లు), మాథ్యూ షార్ట్ (25-9 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లు) లు రాణించారు. జోష్ ఇంగ్లిష్ (12), టిమ్ డేవిడ్ (14), జోష్ ఫిలిప్ (10), గ్లెన్ మాక్స్‌వెల్ (2)లు విఫలం అయ్యారు. భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ మూడు వికెట్లు పడగొట్టాడు. అక్షర్ పటేల్, శివమ్ దూబెలు చెరో రెండు వికెట్లు తీశారు. వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా లు తలా ఓ వికెట్ పడగొట్టారు. అంతక ముందు ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. భారత బ్యాటర్లలో శుభ్‌మన్ గిల్ (46-39 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) కొంచెంలో హాఫ్ సెంచరీని చేజార్చుకున్నాడు. అభిషేక్ శర్మ (28-21 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), శివమ్ దూబె (22-18 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), సూర్యకుమార్ యాదవ్ (20-10 బంతుల్లో 2 సిక్సర్లు) పర్వాలేదనిపించారు. ఇక చివరిలో అక్షర్ పటేల్ (21 నాటౌట్‌బీ 11 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) ధాటిగా ఆడాడు. జితేశ్ శర్మ (3), తిలక్ వర్మ (5)లు విఫలం అయ్యారు. ఆసీస్ బౌలర్లలో ఆడమ్ జంపా, నాథన్ ఎల్లిస్‌లు చెరో మూడు వికెట్లు తీశారు. జేవియర్ బార్ట్‌లెట్, మార్కస్ స్టోయినిస్ తలా ఓ వికెట్ సాధించారు. భారత బ్యాటర్లు తడబడ్డారు. వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్(39 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 46) జిడ్డు బ్యాటింగ్‌తో విసిగించడంతో టీమిండియా 168 పరుగుల సాధారణ లక్ష్యం నమోదు చేసింది. నాథన్ ఎల్లిస్(3/21), ఆడమ్ జంపా(3/45) మూడేసి వికెట్లతో భారత పతనాన్ని శాసించారు. దాంతో ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 167 పరుగులే చేసింది. అభిషేక్ శర్మ(21 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 28), శివమ్ దూబే(18 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 23), సూర్యకుమార్ యాదవ్(10 బంతుల్లో 2 సిక్స్‌లతో 20) దూకుడుగా ఆడే క్రమంలో వికెట్లు పారేసుకున్నారు. చివర్లో అక్షర్ పటేల్(11 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 21 నాటౌట్) మెరుపులు మెరిపించడంతో భారత్ 160 పరుగుల మార్క్ ధాటింది. ఆస్ట్రేలియా బౌలర్లలో నాథన్ ఎల్లిస్, ఆడమ్ జంపా మూడేసి వికెట్లు తీయగా.. గ్జేవియర్ బార్ట్‌లెట్, మార్కస్ స్టోయినిస్ చెరో వికెట్ పడగొట్టారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టుకు మెరుగైన ఆరంభమే దక్కింది. కానీ తొలి ఓవర్‌లోనే అభిషేక్ శర్మ ఇచ్చిన సునాయస క్యాచ్‌ను గ్జేవియర్ బార్ట్‌లెట్ నేలపాలు చేశాడు. ఈ అవకాశంతో అతను దూకుడుగా ఆడే ప్రయత్నం చేశాడు. కానీ ఆసీస్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో అభిషేక్ తనదైన శైలిలో పరుగులు రాబట్టలేకపోయాడు. మరోవైపు పేలవ ఫామ్ ఒత్తిడితో శుభ్‌మన్ గిల్ ఆచితూచి ఆడాడు. దాంతో పవర్ ప్లేలో భారత్ 49 పరుగులే చేసింది. ఆడమ్ జంపా బౌలింగ్‌లో భారీ సిక్సర్ బాదిన అభిషేక్ శర్మ అదే ఓవర్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. దాంతో తొలి వికెట్‌కు నమోదైన 56 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. బ్యాటింగ్ అవకాశం ఇవ్వాలని శివమ్ దూబేను ఫస్ట్ డౌన్‌లో పంపించగా అతను జాగ్రత్తగా ఆడాడు. క్రీజులో సెట్ అయిన శుభ్‌మన్ గిల్ కూడా ఆచితూచి ఆడటంతో పరుగుల వేగం తగ్గింది. దాంతో ఒత్తిడికి గురైన శివమ్ దూబే ఎదురు దాడికి దిగాడు. ఆడమ్ జంపా బౌలింగ్‌లో భారీ సిక్సర్ బాది జోరు కనబర్చినప్పటికీ.. అతన్ని నాథన్ ఎల్లిస్ క్లీన్ బౌల్డ్ చేశాడు. కెప్టెన్ సూర్య వచ్చిరావడంతో జంపా బౌలింగ్‌లో వరుసగా రెండు భారీ సిక్స్‌లు బాదాడు. అప్పటి వరకు నిదానంగా ఆడిన శుభ్‌మన్ గిల్ కూడా భారీ సిక్సర్ బాది హాఫ్ సెంచరీకి చేరువయ్యాడు. కానీ నాథన్ ఎల్లిస్ క్లీన్ బౌల్డ్ చేశాడు. 39 బంతులాడిన గిల్.. 46 పరుగులే చేశాడు. అతని స్లో బ్యాటింగ్ ఇతర బ్యాటర్లపై ప్రభావం చూపింది. తిలక్ వర్మ(5), జితేశ్ శర్మ(6) అంచనాలు అందుకోకపోగా.. వాషింగ్టన్ సుందర్(12), అర్ష్‌దీప్ సింగ్(0) తీవ్రంగా నిరాశపర్చారు. వరుణ్ చక్రవర్తి సాయంతో అక్షర్ పటేల్(21 నాటౌట్) దూకుడుగా ఆడి పోరాడే లక్ష్యాన్ని అందించాడు. శుభ్‌మన్ గిల్ కాస్త వేగంగా ఆడి ఉంటే టీమిండియా మరో 10-20 పరుగులు అదనంగా చేసి ఉండేది.

## ధోనికి ఇప్పుడే రిటైర్‌మెంట్ అయ్యే ఉద్దేశం లేదు

### సీఎస్‌కే సీఈఓ కాశి విశ్వనాథన్ వెల్లడి

ఎంఎస్ ధోనీ ఫ్యాన్స్‌కు అదిరిపోయే గుడ్‌న్యూస్ ఇది. వచ్చే ఏడాది ఐపీఎల్‌లో ఆడతాడా..? లేదా..? అని ఫ్యాన్స్ టెన్షన్ పడుతున్న నేపథ్యంలో సీఎస్‌కే సీఈఓ కాశి విశ్వనాథన్ సూపర్ న్యూస్ చెప్పారు. ధోనికి ఇప్పుడే రిటైర్‌మెంట్ అయ్యే ఉద్దేశం లేదని క్లారిటీ ఇచ్చేశారు. ఈ విషయం గురించి తాను కూడా ధోనీతో మాట్లాడతానని తెలిపారు. ఈ సీజన్‌లో రుతురాజ్ గైక్వాడ్ గాయంతో తప్పుకోగా.. ఎంఎస్ ధోనీ మరోసారి నాయకత్వ బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. అయితే ఐపీఎల్ చరిత్రలో తొలిసారి చెన్నై సూపర్ కింగ్స్ లీగ్ దశలో చివరి స్థానంలో




నిలిచింది. దీంతో ధోని ఐపీఎల్‌కు గుడ్ బై చెబుతాడేమో అని ఫ్యాన్స్ కంగారు పడుతున్న వేళ రిటైర్‌మెంట్‌పై క్లారిటీ రావడం శుభపరిణామం. ధోని కెప్టెన్సీలో చెన్నై సూపర్ కింగ్స్ 2010, 2011, 2018, 2021, 2023 సీజన్స్‌లో విజేతగా నిలిచింది. అత్యధిక టైటిల్స్ నెగ్గిన కెప్టెన్‌గా రోహిత్ శర్మతో ధోనీ సమంగా ఉన్నాడు. రిటైర్‌మెంట్‌పై కూడా ఇటీవల ధోని ఇటీవల స్పందించాడు. ఐపీఎల్‌కు ఇంకా 4-5 నెలలు సమయం ఉందని.. తాను ఆగిపోయానని చెప్పడం లేదన్నాడు. ఆలోచించడానికి టైమ్ ఉందని.. తరువాత నిర్ణయం తీసుకుంటానని చెప్పాడు. ప్రతి ఏడాది బాడీ ఫిట్‌గా ఉంచేందుకు శాతం ఎక్కువగా కృషి చేయాల్సి ఉంటుందని అన్నాడు. ప్రస్తుతం ఐపీఎల్ ఆడుతున్న వారిలో ధోనీ (44)దే ఎక్కువ వయసు. ఐపీఎల్‌లో 100 మ్యాచ్‌లు గెలిచిన ఏకైక కెప్టెన్‌గా ధోనీ ఉన్నాడు. ధోనీ నాయకత్వంలో చెన్నై చివరిసారిగా 2023లో ఛాంపియన్‌గా నిలిచింది. ధోనీ కెప్టెన్సీలో సీఎస్‌కే 136 మ్యాచ్‌ల్లో విజయం సాధించగా.. 97 మ్యాచ్‌లలో ఓడిపోయింది. ఐపీఎల్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్లలో ధోనీ అగ్రస్థానంలో ఉన్నాడు. ఇప్పటివరకు 278 మ్యాచ్‌లు ఆడాడు. 38.30 సగటుతో 5439 పరుగులు చేశాడు. ఇందులో 24 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 47 స్టంపింగ్‌లు, 154 క్యాచ్‌లు తీసుకున్నాడు.



## సురేశ్ రైనా, శిఖర్ ధావన్ ఆస్తులను అటాచ్ చేసిన ఈడీ

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసు నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్ ఆస్తులను ఎన్?ఫోర్స్?మెంట్? డైరెక్టరేట్ (ఈడీ)అటాచ్ చేసింది. మొత్తం రూ.11.14 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. ఇటీవల ఇదే కేసులో రైనా, ధావన్ ఈడీ విచారణకు హాజరయ్యారు. ఈ ఇద్దరు ఆటగాళ్లు '1%ఇదీవ్%' అనే ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించారు. ఈ అక్రమ బెట్టింగ్ యాప్‌లు అనేకమందిని లూటీ చేసినట్లు దర్యాప్తు సంస్థ విచారణలో తేలింది. పెట్టుబడిదారులు మోసం చేసి రూ.కోట్లు పన్నులు ఎగవేసినట్లు వెల్లడైంది. అందుకే గతంలోనే ఈ ఇద్దరికీ ఆడీ సమన్లు జారీ చేసి, విచారించింది. తాజాగా ఈ ఇద్దరికి చెందిన రూ.11.14 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. అక్రమ బెట్టింగ్ యాప్ 1%ఇదీవ్%కు ధావన్ ప్రమోషన్స్ చేస్తూనే భాగస్వామిగా ఉన్నాడని ఈడీ అనుమానిస్తోంది. ఈ బెట్టింగ్ యాప్?తో ధావన్‌కు ఏం సంబంధం అనే కోణంలో విచారణ చేపట్టింది. ఇందులో భాగంగానే గత సెప్టెంబర్‌లో ఈడీ విచారించి, వాంగ్మూలాన్ని రికార్డ్ చేసింది. అటు బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేశాడన్న అభియోగాలపై రైనాను కూడా ఇప్పటికే 8






గంటలకు పైగా విచారించింది. అతడికి కూడా బెట్టింగ్ యాప్స్‌లో షేర్ ఉందా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. గత 18ఏళ్లుగా ఈ కంపెనీ బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. వివిధ స్పోర్ట్స్ ఈవెంట్లపై బెట్టింగ్ వేస్తే భారీ మొత్తం గెలుచుకోవచ్చని ఆశ చూపిస్తోంది. ఈ ఆటగాళ్ల నుంచి యాప్‌కు సంబంధించిన లావాదేవీలు, ఆర్థిక కార్యకలాపాల గురించి ఈడీ సమాచారాన్ని సేకరించింది. ప్రస్తుతానికైతే ఈ ఇద్దరూ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అయితే 70 భాషల్లో ఈ యాప్ ఉండడం గమనార్హం. అయితే ప్రస్తుతం ఈడీ దర్యాప్తు ప్రారంభ దశలో ఉంది. ఈ అక్రమ యాప్ ప్రమోషన్‌లో లేదా మరేదైనా విధంగానైనా ఆటగాళ్ల పేర్లు లేదా ఫొటోలను ఉపయోగించారా అనే దానిపై ఏజెన్సీ దృష్టి పెట్టింది. వీళ్లతోపాటు ఇదే కేసు విషయంలో యువీ, ఊతప్పకు కూడా ఈడీ నోటీసులిచ్చింది.

## నలుగురు ఆటగాళ్లను వదులుకోనున్న చెన్నై

ఇండియన్ ప్రీమియర్ లీగ్ తదుపరి సీజన్ ప్రారంభానికి ముందు డిసెంబర్‌లో వేలం జరగనుంది. దీని కోసం అన్ని ఫ్రాంచైజీలు తమ విడుదల, రిటైన్ చేసిన ఆటగాళ్ల జాబితాను నవంబర్ 15 నాటికి బోర్డుకు సమర్పించాలి. తన కెప్టెన్సీలో చెన్నై సూపర్ కింగ్స్ ని 5 సార్లు ఛాంపియన్‌గా నిలిపిన ధోని వచ్చే సీజన్‌లో ఆడటం దాదాపు ఖాయం. వేలంలో తమ పర్సు విలువను పెంచుకోవడానికి ఏ 4 మంది ఆటగాళ్లను విడుదల చేయవచ్చో తెలుసుకోండి. వచ్చే ఏడాది ఐపీఎల్ 19వ సీజన్ జరగనుంది. దీనికి ముందు డిసెంబర్ మధ్యలో (రెండవ లేదా మూడో వారంలో) ఐపీఎల్ వేలం జరగవచ్చు. ఇది భారతదేశం వెలుపల యూఏఈలో నిర్వహించాలని యోచిస్తున్నారు. అన్ని ఫ్రాంచైజీలకు నవంబర్ 15న తమ రిటైన్, విడుదల చేసిన ఆటగాళ్ల జాబితాను సమర్పించడానికి చివరి తేదీ. ఇక్కడ మనం చెన్నై సూపర్ కింగ్స్ జట్టు గురించి మాత్రమే మాట్లాడుతున్నాము, ఈ ఫ్రాంచైజీ ఏ 4 మంది ఆటగాళ్లను విడుదల చేయవచ్చు.

## డబ్ల్యూపీఎల్ 2026 రిటెన్షన్ లిస్ట్ విడుదల..

మహిళల ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌కు సంబంధించిన రిటెన్షన్ లిస్ట్ విడుదలైంది. నవంబర్ 6, గురువారం రిటెన్షన్ గడువు ముగియడంతో అన్ని ఫ్రాంఛైజీలు తాము అట్టిపెట్టుకున్న, విడుదల చేసిన ఆటగాళ్ల వివరాలను ప్రకటించాయి. ఈసారి రిటెన్షన్స్‌లో కొన్ని సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా ఇటీవలి మహిళల ప్రపంచకప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్?గా నిలిచిన దీప్తి శర్మతో పాటు, ఢిల్లీ క్యాపిటల్స్ మాజీ కెప్టెన్ మెగ్ లానింగ్ను కూడా వారి వారి జట్లు విడుదల చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. డబ్ల్యూపీఎల్ 2026 మెగా వేలం ఈ నెలాఖరు (నవంబర్ 27)లో జరగనుంది. ఈ సందర్భంగా ఏ జట్టు ఎంత మందిని రిటైన్ చేసుకుంది, విడుదలైన స్టార్ ప్లేయర్‌ల వివరాలు చూద్దాం. మహిళల ప్రీమియర్ లీగ్ 2026 కోసం రిటెన్షన్ గడువు ముగిసింది. ఈసారి గరిష్ఠంగా ఐదుగురు ఆటగాళ్లను అట్టిపెట్టుకునే అవకాశం ఉన్నప్పటికీ, ఫ్రాంఛైజీలు కొన్ని అనూహ్య నిర్ణయాలు తీసుకున్నాయి. ప్రపంచకప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్?గా నిలిచిన దీప్తి శర్మతో పాటు, సౌతాఫ్రికాను ఫైనల్ వరకు తీసుకెళ్లిన లారా వోల్వార్ట్, ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఫైనల్‌కు చేర్చిన కెప్టెన్ మెగ్ లానింగ్?లను వారి జట్లు విడుదల చేయడం గమనార్హం. ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు గరిష్ఠంగా ఐదుగురు ఆటగాళ్ల చొప్పున రిటైన్ చేసుకున్నాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నలుగురు ఆటగాళ్లను, గుజరాత్ జెయింట్స్ ఇద్దరు ఆటగాళ్లను రిటైన్ చేసుకోగా, యూపీ వారియర్స్ కేవలం ఒక్కే ఒక్క ప్లేయర్?ను మాత్రమే అట్టిపెట్టుకుంది. ఫ్రాంఛైజీలు అట్టిపెట్టుకున్న ఆటగాళు ,, వారికి కేటాయించిన సొమ్ము వివరాలు తెలుసుకుందాం. ముంబై ఇండియన్స్ టీమ్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (రూ.2.5 కోట్లు), హీలీ మాథ్యూస్ (రూ.1.75 కోట్లు), నట్-సైవర్ బ్రంట్ (రూ.3.5 కోట్లు)తో సహా ఐదుగురిని రిటైన్ చేసుకుంది. ఇక్కడ గమనించదగ్గ విషయం ఏమిటంటే, ప్రపంచకప్ అందించిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కంటే ఇంగ్లాండ్ క్రికెటర్ నట్ సైవర్-బ్రంట్‌కే ఎక్కువ ధర కేటాయించారు. మెగ్ లానింగ్‌ను రిలీజ్ చేసిన ఢిల్లీ.. ఎనాబెల్ సదర్లాండ్, మారిజన్నె కాప్, జెమిమా రోడ్రిగ్స్, షెఫాలీ వర్మ, నిక్కీ ప్రసాద్ లను రిటైన్ చేసుకుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్మృతి మంధాన (రూ.3.5 కోట్లు), ఎలిస్ పెర్రీ (రూ.2 కోట్లు), రిచా ఘోష్, శ్రేయాంక పాటిల్ లను అట్టిపెట్టుకుంది. ఈ మెగా వేలం ప్రక్రియ నవంబర్ 27, 2025న నిర్వహించనున్నట్లు సమాచారం. జట్లకు ఆర్టీఎం కార్డుల విషయంలో పెద్ద తేడాలు ఉన్నాయి. ఆర్టీఎం కార్డులు ఏ జట్టుకు అందుబాటులో లేవు. గతంలో ఉన్న నియమం ప్రకారం.. యూపీ వారియర్స్ 4 ఆర్టీఎం కార్డులతో, గుజరాత్ జెయింట్స్ 3 ఆర్టీఎం కార్డులతో, ఆర్‌సీబీ 1 ఆర్టీఎం కార్డుతో వేలంలోకి దిగనున్నాయి. ఎంఐ, డీసీలకు మాత్రం ఎలాంటి ఆర్టీఎం కార్డులు అందుబాటులో లేవు.

## వరల్డ్ కప్ విజేతకు అరుదైన గౌరవం..

మహిళల వన్డే ప్రపంచకప్ 2025 గెలిచి చరిత్ర సృష్టించిన భారత జట్టుపై ప్రస్తుతం ప్రశంసల వర్షం కురుస్తోంది. దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో ఓడించి తొలిసారిగా ఐసీసీ టైటిల్‌ను సొంతం చేసుకున్న టీమ్ ఇండియాలోని క్రీడాకారులకు పలువురు ప్రముఖులు, క్రీడా సంస్థలు బహుమతులను ప్రకటిస్తున్నాయి. ఈ సందర్భంగా బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ భారత జట్టుకు చెందిన స్టార్ వికెట్‌కీపర్-బ్యాటర్ రిచా ఘోష్?కు అరుదైన బహుమతిని ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఆమె అద్భుత ప్రదర్శనకు గుర్తింపుగా గోల్డ్ ప్లేటెడ్ బ్యాట్, బాల్‌ను బహూకరించనున్నారు. భారత మహిళా క్రికెట్ జట్టు వికెట్‌కీపర్-బ్యాటర్ రిచా ఘోష్, ప్రపంచకప్ విజయంలో తన మెరుపు బ్యాటింగ్‌తో కీలక పాత్ర పోషించారు. ఈ గొప్ప ప్రదర్శనకు గుర్తింపుగా బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ ఆమెను ఘనంగా సన్మానించాలని నిర్ణయించింది. బెంగాల్ క్రికెట్ అసోసియేషన్, రిచా ఘోష్‌కు గోల్డ్ ప్లేటెడ్ బ్యాట్, బాల్‌ను బహుమతిగా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఈ బంతి, బ్యాట్‌పై భారత పురుషుల జట్టు మాజీ కెప్టెన్, బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ, అలాగే మహిళల క్రికెట్ దిగ్గజ క్రీడాకారిణి ఝులన్ గోస్వామి సంతకాలు చేసి అందించనున్నారు. రిచా ఘోష్‌ను సన్మానించే ఈ నిర్ణయంపై బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ హర్షం వ్యక్తం చేశారు. "రిచా ఘోష్‌ను గౌరవించడం అసోసియేషన్‌కు చాలా గర్వకారణం. ఆమె తన అద్భుత ప్రదర్శనతో బెంగాల్‌కే కాకుండా యావత్ భారతదేశానికి గర్వకారణంగా నిలిచింది," అని గంగూలీ అన్నారు. "రిచా ప్రపంచ వేదికపై అద్భుతమైన ప్రతిభ, సంయమనం, పోరాట స్ఫూర్తిని చూపింది. భారత క్రికెట్‌కు ఆమె చేసిన ఈ గొప్ప సహకారానికి గుర్తుగా, గోల్డ్ ప్లేటెడ్ బ్యాట్, బాల్ అందించడం మా తరపున ఒక చిన్న గౌరవం మాత్రమే" అని గంగూలీ అన్నారు. మహిళల ప్రపంచకప్‌లో రిచా ఘోష్ బ్యాటింగ్ ప్రదర్శన టీమిండియా విజయంలో ముఖ్యమైంది. ఈ టోర్నమెంట్‌లో రిచా 8 ఇన్నింగ్స్‌లలో మొత్తం 235 పరుగులు చేసింది. ఆమె పరుగులు చేసిన విధానం మరింత ముఖ్యం. ఆమె 133.52 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసింది, ఇది ఆ టోర్నమెంట్‌లో ఉత్తమ స్ట్రైక్ రేట్గా నమోదైంది. కీలకమైన మ్యాచ్‌లలో చివర్లో వచ్చి ఆమె బాదిన బౌండరీలు, సిక్సర్లు భారత జట్టుకు ఎన్నో విజయాలను అందించాయి. టోర్నమెంట్‌లో భారత్ తరపున అత్యధిక పరుగులు చేసిన టాప్-5 క్రీడాకారులలో రిచా కూడా ఉంది.

## టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ వేదిక ఖరారు!

భారత్ వేదికగా వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చిలో జరగనున్న పురుషుల టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ వేదిక ఖరారైనట్లు తెలుస్తోంది. దేశంలోనే అతిపెద్ద గ్రౌండ్ అయిన అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియాన్ని ఫైనల్ వేదికగా ఖరారు చేసినట్లు సమాచారం. మహిళల వన్డే ప్రపంచకప్ 2025 ముగిసిన నేపథ్యంలో టీ20 ప్రపంచకప్ 2026 షెడ్యూల్‌పై ఐసీసీ కసరత్తులు చేస్తోంది. ఈ క్రమంలోనే ఆతిథ్య దేశం అయిన భారత్ వేదికల ఎంపికపై కార్యచరణను మొదలుపెట్టింది. ఫైనల్‌తో సహా లీగ్ మ్యాచ్‌లకు సంబంధించిన వేదికల వివరాలతో కూడిన డ్రాఫ్ట్ షెడ్యూల్‌ను ఐసీసీకి బీసీసీఐ సమర్పించాల్సి ఉంటుంది. ఈ డ్రాఫ్ట్ షెడ్యూల్‌పై సభ్యదేశాల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని ఐసీసీ మార్పులు చేర్పులు చేస్తుంది. ఆ తర్వాతే షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటిస్తారు. తాజా నివేదికల ప్రకారం ఫిబ్రవరి 6 నుంచి మార్చి 8 వరకు టీ20 ప్రపంచకప్ 2026 జరగనున్నట్లు తెలుస్తోంది. టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీకి అహ్మదాబాద్, కోల్‌కతా, చెన్నై, ముంబై నగరాలను షార్ట్‌లిస్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఒక్కో వేదికగా 6 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇరు దేశాల క్రికెట్ బోర్డుల పరస్పర అంగీకారం కారణంగా పాకిస్థాన్ మ్యాచ్‌లు శ్రీలంక వేదికగా జరగనున్నాయి. శ్రీలంకలోని కొలంబో, పల్లెకెలె, గాలే వేదికగా టీ20 ప్రపంచకప్ 2026 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఒకవేళ పాకిస్థాన్ ఫైనల్ చేరితే తుది పోరుకు కొలంబో ఆతిథ్యం ఇవ్వనుంది. అహ్మదాబాద్‌లో ఫైనల్ అంటే భారత అభిమానులు జంకుతున్నారు. గతంలో ఇదే వేదికగా జరిగిన పురుషుల వన్డే ప్రపంచకప్ 2023లో భారత్ ఓడింది. ఈ టోర్నీలో ఓటమెరుగని జట్టుగా ఫైనల్ చేరిన భారత్.. ఫైనల్లో ఆసీస్ చేతిలో మాత్రం ఓటమిపాలైంది. ఈ క్రమంలోనే ఫైనల్‌ను అచ్చొచ్చిన ముంబై వేదికగా నిర్వహించాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ టోర్నీలో మొత్తం 20 జట్లు బరిలోకి దిగుతున్నాయి. గ్రూప్ స్టేజ్‌లో ఐదు జట్ల చొప్పున నాలుగు గ్రూప్‌లు చేయనున్నారు. రౌండ్ రాబిన్ పద్ధతిన ప్రతీ జట్టు తమ గ్రూప్‌లోని మిగిలిన జట్లతో తలపడుతుంది. తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్-8కు అర్హత సాధిస్తాయి. సూపర్-8 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజిస్తారు. రౌండ్ రాబిన్ పద్ధతిలో ప్రతీ జట్టు తమ ప్రత్యర్థితో తలపడుతుంది. రెండు గ్రూప్స్‌లో టాప్-2లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. సెమీఫైనల్లో గెలిచిన జట్లు ఫైనల్ చేరుతాయి.

టీ20 ప్రపంచకప్ వేదికలకు సంబంధించిన షార్ట్ లిస్ట్‌లో తెలుగు రాష్ట్రాలకు చెందిన మైదానాలు లేవు. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంతో పాటు వైజాగ్‌లోని ఏసీ-వీడీసీఏ క్రికెట్ స్టేడియాలను ఎంపిక చేయలేదు. దాంతో తెలుగు అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు మైదానాలకు మ్యాచ్‌లు కేటాయించాలని కోరుతున్నారు.

## ఎందుకు పక్కన పెట్టామో అర్ష్‌దీప్ సింగ్‌కు అర్థమైంది

### టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్

ఆస్ట్రేలియాతో తొలి రెండు టీ20లకు అర్ష్‌దీప్ సింగ్‌ను ఎందుకు పక్కనపెట్టామో అతనికి అర్థమైందని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ తెలిపాడు. టీ20 ప్రపంచకప్ 2026 కాంబినేషన్ కోసం ప్రయోగాలు చేస్తున్నామని, ఈ క్రమంలోనే అతనికి అవకాశం దక్కలేదని వివరణ ఇచ్చాడు. ఈ విషయాన్ని అర్ష్‌దీప్ సింగ్ అర్థం చేసుకున్నాడని చెప్పాడు. మూడో టీ20లో రీఎంట్రీ ఇచ్చిన అర్ష్‌దీప్ సింగ్ మూడు వికెట్లతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. గురువారం గోల్డ్ కోస్ట్ వేదికగా నాలుగో టీ20 జరగనున్న నేపథ్యంలో మోర్నీ మోర్కెల్ బుధవారం మీడియాతో మాట్లాడాడు. ఈ సందర్భంగా అర్ష్‌దీప్ సింగ్‌ను పక్కనపెట్టడంపై క్లారిటీ ఇచ్చాడు. 'అర్ష్‌దీప్ సింగ్ చాలా అనుభవం కలిగిన బౌలర్. మా ప్రయోగాల గురించి అతను




పూర్తిగా అర్థం చేసుకున్నాడు. అతను ఒక ప్రపంచ స్థాయి బౌలర్. పవర్ ప్లేలో అత్యధిక వికెట్లు తీసే బౌలర్. జట్టుకు అతని విలువ ఏంటో మాకు తెలుసు. అయితే ఈ పర్యటనలో మేం వివిధ కాంబినేషన్లను ప్రయత్నించాం. జట్టు ఎంపిక టీమ్‌మేనేజ్‌మెంట్‌తో పాటు ఆటగాళ్లకు సవాలే. టీ20 ప్రపంచకప్ 2026 ముంగిట విభిన్నమైన కాంబినేషన్స్‌ను ప్రయత్నించాలనుకుంటున్నాం. దీంతో ఆటగాళ్లు తమకు అవకాశం రాలేదని నిరాశకు గురవ్వడం సహజమే. కానీ, మేనేజ్‌మెంట్ మరోలా ఆలోచిస్తుంది. ఆటగాళ్లను ఇంకా శ్రమించేలా ప్రోత్సహిస్తాం. ఎప్పుడూ అవకాశం వచ్చినా అత్యుత్తమ ఆటతీరు కనబర్చేలా సన్నద్ధం చేస్తాం. వచ్చే పొట్టి కప్‌లోగా చాలా తక్కువ మ్యాచ్‌లనే ఆడాల్సి ఉంటుంది. ఒత్తిడి సమయాల్లో ఆటగాళ్లు ఎలా రాణిస్తారనేది పరీక్షించాం. వారి సత్తాపై మాకు ఎలాంటి సందేహం లేదు. మ్యాచ్‌లను ఎలా గెలవాలనే దానిపైనే వర్కౌట్ చేస్తున్నాం.'అని మోర్నీ మోర్కెల్ వెల్లడించాడు. నితీష్ కుమార్ రెడ్డి గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడని, నాలుగో టీ20లో బరిలోకి దిగుతాడని మోర్కెల్ తెలిపాడు.

# కుప్పం నియోజకవర్గం పరిశ్రమల గేట్‌వేగా మారింది

## చంద్రబాబు, లోకేశ్ కృషితోనే ఇది సాధ్యమైంది

## ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ

**అమరావతి,**

ప్రపంచ ప్రఖ్యాత యాపిల్ సంస్థకు చెందిన ఐఫోన్ల తయారీలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించనుందని, అందుకు కుప్పం నియోజకవర్గం గేట్‌వేగా మారిందని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ల కృషితో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు, పెట్టుబడులు తరలివస్తున్నాయని ఆమె కొనియాడారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ రోజు రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజని అనురాధ అభివర్ణించారు. అమెరికా టెక్ దిగ్గజం యాపిల్ ఐఫోన్ చాసిస్‌కు అవసరమైన హై-గ్రేడ్ అల్యూమినియం ఇకపై కుప్పం నుంచే సరఫరా అవుతుందని ఆమె ప్రకటించారు. ఇందుకోసం ప్రముఖ పారిశ్రామిక సంస్థ హిందాల్కో రూ.586 కోట్ల పెట్టుబడితో కుప్పంలో పరిశ్రమను ఏర్పాటు చేస్తోందని వెల్లడించారు. ఈ పరిశ్రమ ద్వారా 613 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభించడంతో పాటు, లాజిస్టిక్స్, సేవలు, నైపుణ్యాభివృద్ధి వంటి అనుబంధ రంగాల్లో వేలాది మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఈ పరిణామంతో ఆంధ్రప్రదేశ్ యాపిల్ గ్లోబల్ సప్లై చైన్‌లో భాగమైందని, దానికి కుప్పం ప్రవేశ ద్వారంగా నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి 20 లక్షల ఉద్యోగాలు తీసుకురావాలనే లక్ష్యంతో మంత్రి నారా లోకేశ్ గత 16 నెలలుగా దుబాయ్, అమెరికా, ఆస్ట్రేలియా, లండన్ వంటి అనేక దేశాల్లో పర్యటించి పెట్టుబడులను ఆకర్షించారని గుర్తుచేశారు. ఆయన అవిశ్రాంత కృషితో ఇప్పటివరకు రూ.10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను రాష్ట్రానికి రప్పించగలిగారని చెప్పారు. జగన్ పాలనలో రాష్ట్రం పూర్తిగా అధోగతి పాలైందని అనురాధ తీవ్రంగా విమర్శించారు. రూ.11 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని నాశనం చేశారని, కనీసం రాజధాని కూడా లేకుండా చేశారని మండిపడ్డారు. నకిలీ మద్యం, అక్రమ మైనింగ్, గంజాయి, కిడ్నాప్‌లు, అత్యాచారాలతో రాష్ట్రాన్ని గందరగోళంలోకి నెట్టారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తుంటే, జగన్ రెడ్డి దొంగ మెయిల్స్ పంపుతూ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆమె ఆరోపించారు. తన సొంత పరిశ్రమలైన నకిలీ మద్యం, అక్రమ మైనింగ్ దందాలు మూతపడతాయనే భయంతోనే జగన్ ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు. జగన్ హయాంలో పీపీఏలు రద్దు చేయడం వల్ల ప్రజల సొమ్ము రూ.10,000 కోట్లు జరిమానాగా కట్టాల్సిన దుస్థితి ఏర్పడిందని గుర్తుచేశారు. వైసీపీ నేతలు ఎన్ని గిమ్మిక్కులు చేసినా, కుట్రలు పన్నినా రాష్ట్రాభివృద్ధిని ఆపలేరన్నారు. రాష్ట్రాన్ని కాపాడేది, జగన్ కుట్రలకు ఫుల్‌స్టాప్ పెట్టేది చంద్రబాబు నాయుడేనని ఆమె స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గానికి హిందాల్కో పరిశ్రమను తీసుకొచ్చిన మంత్రి నారా లోకేశ్ కు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# గోపాలమిత్రల “గోస”

## 8 నెలలుగా అందని వేతనాలు

## తీవ్ర దయనీయ స్థితిలో గోపాలమిత్రలు

## ఉమ్మడి నల్లగొండ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 248 మంది



**అక్షరకలం ప్రతినిధి, నల్గొండ**

పశుసంవర్ధక శాఖలో దీర్ఘకాలికంగా బహుముఖ సేవలు అందిస్తున్న గోపాలమిత్రల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వ పశువైద్య సిబ్బందితో సమానంగా పనిచేస్తున్న వీరికి ఉద్యోగ భద్రత లేదు. వారికి ఇచ్చేది అరకొర వేతనాలే. అందులోనూ 8 నెలలుగా గత ఏప్రిల్ మాసం నుండి వేతనాలు అందడమే లేదు. దీంతో కుటుంబ పోషణకు అవస్థలు పడాల్సి వస్తోంది.

### 248 మంది...

పాడిసంపదను వృద్ధి చేయాలన్న లక్ష్యంతో జాతీయ కృత్రిమ గర్భధారణ పథకం కింద గోపాలమిత్రలను నియమించారు. రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ (లైవ్ స్టాక్ డెవలప్మెంట్ఏజెన్సీ) వీరిని పర్యవేక్షిస్తూ వచ్చింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో మొత్తం 248 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. నల్లగొండ జిల్లాలో 108 మంది, సూర్యాపేట జిల్లాలో 76 మంది, యాదాద్రి భువనగిరి జిల్లా నుండి 64 మంది గోపాల మిత్రలు పనిచేస్తున్నారు.అయితే ఒక్కో మండలంలో ముగ్గురు నుండి ఐదుగురు చొప్పున విధులు నిర్వర్తిస్తున్నారు. కొన్ని మండలాల్లో ఇద్దరు మాత్రమే ఉండటం గమనార్హం.

### విధులు ఇలా...

రైతుల ఇంటికి వెళ్లి పశువులకు కృత్రిమ గర్భధారణ టీకాలు, నట్టల నివారణ మందులు వేయడం, గర్భకోశ వ్యాధులు, జబ్బవాపు, గొంతు వాపు నివారణకు హెచ్ఎస్ టీకాలు వేయడంతో పాటు ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలపై వీరు అవగాహన కల్పిస్తారు. విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తారు. ఇటీవల అన్ని గ్రామాల్లో గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నారు. ఇటీవలే నల్గొండ జిల్లాలోని వేములపల్లి శివారు వద్ద కలుషిత ఆహారం తిని సుమారు 150 కి పైగా గొర్రెలు చనిపోగా, ప్రాణాపాయ స్థితిలో ఉన్న మిగతా గొర్రెలకు గోపాలమిత్రలు దగ్గరగా ఉండి పశు వైద్యుల సలహా మేరకు ప్రథమ చికిత్స అందించి జీవాల ప్రాణాలను కాపాడారు. గొర్రెల కాపర్లు లక్షల రూపాయలు నష్టపోకుండా ఆదుకున్నారు.

### క్రమబద్ధీకరణ లేక...

గోపాలమిత్రలకు ఉద్యోగ క్రమబద్ధీకరణ జరగలేదు. స్వరాష్ట్రం వచ్చాక వీరి వేతనం రూ.3,500 నుంచి రూ.8,500కు పెరిగింది. 2022 అక్టోబరులో రూ.11,050కు పెంచారు. ఇంతవరకు బాగానే ఉన్నా 8 నెలలుగా వేతనాలు విడుదల కాకపోవడం గమనార్హం. ఉద్యోగ భద్రత లేకపోవడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం లేకపోవడం వారిని ఆందోళనకు గురిచేస్తోంది.

### 25 ఏళ్లుగా సేవలందిస్తున్నాం....

#### చెరుకు శ్రీనివాస్

#### ( గోపాలమిత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు )

గత 8 నెలలుగా వేతనాలు రాక నానాపాట్లు పడుతున్నాం. ఉద్యోగ క్రమబద్ధీకరణతో పాటు ఇతర అన్ని సౌకర్యాలు కల్పించాలి. రాష్ట్ర వ్యాప్తంగా 25 సంవత్సరాల నుండి సేవలు అందిస్తున్నాం. మాకు ఇతర శాఖలలో స్కిల్ వర్క్ విధులు నిర్వహిస్తున్న వారికి అందిస్తున్న విధంగా 24 వేల వేతనం, ప్రతి నేల జిల్లా అధికార యంత్రాంగం తో పాటు ఇవ్వాలి.సీనియర్ గోపాలమిత్రులకు డిపార్ట్మెంట్ టెస్ట్ నిర్వహించి అర్హులైన వారికి ఆఫీస్ అపార్ట్మెంట్ అవకాశం కల్పించాలి. విధి నిర్వహణలో చనిపోయిన గోపాల మిత్రల సభ్యులకు కారణ్య నియామకం ద్వారా ఉద్యోగం కల్పించాలి.



కుటుంబ సభ్యులకు 10 లక్షల మెడికల్ ఇన్సూరెన్స్, పోలీస్ శాఖ లో హోంగార్డ్ లకు ఉన్న ప్రమాద భీమా ఆరు లక్షల సౌకర్యం కల్పించాలి. ఏళ్లుగా తక్కువ వేతనాలకు సేవలు అందిస్తున్న గోపాల మిత్రల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి.

# ఎర్రచందనం స్మగ్లర్లపై ఉక్కుపాదం

## కీలక స్మగ్లర్లను ఇప్పటికే గుర్తించాం

## ఆపరేషన్ మొదలుపెడితే వెనుదిరిగేది లేదు

## అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరిక

## అటవీ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష

**అమరావతి,**

ఆంధ్రప్రదేశ్‌లో ఎర్రచందనం స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతామని, ఈ వ్యవహారంలో ఇప్పటికే నలుగురు కింగ్‌పిన్‌లను గుర్తించామని అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. శనివారం తిరుపతి జిల్లాలో పర్యటించిన ఆయన, మామండూరు అటవీ ప్రాంతంతో పాటు మంగళంలోని ఎర్రచందనం గోదామును పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో అటవీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, “ఎర్రచందనం చెట్టుకు గొప్ప ఆధ్యాత్మిక చరిత్ర ఉంది. ఇది సాక్షాత్తు వేంకటేశ్వరస్వామి గాయం నుంచి పుట్టిందని పురాణాలు చెబుతున్నాయి. అలాంటి పవిత్రమైన సంపదను కొందరు అక్రమంగా తరలిస్తున్నారు. శేషాచలం అడవుల్లో స్మగ్లర్లు దాదాపు 2 లక్షల చెట్లను నరికి ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు” అని ఆవేదన వ్యక్తం చేశారు. స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు ఇప్పటికే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని, జిల్లాల ఎస్పీలతో సమీక్ష నిర్వహించామని తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా కట్టడి చేసేందుకు కర్ణాటక ప్రభుత్వంతో ఒప్పందం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని, ఈ విషయంపై సీఎం సిద్దరామయ్యను కోరినట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. “ఇప్పటికే నలుగురు ప్రధాన స్మగ్లర్లను గుర్తించాం. వారిని పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఒకసారి ఆపరేషన్ మొదలుపెడితే వెనుదిరిగే ప్రసక్తే ఉండదు. ‘ఆపరేషన్ కగార్’ను అమలు చేస్తున్న ఈ దేశంలో స్మగ్లర్ల ఆట కట్టించడం పెద్ద కష్టం కాదు” అని ఆయన స్పష్టం చేశారు. స్మగ్లర్లు స్వచ్ఛందంగా ఈ అక్రమ కార్యకలాపాలను ఆపకపోతే అటవీ చట్టం ప్రకారం వారి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. పర్యావరణాన్ని ధ్వంసం చేస్తే చూస్తూ ఊరుకోబోమని, ఈ అక్రమ నరికివేతలో స్థానిక ప్రజలు, తమిళనాడు కూలీలు భాగస్వాములు కావొద్దని విజ్ఞప్తి చేశారు. ఎర్రచందనాన్ని కాపాడే బాధ్యత వేంకటేశ్వరస్వామి భక్తులపై కూడా ఉందని ఆయన గుర్తుచేశారు.అయితే, పట్టుబడకుండా స్మగ్లింగ్‌లో తరలిపోయిన ఎర్రచందనం ఇంకా చాలా ఉందని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఒక అంచనా ప్రకారం, ఆ ఐదేళ్ల కాలంలో రూ. 8 వేల కోట్ల నుంచి రూ. 10 వేల కోట్ల విలువైన ఎర్రచందనం స్మగ్లింగ్ జరిగిందని తెలిపారు. మన రాష్ట్రం నుంచి తరలిపోయిన ఎర్రచందనం కర్ణాటకలో పట్టుబడగా, ఆ రాష్ట్ర ప్రభుత్వం వాటిని వేలం వేసి రూ. 140 కోట్లు సొమ్ము చేసుకుందని పవన్ కళ్యాణ్ గుర్తు చేశారు. ఇంత భారీ స్థాయిలో స్మగ్లింగ్ జరుగుతున్నా, గత ప్రభుత్వంలో ఉన్న మంత్రులు ఎవరూ దీనిపై బాధ్యత తీసుకోలేదని ఆయన విమర్శించారు. శేషాచలం అడవుల్లో ఇప్పుడు పెద్ద పెద్ద ఎర్రచందనం చెట్లు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌పై నియంత్రణ కోసం ఇతర రాష్ట్రాల మధ్య సమన్వయం అవసరమని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. తమ ఎర్రచందనం నేపాల్ వంటి ఇతర దేశాల్లో కూడా దొరుకుతోందని తెలిపారు. అన్ని రాష్ట్రాల మధ్య ఏపీకి ఒప్పందం ఉండాలని, ఎక్కడ దొరికినా ఆ ఎర్రచందనాన్ని తమ రాష్ట్రానికి అప్పగించేలా ఒప్పందం జరిగిందని ఆయన వివరించారు. ఉమ్మడి కడప జిల్లాలోని రెండు, మూడు జోనల్ ప్రాంతాల్లో స్మగ్లింగ్ విపరీతంగా జరుగుతోందని, ఈ స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న నలుగురు కింగ్ పిన్‌లను గుర్తించామని, త్వరలో వారిని పట్టుకుంటామన్నారు. “ఎవ్వరూ చందనం చెట్లు నరికే వృత్తిలోకి వెళ్లకండి. తమిళనాడు వాళ్లకు కూడా ఇదే చెబుతున్నాను. ఇదే నా వార్నింగ్. స్మగ్లింగ్ జోలికి వెళితే తాట తీస్తాను” అని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. మహారాష్ట్రలో నిర్వహించిన ‘ఆపరేషన్ కగర్’ లాగా, ఇక్కడ మరో ఆపరేషన్ చేపడతామని తెలిపారు. ఎర్రచందనం జోలికి వెళితే తాట తీసి కూర్చోబెడతామని, మర్యాదగా వేరే పని చేసుకోమని ఆయన హితవు పలికారు.ఎర్రచందనం చెట్లు కొట్టాలంటే భయపడే స్థితికి తీసుకువస్తామని, ఎందుకంటే ఒక చెట్టు కొడితే చరిత్రలో యుద్ధాలు జరిగాయని గుర్తుచేశారు. ఇతర రాష్ట్రాల్లోని ఓడరేవుల ద్వారా ఎర్రచందనం తరలిపోయే అంశంపై కూడా దృష్టి పెడుతున్నామని పవన్ కళ్యాణ్ తెలిపారు









అక్షరకలం
తెలుగు దినపత్రిక






## బ్రహ్మచారి భర్తగా మారితే..

పవన్‌కల్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజ్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న హాస్యభరిత చిత్రం 'పురుష'. వీరు వులవల దర్శకుడు. కల్యాణ్ ప్రొడక్షన్స్ పతాకంపై బత్తుల కోటేశ్వరరావు నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను దర్శకుడు శ్రీకాంత్ ఓదెల విడుదల చేశారు. 'బ్రహ్మచారి భర్తగా మారాలని నిర్ణయించుకున్న తర్వాత జీవితం యుద్ధభూమిగా మారుతుంది' అనే క్యాప్షన్‌తో పోస్టర్ ఆకట్టుకునేలా ఉంది. హాస్యప్రధానంగా సాగే చిత్రమిదని, త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. వెన్నెల కిషోర్, వైష్ణవి కొక్కుర, విషిక, హాసిని తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శ్రవణ్ భరద్వాజ్, దర్శకత్వం: వీరు పులవల.

## రాంబాయి నీ మీద నాకు..

అఖిల్, తేజస్విని జంటగా నటిస్తున్న చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. ఈటీవీ విన్ ఒరిజినల్స్ రూపొందిస్తున్న ఈ చిత్రానికి సాయిలు కంపాటి దర్శకుడు. వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మాతలు. ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకురానుంది. నిర్మాతలు వంశీ నందిపాటి, బన్నీ వాసు థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. మంగళవారం ఈ సినిమాలోని 'రాంబాయి నీ మీద నాకు..' అనే పాటను మంచు మనోజ్–భూమా మౌనిక దంపతులు విడుదల చేశారు. ప్రేమలో ఉండే ప్రతీ అమ్మాయిఅబ్బాయి జీవితానికి దగ్గరగా ఉండేలా ఈ పాట రాశానని గీత రచయిత మిట్టపల్లి సురేందర్ తెలిపారు. రాజు, రాంబాయి ప్రేమలో సంతోషం, దుఃఖం రెండూ ఉన్నాయని, గతించిన చరిత్రకు..ప్రస్తుత చరిత్రకు ఈ సినిమా సాక్ష్యంగా నిలుస్తుందని నిర్మాత వేణు ఊడుగుల అన్నారు. ఈ పాటలాగే సినిమా కూడా బాగుంటుందని దర్శకుడు చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.





## రష్మిక విజయానందం



అగ్ర తారలు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న గత నెలలో నిశ్చితార్థం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే తమ నిశ్చితార్థం గురించి విజయ్, రష్మిక ఇప్పటివరకు ఎక్కడా స్పందించలేదు. ఎంగేజ్‌మెంట్ విషయంలో వారు గోప్యతను పాటిస్తున్నట్లు అర్థమవుతున్నది. ఈ ప్రేమజంట ఫిబ్రవరిలో పెళ్లిపీటలెక్కనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రష్మిక మందన్న ఎక్కడకు వెళ్లినా నిశ్చితార్థం తాలూకు ప్రశ్నలే ఎదురవుతున్నాయి. తన తాజా చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్' ప్రమోషన్‌లో భాగంగా జగపతిబాబు నిర్వహిస్తున్న ఓ టాక్‌షోకు హాజరైంది రష్మిక మందన్న. ఈ సందర్భంగా ఆమె చేతికి ధరించిన నిశ్చితార్థ ఉంగరం అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ సందర్భంగా 'విజయ్' అనే పేరున్న ముగ్గురు హీరోలను ఉదహరించిన జగపతిబాబు.. వారితో ఉన్న అనుబంధం గురించి చెప్పమని రష్మికను ఓ సరదా ప్రశ్న అడిగారు.

## ప్రతి యువకుడి కథ

కథాంశాల ఎంపికలో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ, వినోదాత్మక చిత్రాలకు పెద్దపీట వేస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు హీరో శ్రీవిష్ణు. ఈ ఏడాది 'సింగిల్' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నారు. బుధవారం ఆయన కొత్త సినిమా ప్రకటన వెలువడింది. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైనర్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సన్నీ సంజయ్ దర్శకత్వం వహిస్తారు. 'ప్రతి యువకుడి కథ' అనే ట్యాగ్‌లైన్‌తో విడుదల చేసిన పోస్టర్ సినిమా కథను ప్రతిబింబిస్తున్నది. 'ఓటీటీ చిత్రం 'అనగనగా'తో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సన్నీ సంజయ్ ఈ సినిమా కోసం అద్భుతమైన కథను సిద్ధం చేశారు. మన రోజువారి జీవితంలోని సంఘర్షణ, ఆశలు, ఆకాంక్షలలకు దృశ్యరూపంలా సున్నితమైన భావోద్వేగాలతో ఆకట్టుకుంటుంది. వినోదానికి కూడా పెద్దపీట వేస్తున్నాం. త్వరలో చిత్రీకరణ ప్రారంభిస్తాం' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి నిర్మాణ సంస్థ: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్, రచన–దర్శకత్వం: సన్నీ సంజయ్.



## అజయ్ దేవగణ్ ఫ్యాన్స్ అసంతృప్తి ..

బాలీవుడ్ స్టార్ అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'దే దే ప్యార్ దే 2' ప్రస్తుతం చర్చలో నిలిచింది. 2019లో విడుదలై మంచి విజయాన్ని సాధించిన దే దే ప్యార్ దే సినిమాకి ఇది సీక్వెల్. రొమాంటిక్ డ్రామా జానర్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంబంధించి ఇప్పటివరకు రెండు పాటలు విడుదల కాగా, తాజాగా మూడో పాట '3 షాక్' కూడా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే పాటల కంటే ఎక్కువగా ఈ సీక్వెల్ పై సోషల్ మీడియాలో మరో చర్చ నడుస్తోంది. కారణం అజయ్ దేవగణ్ తక్కువగా కనిపించడం, మరో నటుడు మీజాన్ జాఫ్రీ ఎక్కువగా హైలైట్ కావడం. ఇప్పటికే విడుదలైన రెండు పాటల్లోను, ఇప్పుడు కొత్తగా వచ్చిన 3 షాక్ సాంగ్‌లోను మీజాన్ జాఫ్రీనే ప్రధానంగా చూపించారని అభిమానులు విమర్శిస్తున్నారు.




## దేవుడిని నమ్మే ఘోస్ట్‌హంటర్‌గా కనిపిస్తా!

'మనం చిన్నప్పటి నుంచి ఎన్నో జానపద కథలు విని ఉంటాం. 'వెనకటి రోజుల్లో ధనాన్ని భూమిలో పాతి ఒక బంధనం వేసి దానికి ఓ పిశాచిని కాపలాగా పెడతారు' అంటూ ఓ కథ ప్రచారంలో ఉండేది. ఈ సినిమాకు అలాంటి జానపద కథే ఆధారం' అన్నారు హీరో సుధీర్‌బాబు. ఆయన నటించిన సూపర్ నాచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ 'జటాధర' ఈ నెల 7న ప్రేక్షకుల ముందుకురానుంది. వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సోనాక్షి సిన్హా, శిల్పా శిరోద్కర్ కీలక పాత్రలు పోషించారు. బుధవారం చిత్ర హీరో సుధీర్‌బాబు పాత్రికేయులతో ముచ్చటిస్తూ సినిమా సంగతుల్ని పంచుకున్నారు.



# తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా, ప్రత్యేక పూజ కార్యక్రమం.



**అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి నవంబర్,08**

నారాయణ పేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని స్థానిక రాయచూర్ రోడ్డు లో వెలసినటువంటి పడమటి ఆంజనేయ స్వామి దేవాలయంలో, పాలమూరు పోరు బిడ్డ, జనం మెచ్చిన జన నేత, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి , తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రధాత, మన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన శుభాసంధర్బంగా , మరికల్ మండల నాయకులు పోలెమోని రామకృష్ణ, జంగిడి రవి, పేరి రామకృష్ణరెడ్డి, పల్లెర్ల రాఘవేందర్, టీంకు గౌడ్, సుదర్శన్ రెడ్డి, గొల్ల విజయ్ ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగినది.

# 9 రోజులైనా సామినేని హంతకుల తేల్చరే..!

## ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీలు రామారావు హత్యకు ఖండన

## ఈ హత్యకు సుదీర్ఘకాలంగా పథకం రచించినట్లు అర్థమవుతోంది..

## ప్రజలను దోచుకునేది కాంగ్రెస్, కాపాడేది కమ్యూనిస్టులు

## బీజేపీ చిచ్చు నుంచి కాపాడే కమ్యూనిస్టులపై కాంగ్రెస్ దాడులు

## ఇది ముమ్మాటికీ రాజకీయ హత్యే: సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని, రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

సామినేని రామారావు హత్యకు సుదీర్ఘకాలంగా పథకం రచించినట్లు హత్య జరిగిన తీరు, ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలను బట్టి తెలుస్తోందని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. హత్య జరిగి 9రోజులైనా దోషులను తేల్చకపోవటం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో ఢిల్లీలో సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సమావేశంలో ఉన్న తాము కేంద్ర కమిటీ తరఫున ఇండిస్తూ ప్రకటన చేశామన్నారు. ప్రకటనను ప్రపంచవ్యాప్తంగా చాలా చోట్ల కమ్యూనిస్టు పార్టీలు చూసి హత్యను ఖండించాయన్నారు. హత్యకు కారకులు తేలేదాకా ప్రభుత్వాన్ని వదిలిపెట్టమని హెచ్చరించారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడులో శనివారం ఏర్పాటు చేసిన సామినేని రామారావు సంస్కరణ సభకు బీవీ రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభ ప్రారంభానికి ముందు గ్రామంలో పెద్ద ఎత్తున నిర్వహించిన ర్యాలీలోనూ రాఘవులు పాల్గొన్నారు. హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### రాజకీయ దురుద్దేశంతోనే హత్య.

శత్రువులతోనూ చాలా సౌమ్యంగా వ్యవహరించే వ్యక్తిత్వం సామినేని రామారావుది అని బీవి రాఘవులు అన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేకనే హత్యచేశారని ఆరోపించారు. ఏ రాజకీయ దురుద్దేశంతో హత్యచేశారో అదే రకంగా వారికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర హెంశాంమంత్రి, ముఖ్యమంత్రిగా రేవంత్రెడ్డి, ఉపముఖ్యమంత్రిగా మధిర నియోజకవర్గానికి చెందిన భట్టి విక్రమార్క, రాష్ట్రంలో కీలక బాధ్యతల్లో జిల్లా మంత్రులున్నా హత్య జరిగి 9 రోజులైనా నిందితులను ఎందుకు పట్టుకోలేకపోయారని ప్రశ్నించారు. దొంగలు, దోపిడీదారులను గంటల్లోనే పట్టుకున్నామని ప్రకటనలు చేసే పోలీసు వారు 9 రోజుల నుంచి ఏం చేస్తున్నారని అన్నారు. హత్య జరిగిన వెంటనే ఖండించిన భట్టి విక్రమార్క ఇప్పటి వరకు దోషులను ఎందుకు తేల్చలేదని నిలదీశారు. ప్రజలను దోచుకునేది కాంగ్రెసైతే... ప్రజలను కాపాడేది కమ్యూనిస్టులన్నారు. కమ్యూనిస్టులకు ప్రాణత్యాగాలు కొత్త కాదన్నారు. సామినేని కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

### అన్యాయాన్ని ఎదురించటంలో కమ్యూనిస్టుల వైభవం: తమ్మినేని వీరభద్రం

కమ్యూనిస్టుల వైభవం సీట్లు, ఓట్లలో లేదని అన్యాయాన్ని ఎదురించటంలో ఉందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందన్నారు. బీహార్లో 65 లక్షల ఓట్లు తీసివేశారని తెలిపారు. అయినా గెలుస్తామనే నమ్మకం లేక పార్టీలను చీల్చి, ఫిరాయింపులు: చేయించేందుకు పూనుకుంటున్నారన్నారు. అంతటితో ఆగకుండా 30 రోజులు పోలీసు కస్టడీలో ఉంటే పదవుల్లో నుంచి తొలగించేలా బిల్లు తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చు పెడుతోందన్నారు. స్వాతంత్ర్యానికి గుర్తుగా ఎర్రకోటను చెప్పుకుంటామని అటువంటి ఎర్రకోట సాక్షిగా ఆర్ఎస్ఎస్ గొప్పతనం గురించి మోడీ చెప్పటం సిగ్గుచేటన్నారు. గాంధీని చంపిన గాడ్సే సంస్థ ఆర్ఎస్ఎస్ దేశానికి చేసిన గొప్ప సేవ ఎంటని ప్రశ్నించారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టి దేశాన్ని రావణకాష్టంలా చేయటమా? సేవంటి అన్నారు. వారణాసి, మధురలో మసీదులను కూల్చివేయాలని బీజేపీ పథకం రచిస్తోందన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్న కమ్యూనిస్టుల తరహాలో కృషి చేయాల్సిన కాంగ్రెస్ దాన్ని మరిచి 'చెత్త' రాజకీయాలు చేస్తోందన్నారు. రామారావు మరణం ఉత్తిగా పోదు... దానికి సరైన న్యాయం చేస్తామన్నారు. పాతర్లపాడులో ఎర్రజెండా మళ్లీ ఎగురుతుందన్నారు. సామినేని రామారావు కేసు విషయంలో వినతులు, విజ్ఞప్తులకు పరిమితం. కాము...దండానికి, విజ్ఞప్తికి అంగీకరించకపోతే దండం తీసుకోవటమూ తెలుసని అని హెచ్చరించారు. ప్రజలను చైతన్యం చేసే దృష్టిలో కమ్యూనిస్టులు ఉన్నారని తెలిపారు. ప్రజలే పరమావధిగా భావించి నిష్కంళక ఉద్యమాలు చేసిన నాయకుడు సామినేని రామారావు అన్నారు. అనాడు ఖమ్మం డివిజన్ ఉద్యమంలో హత్యలు, అత్యాచారాలు, దాడులు కొనసాగాయని, కాంగ్రెస్ నాయకులు తమకు ఎదురేలేదనట్టుగా కమ్యూనిస్టులను ఊచకోత కోసిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. ఒకటి, రెండు సంవత్సరాల్లోనే 29 మందిని హతమార్చారని తెలిపారు. కమ్యూనిస్టు కార్యకర్త ఎవరూ స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితి ఉందన్నారు. కమ్యూనిస్టు నాయకులపై నిర్బంధకాండ కొనసాగిన గ్రామాల్లో ఒకటి పాతర్లపాడు అన్నారు. నిజమైన కమ్యూనిస్టుకు వ్యక్తిగత ద్వేషాలు ఉండొద్దని, కానీ వర్గపోరాటం విషయంలో తెగువ చూపించే శౌర్యం కమ్యూనిస్టులకు ఉండాలన్నారు. ఆ రకమైన మిలిటెంట్ మనస్తత్వం కామ్రేడ్ రామారావుది అని తెలిపారు. కాందిశీకులుగా గ్రామ కమ్యూనిస్టులు బయటకు వెళ్లాల్సి వచ్చిన సందర్భంలోనూ రామారావు స్థానికంగా ఉండే పార్టీని నిలిపారన్నారు. భార్య స్వరాజ్యంను సర్పంచ్గా చేశారన్నారు. రామారావు హత్యవెనుక కాంగ్రెస్ గూండాలున్నారనేది వాస్తవం అన్నారు. ఒకవేళ కాంగ్రెస్ నాయకులు లేరనుకుంటే దాన్ని రుజువు చేయాల్సిన బాధ్యత కూడా ఆ పార్టీపై ఉందన్నారు.

### దోపిడీకి వ్యతిరేకంగా నిలబడ్డారు కాబట్టే రామారావు హత్య: జాన్వెస్లీ,

దోపిడీ, భూస్వామ్యవర్గాలకు వ్యతిరేకంగా నిలబడ్డారు కాబట్టే సామినేని రామారావును హత్యచేశారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ అన్నారు. 9 రోజులైనా హంతకులను తేల్చకపోతే పోలీసు వ్యవస్థ ఎందుకు? అని ప్రశ్నించారు. ఆర్థిక ప్రయోజనాల రీత్యా హత్య జరిగితే కాంగ్రెస్ పార్టీ ఎప్పుడైనా పంచాయితీ చేసిందా? అని నిలదీశారు. రాజకీయ హత్యకాదంటున్న పోలీసు కమిషనర్ గారూ... రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరు? అని సూచించారు. రాజకీయ హత్యా, ఏ రూపంలో హత్య జరిగిందో తేల్చాలి తప్ప కాంగ్రెస్ నాయకునిగా సీపీ వ్యవహరిస్తే ఊరుకునేది లేదన్నారు. కేసును తారుమారు చేయాలనే ఒత్తిడిలో ఇటువంటి మాటలు మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించారు. త్యాగాల పునాదుల పైన ఏర్పడిన జెండా ఎర్రజెండా అన్నారు. హంతకులు అనుకుంటున్నారు... తమ ప్రభుత్వమే ఉంది కాబట్టి ఎవరూ ఏమి చేయలేరనే రీతిలో వ్యవహరిస్తుందొచ్చు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుకున్నా న్యూయార్క్ ఎర్రజెండా ఎగిరిందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. కమ్యూనిస్టులకు కత్తుల కోలాటం ఆడటం కూడా తెలుసు. సరికిన కొద్దీ విరగబూస్తాం... విరగబూసి, విరగబూసి చరిత్రను తిరగరాస్తాం అన్నారు.

### పాసిస్టు విధానాలను ధిక్కరించేదే కమ్యూనిజం: వై వెంకటేశ్వరరావు

వెంటనే హంతకులను తేల్చి కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ ప్రమేయం లేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత భట్టివిక్రమార్కపై ఉందని సీపీఐ (ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అన్నారు. పాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు నిలబడుతున్నారని చెప్పారు. ఈ క్రమంలో వందలాది మంది కమ్యూనిస్టులకు ప్రాణత్యాగం చేసిన చరిత్ర ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున సామినేని మృతికి విప్లవజోహార్లు అర్పించారు.




### వందలాది మందితో రెడ్ షర్ట్ కవాతు

సామినేని రామారావు సంస్కరణ సభ ప్రారంభానికి ముందు గ్రామంలో వందలాది మందితో రెడ్షర్ట్ కవాతు నిర్వహించారు. ఎర్రచొక్కాలు ధరించి కార్యకర్తలు, గ్రామస్తులు ర్యాలీలో కదం తొక్కారు. గ్రామ బీఆర్ఎస్ నాయకత్వం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ తదితర పార్టీలు సైతం సంతాపం తెలిపారు. ముందుగా నాయకులు, కుటుంబసభ్యులతో కలిసి బీవీ రాఘవులు రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సామినేని రామారావుపై నవతెలంగాణ' ప్రచురించిన ప్రత్యేక సంచికను బీవీ రాఘవులు, తమ్మినేని వీరభద్రం ఆవిష్కరించారు. సీపీఐ (ఎం) మధర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్రావు, పాలడుగు భాస్కర్, బండారు రవికుమార్, జిల్లా కార్యదర్శి సున్నా నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, సీపీఐ (ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బుగ్గవీటి సరళ, మాచర్ల భారతి, మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, ఏజే రమేశ్, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై. విక్రమ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేశ్, దంతు రాంబాబు, యర్రా శ్రీనివాస్, బండి పద్మ, భూక్యా వీరభద్రం, సీనియర్ నాయకులు పి.సోమయ్య, పొన్నం వెంకటేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, రాయల వెంకటేశ్వరరావు, మెరుగు సత్యనారాయణ, సామినేని రామారావు సతీమణి స్వరాజ్యం, కుమారుడు, కుమార్తె విజయ్, లలిత, కోడలు రాజేశ్వరి, నాయకులు బి. మధు, ఎస్ఐ సైదులు, బుర్రి ప్రసాద్, అన్నవరపు సత్యనారాయణ, బ్రహ్మచారి, శీలం సత్యనారాయణరెడ్డి, కొల్లి సత్యనారాయణ, కొండ్రు జానకీరాములు, ఏడునూతల శ్రీనివాసరావు, పిట్టల రవి, తదితరులు పాల్గొన్నారు.



# బీహార్‌లో ఎన్నికల ఫలితాల తర్వాతే నిర్ణయం

## హంగ్ అసెంబ్లీ ఏర్పడితేనే పొత్తుపై ఆలోచిస్తా

## ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ వెల్లడి

**హైదరాబాద్,**

బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత, ఒకవేళ హంగ్ అసెంబ్లీ ఏర్పడితేనే మహాకూటమితో కలిసే విషయంపై నిర్ణయం తీసుకుంటామని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. ప్రస్తుతం తమ పూర్తి దృష్టి తమ అభ్యర్థులను గరిష్ఠ సంఖ్యలో గెలిపించడంపైనే ఉందని ఆయన తెలిపారు. ఎన్డీటీవీకి ఇచ్చిన 'వాక్ ది టాక్' ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "నవంబర్ 14న ఏం జరుగుతుందో నాకు తెలియదు. ఒకవేళ హంగ్ ఏర్పడితే, అప్పుడు కచ్చితంగా స్పందిస్తాం. మా కూటమి అభ్యర్థులు వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో గెలిచేలా చూడటమే మా ప్రయత్నం. ఫలితాలు వచ్చినప్పుడు బీహార్ ప్రజల తీర్పు ఎలా ఉందో



చూస్తాం" అని ఒవైసీ వివరించారు. బీహార్‌లోని ప్రతిపక్ష కూటమిలో ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలు ప్రధాన భాగస్వాములుగా ఉండగా, ఎన్డీఏలో బీజేపీ, జేడీయూ, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్), హిందుస్థానీ అవామ్ మోర్చా, రాష్ట్రీయ లోక్ మోర్చా పార్టీలు ఉన్నాయి. 2020 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం 19 స్థానాల్లో పోటీ చేసి, ముస్లిం జనాభా అధికంగా ఉండే సీమాంచల్ ప్రాంతంలో ఐదు స్థానాలు గెలుచుకుంది. అయితే, ఆ తర్వాత నలుగురు ఎమ్మెల్యేలు ఆర్జేడీలో చేరిపోయారు. ఈసారి ఎంఐఎం 25 మంది అభ్యర్థులను బరిలోకి దించింది. తమ పార్టీ బీజేపీకి 'బీ-టీమ్' అని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా ఖండించారు. ఆ పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. "వారు నన్ను ఓట్లు చీల్చేవాడినని, బీ-టీమ్ అని అనడంలో అలసిపోరు. కానీ నరేంద్ర మోదీ మూడుసార్లు ప్రధాని అయ్యారనే విషయాన్ని ఎవరూ మాట్లాడరు. దానికి బాధ్యులెవరు? 450-500 స్థానాల్లో పోటీ చేసి మూడుసార్లు ఓడిపోయినప్పుడు ఇతరులను నిందించడం ఎందుకు? వారు ఆత్మవిమర్శ చేసుకోవాలి" అని ఒవైసీ ఘాటుగా స్పందించారు. బీహార్‌లో తొలి దశ పోలింగ్ రికార్డు స్థాయిలో 64.66 శాతంగా నమోదైంది. రెండో దశ పోలింగ్ నవంబర్ 11న జరగనుండగా, ఓట్ల లెక్కింపు నవంబర్ 14న చేపడతారు.

# మహారాష్ట్రలో భారీ కుంభకోణం!?

## మంత్రి ప్రతాప్ సర్‌నాయక్‌పై ప్రతిపక్షాల ఆరోపణలు

భయాందర్, : మహారాష్ట్రలో రాష్ట్ర మంత్రి ప్రతాప్ సర్‌నాయక్ రూ. 200 కోట్ల విలువైన భూమిని రూ. 3 కోట్లకే దక్కించుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్ భూకుంభకోణం కేసు ఇప్పటికే రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతుండగా, తాజాగా రాష్ట్ర మంత్రిపై వచ్చిన ఆరోపణలు సంచలనంగా మారాయి. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు విజయ్ వడెట్టివార్ విలేకరులతో మాట్లాడుతూ, ప్రతాప్ సర్‌నాయక్ మీరా భయాందర్‌లో దాదాపు రూ. 200 కోట్ల విలువైన నాలుగు ఎకరాల భూమిని రూ. 3 కోట్లకే కొనుగోలు చేశారని ఆరోపించారు. ఆ స్థలంలోనే ఆయన ఓ విద్యా సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఆరోపణలపై మహారాష్ట్ర రెవెన్యూమంత్రి చంద్రశేఖర్ బవాంకులే స్పందించారు. ఈ విషయం గురించి తాను కూడా విన్నానని, కానీ దీనిపై ఎవరి దగ్గరి నుంచి ఫిర్యాదులు అందలేదని తెలిపారు. ప్రతిపక్షాలు తమకు ఫిర్యాదు చేయడం మానేసి, మీడియా ముందుకు వచ్చి ఆరోపణలు చేసేందుకే సమయం కేటాయిస్తున్నాయని విమర్శించారు. ఈ భూమికి సంబంధించి ఏదైనా ఫిర్యాదు అందితే తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా, రూ. 18,000 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్‌కు చెందిన సంస్థకు రూ. 300 కోట్లకే విక్రయించినట్లు కాంగ్రెస్ ఆరోపించింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై దర్యాప్తునకు ఒక బృందాన్ని ఏర్పాటు చేసింది. దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మంత్రిపై కూడా ఆరోపణలు రావడం గమనార్హం.

అక్షరకలం

# సాగర్ లో ముగిసిన జిల్లా స్థాయి క్రీడలు...

## బుద్ధవనం సందర్శించిన థాయిలాండ్ బౌద్ధ భిక్షువులు..

**ప్రశాంత వాతావరణంలో బుద్ధ వనం ను నిర్మించారు.... థాయిలాండ్ బౌద్ధ భిక్షువులు.**

**అక్షర కలం నాగార్జునసాగర్...**

నాగార్జునసాగర్, నవంబర్, 8: తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన బుద్ధవనాన్ని శనివారం నాడు థాయిలాండ్ బౌద్ధ భిక్షువులు సందర్శించారు. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా లోని సిద్ధార్థ బుద్ధ విహార నుండి బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య సూచన మేరకు నాగార్జునసాగర్ లోని బుద్ధవనం సందర్శించారు. గగన్ మాలిక్ ఫౌండేషన్ మరియు గుల్బర్గా బౌద్ధ విహార సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి దమ్మయాత్ర కోసం ఈ బృందం బుద్ధవనం సందర్శించారు. వీరికి బుద్ధవనం ఎగ్జిక్యూటివ్





ఆఫీసర్ దమ్మ చారి శాసన,ఎస్టేట్ ఆఫీసర్ రవిచంద్ర, బుద్ధవనంఆర్ట్స్ మరియు ప్రమోషన్ మేనేజర్ శ్యాంసుందర్రావులు బుద్ధవనం విశేషాలను వివరించారు. బుద్ధవనం సందర్శనలో భాగంగా బుద్ధ చరిత వనంలోని బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించి బుద్ధ వందనం సమర్పించారు. అనంతరం బుద్ధ చరితవనం,జాతకవనం,ధ్యానవనం, స్థూప వనం,మహాస్తుపాలను సందర్శించి బుద్ధ వనంలోని శిల్పాల ఏర్పాట్లపై ప్రశంసించారు. ప్రశాంత వాతావరణంలో అలనాటి బౌద్ధ వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించి వారికి ప్రేరణ కలిగించడం ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. నాగార్జునసాగర్ లోని ప్రశాంత వాతావరణంలో బుద్ధవనాన్ని ఏర్పాటు చేయడం ప్రపంచ బౌద్ధ బిక్షవులకు ఒక ఆరాధన కేంద్రంగా విలసిల్లుతున్నదని అన్నారు. బుద్ధావనం అంతర్ భాగంలోని ధ్యాన మందిరంలో బుద్ధం,సంఘం, బుద్ధం శరణం అనే బుద్ధుని ప్రాథమిక దమ్మ ప్రబోధాన్ని తెలియజేశారు. బుద్ధ ధర్మం గురించి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుల్బర్గా నుండి వచ్చిన థాయిలాండ్, కంభోడియా, యు ఎస్ ఏ, భారతదేశానికి చెందిన బౌద్ధ బిక్షులు, ఉపాసకులు పాల్గొన్నారు. వీరిలో థాయిలాండ్ ఉపాసిక లిథ, బుద్ధ విహార గుల్బర్గా నుండి రతన జ్యోతో, నాగార్జునసాగర్ డ్యాం భద్రత అధికారులు శ్రీనివాసరావు, రఘు పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



**వలిగొండ నవంబర్ 08 అక్షరకలం:**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు.అనంతరం మండల పరిధిలోని సంగెం గ్రామంలో గల కొలువై ఉన్న భీమలింగేశ్వరుని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలాగే యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, సంజీవరెడ్డి,కాసుల వెంకన్న,బత్తిని సహదేవ్, చిలుగురి సత్తిరెడ్డి,గౌరరెడ్డి, బత్తిని వరుణ్,మైసోల్ల ప్రవీణ్, మహిపాల్ తదితరులు

## నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు కృషి

**విద్యుత్ శాఖ ఎస్ఈ ఉత్తమ్ జాడే**

**అక్షర కలం, మందమర్రి నవంబర్ 08:**

విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేందుకు నిరంతరంగా కృషి చేస్తున్నామని విద్యుత్ శాఖ ఎస్ఈ ఉత్తమ్ జాడే తెలిపారు. మండలంలోని అందుగులపేట విద్యుత్ సబ్ స్టేషన్ లో నూతనంగా 8 ఎంవిఏ ట్రాన్స్ఫార్మర్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ట్రాన్స్ఫార్మర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ జాడే మాట్లాడుతూ, గతంలో సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు 5 ఎంవిఏ ట్రాన్స్ఫార్మర్ తో విద్యుత్ సరఫరా నిర్వహిస్తుండగా, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందించాలనే సంకల్పంతో 5 ఎంవిఏ ట్రాన్స్ఫార్మర్ స్థానంలో 1.25 కోట్ల రూపాయల వ్యయంతో నూతనంగా 8 ఎంవిఏ ట్రాన్స్ఫార్మర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రానున్న పదేళ్ల కాలంలో విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని, వినియోగదారుల సౌకర్యార్థం 8 ఎంవిఏ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డిఈ కైసర్, ఎంఆర్టి డిఈ రాజన్న, ఏడిఈ ఎస్పిఎంఏటిఆర్ఈ శరత్, ఏడిఈ వెంకటేశ్వర్లు, ఏఈ ఎంఆర్టి కలీమ్, మందమర్రి ఏఈ జే శ్రీనివాస్, సబ్ ఇంజనీర్ సుదేష్ణ, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## విజేతగా నిలిచిన అనంతారం గురుకుల విద్యార్థులు...

**అక్షర కలం నాగార్జునసాగర్**

స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఈనెల 6 వ తేదీన ఘనంగా ప్రారంభమైన అండర్ 17 విభాగ జిల్లాస్థాయి క్రీడా పోటీలు శనివారం తో ముగిశాయి. ఈ



కార్యక్రమానికి ప్రాంతీయ సమన్వయ అధికారి స్వప్న, ఎం.ఈ.ఓ. తరి రాము ముఖ్య అతిథులుగా విచ్చేసి గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.




వివిధ విభాగాల్లో గెలుపొందిన జట్లు, క్రీడాకారుల వివరాలు. కబడ్డీలో అనంతరం జట్టు ప్రథమ, నేరేడుచర్ల జట్టు ద్వితీయ బహుమతిని సాధించింది. కోకో లో కొల్లి ముంతలపాడు జట్టు ప్రథమ , నాగార్జున సాగర్ జట్టు ద్వితీయ బహుమతిని సాధించింది. వాలీబాల్ లో అనంతారం జట్టు ప్రథమ, పోచంపల్లి జట్టు ద్వితీయ బహుమతిని సాధించాయి. టెన్ని కాయిట్ లో అనంతారం జట్టు ప్రథమ , మునుగోడు జట్టు ద్వితీయ బహుమతిని సాధించింది. చెస్ లో అనంతారం జట్టు ప్రథమ, నాగార్జునసాగర్ జట్టు ద్వితీయ బహుమతిని సాధించాయి. . అథ్లెటిక్స్ విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో నాగార్జునసాగర్ కు చెందిన ఎం గణేష్ ప్రథమ, నేరేడుచర్లకు చెందిన ఎస్ హేమంత్ ద్వితీయ, అనంతారంకు చెందిన ఆనంద్ తృతీయ బహుమతి సాధించారు. 200 మీటర్ల పరుగు పందెంలో నాగార్జున సాగర్ కు చెందిన ఎం గణేష్ ప్రథమ , అనంతారం కు చెందిన కే ఆనంద్ ద్వితీయ , పోచంపల్లి కి చెందిన డి పవన్ తృతీయ బహుమతి సాధించారు. 400 మీటర్ల పరుగు పందెంలో అనంతారం కు చెందిన కే ఆనంద్ ప్రథమ , జే వికేష్ ద్వితీయ ,పోచంపల్లికి చెందిన పవన్ తృతీయ బహుమతులు సాధించారు. 800 మీటర్ల పరుగు పందెంలో అనంతారం కు చెందిన బన్నీ ప్రథమ , వికేష్ ద్వితీయ , నాగార్జునసాగర్ కు చెందిన రంజిత్ తృతీయ బహుమతులు సాధించారు. 1500 మీటర్లలో అనంతారం కు చెందిన జె.వికేష్ ప్రథమ , నాగారంకు చెందిన పి అనిల్ ద్వితీయ , పోచంపల్లికి చెందిన దత్త సాయి తృతీయ బహుమతులు సాధించారు. లాంగ్ జంప్ మూసికి చెందిన బాణవత్ చంద్ర ప్రథమ , అనంతారం కు చెందిన జై వికేష్ ద్వితీయ , పోచంపల్లికి చెందిన చంటి తృతీయ బహుమతులు సాధించారు. హై జంప్ లో కొల్లి ముంతల పాడుకు చెందిన అరవింద్ ప్రథమ , మునుగోడు కు చెందిన ఎం.శివ ద్వితీయ , ఆత్మకూరుకు చెందిన శివ చరణ్ తృతీయ బహుమతులు సాధించారు. షాట్ పుట్ లో అనంతారంకు చెందిన ఎస్ అరవింద్ ప్రథమ , ఆత్మకూరుకు చెందిన జస్వంత్ ద్వితీయ , నేరేడుచర్లకు చెందిన శ్రీను తృతీయ బహుమతి సాధించారు .డిస్కస్ త్రో లో అనంతారం కు చెందిన ఎస్ అరవింద్ ప్రథమ , మునుగోడుకు చెందిన వినయ్ వర్ధన్ ద్వితీయ , చిలుకూరుకు చెందిన అభిరామ్ తృతీయ బహుమతులు సాధించారు. దీనిలో అనంతారం కు చెందిన జే వికేష్ వ్యక్తిగత ఛాంపియన్ షిప్ గా నిలిచాడు.

## చదువుకున్న పాఠశాలకు గేటును బహూకరించిన పూర్వ విద్యార్థులు



**చిట్యాల : (నవంబర్ 8) అక్షర కలం ,**

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 1985-86 ఎస్ ఎస్ స్సి బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థులు ప్రధాన గేటు మరియు ఆర్చ్ ని నిర్మించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాలలకు తమ వంతు సహాయ సహకారాలు చేయడం ఎంతో ఆనందంగా ఉందని , భవిష్యత్తులో స్కూలుకి ఏమైనా అవసరాలు ఉంటే ఇదే విధంగా సహాయ సహకారాలు తమ వంతు చేస్తామని అన్నారు. అనంతరం గేటును , ఆర్చిని బహూకరించిన పూర్వ విద్యార్థులకు గ్రామస్తులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు కోయగుర శ్రీనివాస్ గౌడ్, ఎద్దుల ప్రభాకర్ రెడ్డి, సప్పిడి మోహన్ రెడ్డి, పొట్లపల్లి వెంకన్న, సప్పిడి సినారెడ్డి,, ఏర్పుల యాదయ్య, వరికుప్పల మల్లేష్,గంగపురం భాస్కర్ ,పొట్ట శ్రీనివాస్, కోటా రాంబాబు, గుర్రం వెంకటేష్ ,ప్రధానోపాధ్యాయులు పి .శ్రీధర్ ఉపాధ్యాయులు లుకేందర్ రెడ్డి. ఉన్నారు గ్రామ ప్రముఖులు చేకూరి గణేష్ మాదిగ, తాటి చంద్రమౌళి, మర్రి జలంధర్ రెడ్డి, నీలకంఠం నరేష్, ఆవుల జానయ్య, ఏర్పుల రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్వీఆర్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**అక్షర కలం, మందమర్రి నవంబర్ 08:**

సింగరేణి ఏరియాలోని కేకే ఓపెన్ కాస్ట్ గనిలో ఓబి పనులు నిర్వహించిన ఆర్వీఆర్ కంపెనీలో పని చేసిన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటియుసి అనుబంధ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు ఎండి అక్బర్ అలీ, జెట్టి మల్లయ్య, సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి ఓసిపి పిట్ కార్యదర్శి మర్రి కుమార్ లు డిమాండ్ చేశారు. శనివారం కార్మికులకు రావాల్సిన బకాయిలు, సమస్యలపై ఓసిపి సంక్షేమ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, ఆర్వీఆర్ లో పనిచేసిన కార్మికులకు రావాల్సిన బకాయిలు సింగరేణి ప్రకటించిన లాభాల వాట 5500 రూపాయలు, కార్మికులకు రావాల్సిన జూలై నెల వేతనం, ఆర్వీఆర్ సంవత్సరంలో ఇచ్చే బోనస్ తదితర కార్మికులకు చెల్లించవలసినని బకాయిలు చెల్లించాలని కోరారు. కార్మికుల సమస్యలపై ప్రిన్సిపల్ ఎంప్లాయర్ గా ఉండవలసిన యాజమాన్యం ఎలాంటి బాధ్యత వహించకుండా చోద్యం చూస్తూ ఉంటుందని



అనడం సరైనది కాదన్నారు. ఆర్వీఆర్ కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. అదే విధంగా కొత్తగా వచ్చిన ఎక్స్ప్రెస్ వే కంపెనీలో ఆర్వీఆర్ కాంట్రాక్ట్ లో పనిచేసిన ప్రతి ఒక్క కార్మికుడిని తీసుకున్న తర్వాతనే కొత్తవారికి అవకాశం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్వీఆర్ కార్మికులు పాల్గొన్నారు.

## పత్తి జిన్నింగ్ మిల్లు లో అగ్ని ప్రమాదం .



**అక్షర కలం/ నారాయణపేట, జిల్లా ప్రతినిధి, నవంబర్, 08.**

మక్తల్ : నియోజకవర్గంలోని వడ్డెవాట్ చౌరస్తాలో ఉన్న పత్తి మిల్లులో శుక్రవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది.దాదాపు లక్షరుపాయల నష్టం జరిగిందని మిల్లు యజమాని అంటున్నారు.మిల్లులో పత్తి బ్లేడ్లుగా మాస్తుండగా యంత్రాలు వేడెక్కి నిప్పురవ్వల వల్లా అగ్ని ప్రమాదం జరిగిందని అగ్నిమాపక సిబ్బంది రంగంలో దిగి పక్కకు మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు.గత సంవత్సరం ఇది జిన్నింగ్ మిల్లులో నిల్వ ఉంచిన పత్తి కరెంట్ షాక్ వల్ల అగ్ని ప్రమాదం జరిగింది. దీనిపై లోతోనే దర్యాప్తు జరపకుండా స్థానిక నాయకుడు సహకరించాడని స్థానిక అగ్నిమాపక సిబ్బంది సహకారంతో అరకోర ఎంక్వయిరీ నివేదికతో కోట్ల రుపాయల ఇన్సూరెన్స్ పొందాడని ఆరోపణలు ఉన్నాయి.పాతిక సంవత్సరాల కిందట బ్యాంకు లోన్లతో మిల్లుల వ్యాపారాన్ని ప్రారంభించికిస్తులు కట్టలేక డిఫాల్ట్ గా మారి సెటిల్మెంట్ కింద లోన్ చెల్లించాడని. ఆరోపణ లున్నాయి. గత ప్రభుత్వం సేకరించి ధాన్యం ఈ రైస్ మిల్లులో ఉంచిన సకాలంలో మరాడించి ప్రజా పంపిణీకీ బియ్యం ఇవ్వడంలో డిపాల్టు కావడంతో ఆలస్యంపై మిల్లులపై తనిఖీలు చేయగా కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులో లేకపోవడంతో మిల్లుపై కేసు నమోదు చేయగా కోర్టు నుండి స్టే తెచ్చుకుని. వ్యాపారం కొనసాగిస్తున్నాడు. అయితే ఈసంవత్సరం పత్తి మిల్లులో అగ్నిప్రమాదం జరగడంపై. మార్కెట్లో పలువురు వ్యాపారస్తులు అగ్ని ప్రమాదం పై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.ఈ సంవత్సరం అగ్ని ప్రమాదం జరగడం పై ఇన్సూరెన్స్ కంపెనీ నుండి నష్టపరిహారం పొందేందుకు ప్రయత్నమా అని ఆరోప ణలున్నాయి.జిన్నింగ్ మిల్లుల్ లో తరుచుగా జరుగుతున్న అగ్నిప్రమాదాలపై లోతైన దర్యాప్తు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వ్యాపారస్తులు. ప్రజలు అంటున్నారు.

## రేషన్ డీలర్ షాపులో సన్న బియ్యం , ప్రజలకు బ్యాగులు పంపిణీ .

**అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి,నవంబర్ 08.**

నారాయణపేట మండలం ఊట కుంట తాండ , గ్రామపంచాయతీ లో రేషన్ డీలర్ షాపులో ప్రజలకు సన్న బియ్యం ప్రజా ప్రభుత్వం పేరుతో సన్న బియ్యం తీసుకెళ్లే ప్రజలకు ఈరోజు గ్రామంలో నీ రేషన్ డీలర్ షాపులో బ్యాగుల పంపిణీ చేశారు ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు బాలు పవర్ నాయక్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు రేషన్ డీలర్ షాపుల్లో ఇంటికి ఒక రేషన్ కార్డు చొప్పున , ప్రతి లబ్ధిదారునికి బ్యాగులు ఇవ్వడం జరుగుతుందని అన్నారు, ప్రజలు కూడా ప్రభుత్వం ఇస్తున్న సన్న బియ్యాన్ని ఇంటికి తీసుకెళ్లాలని పక్కదారి పట్టించే విధంగా ఉండొద్దని ప్రజలకు వారు సూచించారు,కార్యక్రమంలో రేషన్ డీలర్ పద్మమ్మ పందు నాయక్ సీతారామ నాయక్, లు పాల్గొన్నారు.



## నవ వధూ.వరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి....



కొల్చారం, నవంబర్ 08 (అక్షరక లం):-

హైదరాబాద్ హిమాయత్ నగర్ కొల్చారం మండలం అంసాన్ పల్లి గ్రామానికి చెందిన ఇంద్రసేనా రెడ్డి కుమారుని వివాహం హిమాయత్ నగర్ లో శనివారం జరిగింది, ఈ వివాహానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి హాజరై నవ దంపతులను అక్షంతలు వేసి ఆశీర్వదించారు. ఆమె వెంట సీనియర్ జర్నలిస్ట్ చౌరి గారి నాగభూషణం, కొల్చారం మండలం కు చెందిన సీనియర్ నాయకులు, మొ హీనుద్దీన్, మేఘమాల సంతోష్ కుమార్ , కొమ్ముల యాదయ్య గౌడ్,గౌరీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## కొల్చారం మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు...





కొల్చారం, నవంబర్ 08 (అక్షర కలం):-

మెదక్ జిల్లా మండల కేంద్రమైన కొల్చారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు ఘనంగా నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి పలాలను అందజేస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి నిండు నూరేళ్ల సుఖసంతోషాలతో ఉండాలని కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా మెదక్ జిల్లాలోని మండల కేంద్రమైన కొల్చారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శనివారం కేక్ కట్ చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొల్చారం మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు మధుసూదన్ రెడ్డి, గోవర్ధన్,గొండ కృష్ణ, వెంకట్ గౌడ్, యేనగండ్ల రమేష్,శివప్పగారి శ్రీశైలం,గడ్డమిది నర్సింలు, గడ్డమిది శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన 11 వ జోనల్ మీట్....

- గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించిన డి.ఎస్.పి ప్రసన్నకుమార్..



మెదక్, నవంబర్, 08(అక్షర కలం):-

గత మూడు రోజులుగా మెదక్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ మరియు కళాశాలలో జరుగుతున్న రాజన్న సిరిసిల్ల జోనల్ స్థాయి గేమ్స్ ముగింపు కార్యక్రమానికి మెదక్ డి ఎస్ పి ప్రసన్న కుమార్ ముఖ్య అతిథి గాహాజరయ్యారు. గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందచేశారు, ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ప్రిన్సిపాల్ లు పద్మావతి,సత్యవతి,అనురాధ,సంధ్యారాణి,వర్గల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్,ఉపాధ్యాయులు,వివిధ స్కూల్ ల పేట్ ,పీడీ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యార్థిని కంటి చూపు శస్త్ర చికిత్సకు చేయూత

అక్షర కలం, మందమర్రి నవంబర్ 08:



పట్టణానికి చెందిన డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న శ్రావణి అనే విద్యార్థిని కంటి చూపూ శస్త్ర చికిత్సకు పదివేల రూపాయలను వల్లభాపురపు సూర్యనారాయణ -పున్నమ్మ మెమోరియల్ టాలెంట్ కల్చరల్ ఆర్ట్స్, సమిష్టి చేయూత అందించింది. వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సునార్కర్ రాంబాబు పలువురు దాతల సహాయంతో పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.

# కొండెక్కిన "కొబ్బరికాయ"

### అమాంతం పెరిగిన ధరలు

### గత ఏడాదితో పోలిస్తే రెండింతలు

### భక్తులపై అదనపు భారం

### భారీ తుపాన్ల కారణంగా దెబ్బతిన్న కొబ్బరి తోటలు

### వేసవి నాటికి మరింత పెరగనున్న ధరలు

అక్షరకలం ప్రతినిధి, నల్గొండ





ఆలయాలకు వెళ్లే భక్తులు తప్పనిసరిగా తమ కోర్కెలు తీర్చాలని దేవుళ్లకు కొబ్బరి కాయలు కొట్టి మొక్కుకుంటారు. అనుకున్న కోరికలు తీరితే మరోసారి వెళ్లి కొబ్బరికాయలు కొట్టి దర్శనం చేసుకొని వస్తుంటారు. మరి కొందరు ఆధ్యాత్మిక చింతనలో భాగంగా ప్రతి వారం ఆలయాలకు వెళ్తుంటారు. ఇలా లక్షల మంది భక్తులు నిత్యం ఆలయాలకు వెళ్తుంటారు. కానీ దేవుడికి ఇష్ట మైన కొబ్బరికాయ ధర చుక్కలు చూపిస్తుండటంతో భక్తులపై అదనపు భారం పడుతోంది.

#### అమాంతం పెరిగిన ధర...

2023లో రూ.20 ఉన్న కొబ్బరికాయ ధర 2024 నాటికి రూ. 30కి చేరింది. ప్రస్తుతం ధర అమాంతం పెరిగి రెండింతలు అయింది. సాధారణ రోజుల్లో రూ.35కు విక్రయిస్తుంటే పండగ, ప్రత్యేక రోజుల్లో రూ.40 నుండి 50కి విక్రయిస్తున్నారు. ఇక ఆలయాల వద్ద కొబ్బరి కాయల విక్రయ నిర్వహణను వేలం పాటలో దక్కించుకున్న వారు మరో పది అదనంగా పెంచి అమ్ముతున్నారు. వారిని ఇటు దేవాదాయ శాఖ అధికారులు గానీ, మరే ఇతర అధికారి కూడా ప్రశ్నించలేని పరిస్థితి ఉందని భక్తులంటున్నారు.

#### రెండింతలు....

ఏడాది వ్యవధిలోనే ధర రెండింతలైంది. ప్రస్తుతం ఏపీ, తమిళనాడు రాష్ట్రాలో భారీ తుపాన్ల కారణంగా కొబ్బరి తోటలు దెబ్బతినటంతో ధర మరింత పెరిగే అవకాశం ఉందని విక్రయదారులంటున్నారు. ఏడాది ముగిసే నాటికీ రూ. 60 వరకు పెరిగే అవకాశముందని అంటున్నారు.

#### కొబ్బరి నీళ్లు దూరమయ్యే పరిస్థితి...

వేసవిలో మండుటెండల నుంచి రక్షణ కోసం సామాన్యులు సైతం కొబ్బరి నీళ్లను తాగుతుంటారు. వచ్చే వేసవి నాటికీ ధర రూ. 80 వరకు పెరిగే అవకాశం ఉందని విక్రయదారులంటున్నారు. ధర విపరీతంగా పెరిగితే కొబ్బరి నీళ్లు కూడా మాకు దూరమయ్యే పరిస్థితి ఉంటుందని సామాన్యులంటున్నారు.

#### భక్తులపై భారం..

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రధాన, గ్రామీణ ప్రాంతాల్లో అన్నీ కలిపి సుమారు 5 వేలకు పైగా ఆలయాలున్నాయి. చిన్న ఆలయాలను పక్కన బెడితే రోజువారీగా భక్తులు మొక్కలు తీర్చటానికి 1.30 లక్షల వరకు కొబ్బరి కాయలను కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. పెరిగిన ధర కారణంగా భక్తులపై రోజువారీగా సుమారు రూ.20 లక్షల అదనపు భారం పడుతోంది. కొబ్బరి ద్వారా ఉత్పత్తయ్యే ఎండుకొబ్బరి, నూనె తదితరాల ధరలు కూడా పెరిగే అవకాశం ఉంది.

## డివైడర్ ను ఢీ కొట్టి దగ్ధమైన ఇన్నోవా కారు

కారులో 8 మంది కి తప్పిన పెను ప్రమాదం



చిట్యాల : (నవంబర్ 8) అక్షర కలం



నల్గొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి జాతీయ రహదారి యూటర్న్ వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శనివారం రోజున ఉదయం నాలుగు గంటల సమయంలో హైదరాబాద్ నుండి చెన్నై వెళ్తున్న %ూ 08 జీచీ% 4970 నెంబర్ గల ఇన్నోవా కారు గుండ్రాంపల్లి సమీపంలో ఉన్న డివైడర్ ను ఢీ కొట్టి మల్టీ పడడంతో ఇనోవా కారు లో మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ కారులో 8 మంది ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు ఉన్నారు. వారికి ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా సురక్షితంగా బయటపడ్డారు. కారు రోడ్డుపై అడ్డంగా పడి మంటలు చెలరేవుతున్న సమయంలో జాతీయ రహదారి 65 పై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఘటనా స్థలానికి ఫైర్ సిబ్బంది చేరుకొని కారులో చెరలేవుతున్న మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. చిట్యాల పోలీస్ సిబ్బంది , జాతీయ రహదారి టోల్ సిబ్బంది కలిసి ట్రాఫిక్ ను నియంత్రణ చేశారు. ఈ ఘటనపై పూర్తిగా దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్సై మామిడి రవి కుమార్ తెలియజేశారు.

#### ప్రాణాలకు తెగించి 8 మంది కాపాడిన లారీ డ్రైవర్లు

ఈ ప్రమాదంలో దగ్ధం అవుతున్న కారు నుండి ప్రయాణికులను చూసి హైవేపై వస్తున్న తమ లారీలను నడుపుకుంటూ వస్తున్న ముగ్గురు లారీ డ్రైవర్లు రామకృష్ణ, అశోక్, షరీఫ్ లు ఇన్నోవా కార్ డోర్లు తీసి 8 మంది ప్రాణాలను కాపాడారు. కాపాడిన వారిలో ఒకరు అయ్యప్ప మాల ధరించి ఉన్నాడు. తోటి వారిని కాపాడే ప్రయత్నంలో మాలధారులు ఉన్న వ్యక్తికి వీరికి తీవ్ర గాయాలయ్యాయి. కాళ్లు చేతులు కాలుతున్న లెక్కచేయకుండా 8 మంది ప్రాణాలు కాపాడడంతో రియల్ హీరోలుగా నిలిచారు. వీరిని చౌటుప్పల్ హాస్పిటల్ తరలించగా మెరుగైన వైద్యం కోసం అక్కడినుండి హైదరాబాదులోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారని సమాచారం..

## ఎంపీ వద్దిరాజు ద్విచక్ర వాహనంపై తిరుగుతూ ఎన్నికల ప్రచారం

అక్షర కలం/ హైదరాబాద్:



బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై గల్లీగల్లీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఎంపీ రవిచంద్ర తాను ఇంఛార్జీగా వ్యవహరిస్తున్న యూసఫ్ గూడ డివిజన్ లక్ష్మీనరసింహా నగర్,యూసఫ్ గూడ బస్తీ,ప్రగతినగర్, కృష్ణానగర్ తదితర చోట్ల బీఆర్ఎస్ నాయకులతో కలిసి ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ విస్తృత ప్రచారం చేశారు.ఈ సందర్భంగా "జై తెలంగాణ జైజై తెలంగాణ","వర్ధిల్లాలి వర్ధిల్లాలి కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి","జిందాబాద్ జిందాబాద్ బీఆర్ఎస్ జిందాబాద్","బీఆర్ఎస్ కారు గుర్తుకే మన ఓటు","గెలిపిద్దాం గెలిపిద్దాం బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు ఓటేసి గెలిపిద్దాం"అంటూ నినాదాలిస్తూ ముందుకు సాగారు.

## నల్లగొండ జిల్లా స్థాయి కరాటే పోటీలలో స్కూల్ ఆఫ్ ఆక్స్ఫర్డ్ విద్యార్థుల ప్రతిభ



అక్షర కలం నాగార్జునసాగర్....

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ నలగొండ సంస్థ నిర్వహించిన నల్లగొండ జిల్లా స్థాయి కరాటే టోర్నమెంట్ కం సెలక్షన్స్ లో నాగార్జునసాగర్ స్కూల్ ఆఫ్ ఆక్స్ఫర్డ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారని ప్రిన్సిపాల్ ఏ శివకుమార్ తెలిపారు. ఈనెల 7వ తారీకున నల్లగొండ మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి కరాటే టోర్నమెంట్ కం సెలక్షన్స్ లో అండర్ 17 - 80 కిలోల విభాగంలో సయ్యద్ అబ్దుల్ ముసాఫిర్ బంగారు పతకం, అండర్ 17-68 కిలోల విభాగంలో ఎస్ వి ఎన్ ఎం కృష్ణ సాయి బంగారు పతకం, అండర్ 14- 35 కిలోల విభాగంలో బణావత్ వెంకటేష్ సిల్వర్ పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ లు మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివే విద్యార్థులకు విశాలమైన తరగతి గదులలో ఉత్తమ విద్యతోపాటు ఆత్మ రక్షణకు కరాటే, విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంచడానికి డ్రాయింగ్ విభాగంలో ఉత్తమ ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఏ శివకుమార్, కరస్పాండెంట్ కె నకులరావు, కరాటే మాస్టర్ వెంకట్, స్కూల్ ఆఫ్ ఆక్స్ఫర్డ్ ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

## బదిలీపై వెళ్తున్న అధికారికి ఘన సన్మానం

అక్షర కలం, మందమర్రి నవంబర్ 08:



సింగరేణి ఏరియా పర్సనల్ మేనేజర్ గా సేవలందించి, బదిలీపై భూపాలపల్లి ఏరియాకు వెళ్తున్న ఎస్ శ్యాంసుందర్ ను శనివారం ఏరియా జిఎం కార్యాలయంలో ఏరియా ఉన్నత అధికారులు, పర్సనల్ విభాగం అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ ను శాలువాతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను బహుకరించారు. ఈ సందర్భంగా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్ మాట్లాడుతూ, ప్రతి ఒక అధికారి ఉన్న స్థలం నుండి వేరొక స్థలానికి బదిలీపై వెళ్లడం అనివార్యమని తెలిపారు. మనం చేసే పని బాధ్యతగా చేయాలని సూచించారు. అనంతరం ఏరియా ఉన్నత అధికారులు పర్సనల్ విభాగం అధికారులు మాట్లాడుతూ, ఏరియా పర్సనల్ మేనేజర్ గా ఎస్ శ్యాంసుందర్ ఏరియాలో చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డివైపిఎం ఆసిఫ్, సీనియర్ పిఓ సందీప్, కార్తీక్, సత్యనారాయణ, శంకర్, వంశీ, భార్గవ్, జీస, మదర్ సాబ్, సందీప్, సంక్షేమ అధికారిని రవళి, పర్సనల్ విభాగం కార్యాలయ సూపరింటెండెంట్ రాజలింగు, గనుల సంక్షేమ అధికారులు, పర్సనల్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



# ఉచిత కంటి పరీక్షా శిబిరము

అక్షర కలం/ భద్రాచలం

ది.పది.పదకొండు.రెండువేల ఇరవై ఐదు సోమవారం భద్రాచలంలోని పాత ఎల్ఐసి ఆఫీసు ఎదురుగా ఉన్న ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ కార్యాలయం నందు వరంగల్ శరత్ మాక్సిజన్ కంటి వైద్యులచే ఉచితముగా కంటి పరీక్షలు నిర్వహిస్తారు. హెల్త్ కార్డు కలిగిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు, జర్నలిస్టులు, పోలీస్ డిపార్ట్మెంట్ వారందరికీ ఉచితముగా కంటి పరీక్షలు నిర్వహించి క్యాటరాక్టు కలిగిన వారిని అదే రోజు వారి సొంత వాహనాలలో తీసుకొని వెళ్లి ఆపరేషన్ చేసి తిరిగి మన భద్రాచలం కార్యాలయంలో దింపుతారు. ఉచితంగా మందులు ,ఉచిత రవాణా సౌకర్యము, ఉచిత భోజన వసతి సౌకర్యాలు కల్పిస్తారు. అలాగే తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి కూడా ఉచితంగా పరీక్షలు మాత్రమే నిర్వహిస్తారు కావున ఈ అవకాశాన్ని వినియోగించుకొని ది: పది.పదకొండు.రెండువేల ఇరవై.ఐదు..సోమవారం ఉదయం పది గంటలనుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తారు. శిబిరానికి వచ్చినప్పుడు హెల్త్ కార్డు తప్పనిసరిగా తీసుకురావలసిందిగా ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు. ప్రధాన కార్యదర్శి కె ఎస్ ఎల్ వి ప్రసాద్. డి కృష్ణమూర్తి కోశాధికారి ఒక ప్రకటనలో తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చంద్ర సుబ్బయ్య చౌదరి,ఎస్ రాజబాబు, టి శివప్రసాద్, సంఘం సలహాదారు మాదిరెడ్డి, రామ్మోహనరావు, దుర్గాప్రసాద్, నాళం సత్యనారాయణ, జి మురళీకృష్ణ, పంపన సత్యనారాయణ, బి రాజు, వీ రాంబాబు, చుక్కా రాంబాబు, ఐ వి సత్యనారాయణ, వీరభద్ర రావు, అక్కయ్య, బైరు నరసింహారావు, పాల్గొన్నారు.




## భద్రాచలం ప్రెస్ క్లబ్ బ్రోచర్ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చేతుల మీదుగా ఆవిష్కరణ



అక్షర కలం/ భద్రాచలం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం....నూతనంగా ఏర్పాటు చేసిన భద్రాచలం ఎలెక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ బ్రోచర్ ను ఈరోజు ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చేతుల మీదుగా ఆవిష్కరణ జరిగింది.ఇటీవల నూతనంగా శాటిలైట్ చానల్స్ సభ్యులతో కలిసి రిజిస్ట్రేషన్ చేసిన భద్రాచలం ఎలెక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ సభ్యులతో కలిసి ఈరోజు ఉదయం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చేతుల మీదుగా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎలెక్ట్రానిక్ మీడియా గౌరవ అధ్యక్షులు కుప్పాల నాగరాజు సుమన్ టీవీ,ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పోకల శ్రీనివాస్ %జ6 అవషం%, కార్యదర్శి బాల కిరణ్ %ూదీచీ%,ఉపాధ్యక్షుడు జస్వంత్ 99 టీవీ,సహాయ కార్యదర్శి తమ్మల్ల రాజేష్ %ఎవీ% టీవీ,ప్రచార కార్యదర్శి ప్రేమ్ కుమార్ సాక్షి టీవీ,కోశాధికారి లంకా రాజేష్ రాజ్ న్యూస్,క్లబ్ సభ్యులు,రాజు 6 టీవీ,సురేష్ ప్రైమ్ 9,రవి మెగా 9,పాల్గొన్నారు.

## విజయవంతంగా 11వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు






అక్షర కలం/ వైరా:

11వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు వైరా స్థానిక టి.జి.ఎస్.డబ్ల్యు.ఆర్.ఎస్. జూనియర్ కళాశాల (బాలికలు)లో ఘనంగా నిర్వహించబడ్డాయి. శనివారం ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో క్రీడలు, ఆటల ప్రాముఖ్యతను వివరించారు. విజయం సాధించాలనే ప్రయత్నం చేయాలని, అపజయంలోనూ ధైర్యంగా ఉండాలని, జీవితంలో ధైర్యం ఎప్పుడూ వదిలి పెట్టకూడదని విద్యార్థులకు సూచించారు. లక్ష్య సాధనలో కృషి, నిబద్ధత, పట్టుదల ఎంతో ముఖ్యమని వివరించారు.ఈ సందర్భంగా అండర్-14, 17, 19 విభాగాల్లో గెలిచిన విజేతలకు, రన్నర్ అప్స్కు బహుమతుల ప్రదానం చేశారు. ప్రతి విద్యార్థి భాగస్వామ్యానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ప్రిన్సిపల్, ఫిజికల్ డైరెక్టర్, పి.ఈ.టి. లను, స్కూల్ టీమ్ కృషిని అదనపు కలెక్టర్ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మల్టీ జోనల్ అధికారి కె.అలివేలు, డిసిఓ ఎం. రాజ్యలక్ష్మి, స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సమత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండ జిల్లా స్థాయి కరాటే పోటీలలో స్కూల్ ఆఫ్ ఆక్స్ఫర్డ్ విద్యార్థుల ప్రతిభ ...

అక్షర కలం నాగార్జునసాగర్....

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ నలగొండ సంస్థ నిర్వహించిన నల్లగొండ జిల్లా స్థాయి కరాటే టోర్నమెంట్ కం సెలక్షన్స్ లో నాగార్జునసాగర్ స్కూల్ ఆఫ్ ఆక్స్ఫర్డ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారని ప్రిన్సిపాల్ ఏ శివకుమార్ తెలిపారు. ఈనెల 7వ తారీకున నల్లగొండ మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి కరాటే టోర్నమెంట్ కం సెలక్షన్స్ లో అండర్ 17 -80 కిలోల విభాగంలో సయ్యద్ అబ్దుల్ ముసాఫిర్ బంగారు పతకం, అండర్ 17-68 కిలోల విభాగంలో ఎస్ వి ఎన్ ఎం కృష్ణ సాయి బంగారు పతకం, అండర్ 14-35 కిలోల విభాగంలో బణావత్ వెంకటేష్ సిల్వర్ పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ లు మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివే విద్యార్థులకు విశాలమైన తరగతి గదులలో ఉత్తమ విద్యతోపాటు ఆత్మ రక్షణకు కరాటే, విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంచడానికి డ్రాయింగ్ విభాగంలో ఉత్తమ ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఏ శివకుమార్, కరస్పాండెంట్ కె నకులరావు, కరాటే మాస్టర్ వెంకటట్, స్కూల్ ఆఫ్ ఆక్స్ఫర్డ్ ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.




## కూసుమంచి క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు





అక్షర కలం/ కూసుమంచి:

కూసుమంచి : కూసుమంచిలోని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయ ఇన్చార్జి భీమిరెడ్డి శ్రీనివాస రెడ్డి పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భీమిరెడ్డి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.... ఇళ్లులేని కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు, రైతులకు సహాయం, యువతకు ఉపాధి అవకాశాలు ఇవన్నీ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకువస్తున్న మార్పుల సంకేతాలని పేర్కొన్నారు. పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే సంక్షేమ పాలన రాష్ట్రంలో అమలవుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి టీవీవీపీ ఆసుపత్రులు భేష్

. ఏజెన్సీ ప్రాంతమైన సేవలు అద్భుతం

. సి ఆర్ ఎం- జాతీయ బృందం కితాబు

అక్షర కలం/ భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:

జిల్లాలో వైద్య సేవలు, ప్రమాణాలు పరిశీలించడాని వచ్చిన సి ఆర్ ఎం కామన్ రివ్యూ మిషన్ బృంద సభ్యులు దాక్టర్ జి బి సింగ్ రాష్ట్ర స్థాయి లో నిన్న ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో జిల్లాలో తాము పరిశీలించిన ఇల్లందు, భద్రాచలం ఆసుపత్రుల సేవలపై ప్రత్యేక ప్రస్తావన తెచ్చారు .మారుమూల ప్రాంతాల్లో సైతం స్పెషలిస్ట్ వైద్య సేవలు అద్భుతంగా అందుతున్నాయని, మంచి ప్రమాణాలు సైతం పాటిస్తూ నాణ్యమైన వైద్యం అందిస్తున్నారని కొనియాడారు .అన్ని స్థాయిలలో సిబ్బంది సైతం ఎంతో శ్రద్ధ,అంకిత భావంతో తో సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఆసుపత్రులలో అన్ని వార్డుల ను క్షుణ్ణంగా పరిశీలించినప్పుడు చాలా మంది రోగులతో తాము మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నామని , వైద్య సేవల పై అందరూ చాలా సంతృప్తిగా ఉన్నారని అన్నారు. ఆసుపత్రులులో వార్డులు, ఆపరేషన్ థియేటర్ ,లేబర్ రూమ్ లు చాలా బాగా నిర్వహిస్తున్నారని,సానిటేషన్ కూడా బాగుందని కితాబిచ్చారు.జిల్లాలోని దయలిసిస్ సేవలు కూడా చాలా బాగున్నాయని అన్ని సెంటర్స్ లో అన్ని బెడ్స్ నిండి ఉన్నాయన్నా సంగతి తాము గమనించామని తెలిపారు.ఇల్లందు ఆసుపత్రి లో భవన స్థలం తక్కువ ఉన్నప్పటికీ సేవలు స్థాయికి మించి చేస్తున్నారని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో సైతం రేడియాలజిస్ట్ ,మత్తు వైద్యులు ,ఇతర స్పెషలిస్ట్ వైద్యులు సరిపడా స్థాయిలో ఉండడం ,టిఫా స్కాన్ సేవలు సైతం ఉండడం విశేషం అని తెలిపారు. భద్రాచలం ఆసుపత్రి జిల్లాకే గర్వకారణం అని, 200





పడకలతో ఐసీయూ,ఎస్ ఎన్ సి యు ,ఎన్ ఆర్ సి ,ఆపరేషన్ థియేటర్ సేవలు అద్భుతంగా ఆదర్శంగా ఉన్నాయన్నారు. తీవ్ర స్థాయిలో సిబ్బంది కొరత ఉన్న వాటిని అధిగమించి అక్కడ ఉన్న సిబ్బంది ఎంతో కష్టపడి పనిచేస్తున్నారని కితాబిచ్చారు. సిబ్బంది కొరత తీరితే మరింత సేవలను అందించే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అన్ని స్థాయిలో ఆసుపత్రిలో ప్రమాణాల విషయం లో నిరంతరంగా శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని సూచించారు. ఆసుపత్రులలో మౌలిక వసతులు , సీ ఎస్ ఆర్ నిధుల వినియోగం ఇతర విషయాలలో జిల్లా కలెక్టర్ మద్దతు, ప్రోత్సాహం బాగుందని వారు తెలిపారు. ఈ సమావేశం లో సి ఆర్ ఎం సభ్యులతో పాటు రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమీషనర్ సంగీత సత్యనారాయణ, టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ కుమార్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్, భద్రాద్రి జిల్లా డి సి హెచ్ ఎస్ డాక్టర్ రవి బాబు,డీఎంహెచ్ ఓ డాక్టర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు..

## ఘనంగా నారాయణా ప్రీమియర్ లీగ్ - జోనల్ స్పోర్ట్స్ మీట్





అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

ఖమ్మం : నారాయణా విద్యాసంస్థల ఆధ్వర్యంలో "నారాయణా ప్రీమియర్ లీగ్ %-% జోనల్ స్పోర్ట్స్ మీట్" ఎంతో ఉత్సాహభరితంగా మరియు క్రీడాస్ఫూర్తితో నిర్వహించబడింది . ఈ క్రీడా వేడుకకు వేదికగా ఎస్ఆర్ అండ్ బిజీ ఎన్ఆర్ గ్రౌండ్స్ లో జరిగాయి . ఈ క్రీడా పోటీలలో పాల్వంచ, సత్తుపల్లి , ఖమ్మం ఓఎన్ సి ఎస్ మరియు ఖమ్మం ఇఎన్ సిఎస్ బ్రాంచుల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారు . ఈ కార్యక్రమానికి ఏజీఎం ప్రధాన అతిథిగా హాజరై విద్యార్థులను ఉత్సాహపరిచారు . ఆయన మాట్లాడుతూ %-% "నారాయణ విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లో కూడా ముందుండాలి . క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ , ఆత్మవిశ్వాసం , జట్టు భావన , నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయి" అని అన్నారు . అలాగే హైస్కూల్ కోఆర్డినేటర్ ప్రవీణ్ మరియు ప్రిన్సిపాళ్లు రేఖ , రామమూర్తి , నరసింహారావు , అమల విద్యార్థులను ప్రోత్సహిస్తూ క్రీడా ప్రాముఖ్యతను వివరించారు . వారు ప్రతి పాల్గొనే విద్యార్థిని ఆత్మవిశ్వాసంతో ముందుకు నడిపారు . ఈ జోనల్ స్పోర్ట్స్ మీట్ విజయవంతం కావడంలో పిఇటి లు చందు , వీరు , గోపి , రాజు , వినయ్ కీలకపాత్ర పోషించారు . జోన్ల మధ్య ఉత్సాహపూర్వక పోటీలు జరిగి , విద్యార్థుల క్రీడాస్ఫూర్తి అందరినీ ఆకట్టుకుంది . విజేతలకు పతకాలు , ప్రశంసాపత్రాలు , ప్రత్యేక బహుమతులు అందజేయబడ్డాయి . ఈ క్రీడా వేడుక విద్యార్థుల్లో క్రీడాప్రేమను పెంపొందించి, "ఆరోగ్యమే మహాభాగ్యం %-% క్రీడలే జీవితానికి శక్తి" అనే సందేశాన్ని అందించింది .

## ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల వద్ద సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

హైదరాబాద్ అక్షర కలం

ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ఆవరణలో కేక్ కట్ చేసి అనంతరం మొక్కలు నాటారు. తిరుపతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గడచిన పదేళ్లలో జరగని అభివృద్ధిని సీఎం రేవంత్ రెడ్డి 22 నెలల కాలంలో చేసి చూపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నిరుద్యోగులకు 70000 ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. వీలైనంత తొందరలో ఖాళీలను భర్తీ చేస్తానని మాట కూడా రేవంత్ రెడ్డి ఇచ్చారని గుర్తుచేశారు. అలాగే గతంలో ఓయూలో పర్యటించినప్పుడు సీఎం రేవంత్ రెడ్డి ఓయూ అభివృద్ధికి 1000 కోట్ల రూపాయల నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని తెలపడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో భీమ్ రావు నాయక్ కాంగ్రెస్ ఎస్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్, అరుణ్, కరుణాకర్,రమేష్,రాజేందర్, శివ, ప్రణయ్, శ్రీనివాస్, సంతోష్, మహేష్, నరేష్, బాలు, కుమార్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు.





**అక్షర కలం, నారాయణపేట, జిల్లా ప్రతినిధి, నవంబర్ 08.**

నారాయణపేట: నారాయణపేట పట్టణ కేంద్రంలోని సివిఆర్ భవన్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు కోట్ల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు, ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచుకున్నారు, జిల్లా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు అభివృద్ధి పనులను చేపడుతున్నారని ఆ అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని యూత్ కాంగ్రెస్ కి ఆయన పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శరణప్ప, మాజీ కౌన్సిలర్ సతీష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు యూసుఫ్ తాజ్, ఉపాధ్యక్షులు పళ్ళ అనిల్, మజీద్, రవి గౌడ్, చిట్టెం సత్య రెడ్డి, శ్రీ, అభి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి,సీతారాం రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో... ఇంటింటి ప్రచారం...

# మంచి స్పందన ఎంపీ....



**కొల్చారం, నవంబర్ 08( అక్షర కలం ):-**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా శనివారం ఉదయం షాపుల్లో , హెూటల్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి జోరుగా ఇంటింటి ప్రచారం నిర్వహించడంతో ప్రజల నుంచి



మంచి స్పందన వచ్చిందని ఎంపీ తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎంపీ సురేష్ షేట్కర్, మాజీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మొహి నుద్దీన్ కలిసి మధ్యాహ్నం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి చేతి గుర్తుకు ఓటు వేయాలని శనివారం ఉదయం నుంచి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో ప్రజల నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మంచి స్పందన వచ్చిందని, తప్పకుండా చేయి గుర్తుకు ఓటు వేస్తామని అన్నారని తెలిపారు. ప్రచారంలో ఎంపీ సురేష్ సెట్కర్ మాజీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మొహియుద్దిన్ లు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పది సంవత్సరాలు అధికారంలో బి ఆర్ఎస్ , బిజెపి పార్టీలు ప్రజలకు ఓర్గబెట్టిందేమీ లేదని వారు తెలిపారు. గత పోయిన అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని వారు గుర్తు చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు ప్రజలు పట్టం కడతారని వారు తెలిపారు. ఈ ప్రచారంలో ఎంపీ తో పాటు మాజీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మొ యినుద్దీన్, జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు వాళ్ల సంతోషంతో తప్పకుండా నవ్వి యాదవ్ అన్న గెలుస్తాడని నమ్మకంతో విజయోత్సవం చేస్తున్నారు. ఈ ప్రచారంలో ఎంపీ సురేష్ షే ట్కర్ మాజీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మొయి నుద్దీన్, అసెంబ్లీ నియోజకవర్గం ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల ఆస్థి ఎల్ఐసి పరిరక్షణ కోసం ఏజెంట్లు సైనికుల్లా పని చేయాలి-ఎం సాయిబాబు..

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

దేశ ప్రజల కష్టార్జితంతో నిర్మించబడిన సంస్థ ఎల్ఐసి అని, ఆ సంస్థ రక్షణ కోసం ఎల్ఐసి ఏజెంట్లు సైనికుల్లా పనిచేయాలని సిఐటియు జాతీయ కోశాధికారి కామ్రేడ్ ఎం సాయిబాబు పిలుపునిచ్చారు. ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి ఎఒఐ) సౌత్ సెంట్రల్ జోనల్ 6వ మహాసభలు శనివారం నాడు ఖమ్మం నగరంలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్ నందు ప్రారంభమయ్యాయి. ఈ మహాసభను ప్రారంభించిన ముఖ్య అతిధైన సాయిబాబు మాట్లాడుతూ 1956 ముందు దేశంలోని ఉన్న రెండు వందలకు పైగా ప్రైవేట్ కంపెనీలు ప్రజల సొమ్మును దోచుకున్నాయన్నారు. ఆ దోపిడీని నివారించి ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రైవేటు ఇన్సూరెన్స్





కంపెనీలను రద్దుచేసి 1956లో ఎల్ఐసి ని ఏర్పాటు చేశారని అన్నారు. అప్పటినుండి ప్రజల మెప్పు పొంది 57 లక్షల కోట్ల ఆస్తులతో, 30 కోట్ల మంది పాలసీదారులతో ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఇన్సూరెన్స్ కంపెనీగా అవతరించిందన్నారు. 99.5% క్లెయిమ్ ల చెల్లింపు రికార్డుతో నమ్మకమైన ఇన్సూరెన్స్ కంపెనీగా ప్రజలకు సేవలు అందిస్తుంది అన్నారు. భారతదేశంలో నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమైన తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఇన్సూరెన్స్ కంపెనీలను రంగంలోకి తెచ్చి ఎల్ఐసి ని ప్రజలకు దూరం చేసే కుట్ర ప్రారంభించారని అన్నారు మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క ఎల్ఐసి నే కాకుండా బ్యాంకులు, రైల్వేలు, బొగ్గు, రక్షణ, విద్యుత్తు మొదలైన అనేక రంగాల్లో కూడా ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించే చర్యలు వేగవంతం చేసిందన్నారు. ఈ చర్యలను అడ్డుకుని ఎల్ఐసి ని కాపాడేందుకు ఎల్ఐసి ఏజెంట్లు సైనికుల్లా పోరాడాలని, ఈ పోరాటంలో మిగతా ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, కార్మికులను కూడా కలుపుకొని ఐక్య పోరాటాలు నిర్మించాలని సాయిబాబు పిలుపునిచ్చారు.ఎల్ఐసి అఖిలభారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామ్రేడ్ సురజిత్ కుమార్ బోస్, కామ్రేడ్ పి.జి.దిలీప్ మాట్లాడుతూ ఎల్ఐసిని ఐపీఓలో లిస్టింగ్ చేసిన తర్వాత ఎల్ఐసి అభివృద్ధిలో మూల స్తంభం గా ఉన్న ఎల్ఐసి ఏజెంట్లకు నష్టం కలిగించే అనేక ప్రతిపాదనను ముందుకు వచ్చాయన్నారు. గత సంవత్సరం ఏడు శాతం కమిషన్ తగ్గించడం ఇందులో భాగమేలు అన్నారు. అది సరిపోదన్నట్లు రాబోయే కాలంలో కమిషన్ తగ్గించడంతోపాటు ఇతర సౌకర్యాలకు కోత పెట్టాలని కేంద్ర ప్రభుత్వం, ఐఆర్డిఏఐ రెండూ కలసి ఎల్ఐసి యాజమాన్యంపై ఒత్తిడి తెస్తున్నాయని విమర్శించారు. ఈ చర్యలను తమ యూనియన్ వ్యతిరేకిస్తుందని, వీటికి వ్యతిరేకంగా ఎల్ఐసి రక్షణ, ఏజెంట్లు హక్కుల సాధన కోసం భవిష్యత్తులో ఎల్ఐసి ఉద్యోగ సంఘాలు, ఎల్ఐసి లోని ఇతర ఏజెంట్ సంఘాలను కలుపుకుని ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని ఈ పోరాటాలలో ఏజెంట్లు అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మహాసభ ప్రారంభ సూచికంగా యూనియన్ జెండాను ఎల్ఐసి ఎఒఐ జోనల్ అధ్యక్షులు ఎల్ మంజునాధ్ ఆవిష్కరించారు. మహాసభను ఉద్దేశించి నగరంలోని ప్రముఖ వైద్యులు, మహాసభల ఆహ్వాన సంఘం చైర్మన్ అయిన డాక్టర్ సి.బారవి, యూనియన్ జోనల్ ప్రధాన కార్యదర్శి పిఎల్ నరసింహారావు, ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జోనల్ అధ్యక్షులు జి తిరుపతయ్య, ఖమ్మం ఎల్ఐసి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ బాలాజీ నాయక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తాళ్లూరు శ్రీనివాసరావు తన్నీరు కుమార్ ఖమ్మం బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు పి ప్రసాద్ టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి స్కూల్ కి వేయింగ్ మిషన్ అందజేసిన కాంగ్రెస్ నేత- "చల్లా కృష్ణ"



**అక్షర కలం/ దానవాయిగూడెం:**

ఖమ్మం నగరంలో దానవాయిగూడెం 59, 60, డివిజన్లో డబల్ బెడ్ రూమ్ కాలనీలో గల అంగన్వాడి స్కూల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అనుచరుడు కాంగ్రెస్ నేత "చల్లా కృష్ణ" మంత్రి పొంగులేటి కార్యాలయ ఇన్చార్జి దయాకర్ రెడ్డి సలహా మేరకు అంగన్వాడి స్కూల్లో విద్యార్థులకు పౌష్టిక ఆహారంతో పాటు వారి ఎదుగుదల కొరకు వెయిటింగ్ మిషన్ ఎంతో అవసరమని వారికి కాంగ్రెస్ నాయకులు "చల్లా కృష్ణ" అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో "చల్లా కృష్ణ" వారి టీం, డబల్ బెడ్ రూమ్ ఆ ప్రాంత నాయకులు మహిళలు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

## నల్గొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్లో సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో శనివారం మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుబ్బ రూప పార్థివ దేహం వద్ద క్రైస్తవులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.

**అక్షర కలం నల్లగొండ**

ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతా రావు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి,పలువురు మాజీ కౌన్సిలర్లు,కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నేతలు పాల్గొని దుబ్బ రూప పార్థివ దేహానికి నివాళులర్పించారు ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ దుబ్బ రూప మరణం



పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ ఆమె కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు.అనంతరం దేవరకొండ రోడ్డులోని స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,దుబ్బ రూప కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## 48 గంటల్లో గన్ని సంచుల సరఫరా .... అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి

### జిల్లాలో ఎక్కడా గన్నీ సంచుల కొరత లేదు

### ధాన్యం కొనుగోలు కోసం గన్ని సంచుల సరఫరాపై పత్రిక ప్రకటన విడుదల చేసిన అదనపు కలెక్టర్

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ధాన్యం కొనుగోలుకు అవసరమైన మేర గన్ని బ్యాగులు అందుబాటులో ఉన్నాయని, ప్రతిపాదనలు పంపిన 48 గంటల లోపు కొనుగోలు కేంద్రాలకు గన్ని సంచులు సరఫరా చేస్తున్నామని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ -2025 ధాన్యం కొనుగోలుకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేశామని అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో పెట్టడం జరిగిందని అన్నారు. ధాన్యం కొనుగోలు అవసరాలకు మాత్రమే గన్ని సంచులు అందించడం జరుగుతుందని, రైతుల ఇంటి వద్దకు గన్ని సంచులు ఇవ్వవద్దని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఇప్పటివరకు 9 లక్షల 71 వేల 500 గన్ని సంచులు పంపిణీ చేశామని అన్నారు. గన్ని సంచుల కోసం కొనుగోలు కేంద్రాలు ఇండెంట్ పెట్టిన 48 గంటల లోగా సరఫరా చేస్తున్నామని, గన్ని సంచులకు జిల్లాలో ఎక్కడా కొరత లేదని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

**అక్షర కలం /భద్రాచలం**

భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి.జన్మదిన వేడుకలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు రాష్ట్ర ప్రజలు అభిమానించే నాయకుడు, దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సన్న బియ్యం ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి కి



హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, మండల నాయకులు, సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి, బాణసంచా కాల్చి శుభాకాంక్షలు తెలియజేసిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఈ కార్యక్రమంలో మండల నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955